ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు fb.com/vaartha
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam
2-12-2024 సోమవారం సంపుటి: 30 సంచిక: 304 పేజీలు: 12 వెల: 6.50

అక్రమ వలసదారులకు అమెరికాలో విడిది
అక్రమ చొరబాట్లలో భారతీయులే అధికం
9లో

# తుఫాను ధాటికి తీరం విలవిల

## పలు జిల్లాలలో భారీ వర్షాలు

### తిరుపతి, విశాఖ, చెన్నైల నుంచి విమాన సర్వీసులు రద్దు


నెల్లూరులో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన కాలనీలు

**విజయవాడ,డిసెంబరు1, ప్రభాతవార్తప్రతినిధి:** ఫెంగల్ తుపాను తీరం దాటినా ప్రభావం కొనసాగుతోంది. ఎపిపై తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి, నెల్లూరు సహా పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. సోమవారం కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు ఇస్తుంది. తుపాను ప్రభావంతో శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి కోనసీమ, నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి గం.10:30 నుంచి 11:30 మధ్య పుదుచ్చేరి సమీపంలో తుపాను తీరం దాటిందని ఐఎండి పేర్కొంది. తుపాను పశ్చిమనైరుతి దిశగా నెమ్మదిగా కదులుతూ క్రమంగా బలహీన పడనుందని తెలిపింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతల సమయం కావడంతో ధాన్యం తడిసిపోతుందని, వరి చేలు నేలకొరుగుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో ఉప్పాడ తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. కెరటాల ఉద్ధృతికి ఉప్పాడకాకినాడ బీచ్ >>2


తడలో ఫెంగల్ తుపాను కారణంగా మునిగిన పంట పొలాలు

## తమిళనాడు సరిహద్దులో రైతన్నకు తీవ్ర నష్టం

### నీటమునిగిన పలు గ్రామాలు, పంటపొలాలు

**తడ, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఫెంగల్ తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని పలు గ్రామాల పంట పొలాలు మునిగిపోయాయి. ముఖ్యంగా సరిహద్దుల్లోని సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో వరద తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రస్తుత తిరుపతి జిల్లాలోని పడమటి వైపు >>2

# విశాఖలో టిసిఎస్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




### ఐటిమంత్రి లోకేష్ ప్రయత్నం ఫలప్రదం

### తొలిదశలో 2వేల మందితో కార్యకలాపాలు

**విశాఖపట్నం, డిసెంబరు 1, ప్రభాతవార్త:** విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం విజయవంతమైంది. దేశంలోనే అత్యున్నత ఐటీ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) కార్యకలాపాలు విశాఖ నుంచి ప్రారంభించడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇది విశాఖ ఐటీ చరిత్రలోనే ఒక సువర్ణాధ్యాయంగా నిలవనుంది. అంతేకాకుండా టిసిఎస్ రాకను ఐటీ గేమ్ చేంజర్‌గా అభివర్ణిస్తున్నారు ఐటీ నిపుణులు. టిసిఎస్ రాకతో పెద్ద ఎత్తున ఉద్యోగాలతో పాటు రాష్ట్రానికి మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని చెప్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

దేశంలోనే అత్యంత ప్రధానమైన దిగ్గజ సంస్థ టిసిఎస్ కార్యకలాపాలను విశాఖ నుంచి ప్రారంభించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. విశాఖ ఐటీ హిల్స్‌పై డినోటిఫైడ్ ప్రదేశంలో ఉన్న భవనం తమకు కావాలని టిసిఎస్ యాజమాన్యం కోరడంతో డల్లాస్ టెక్నాలజీస్ భవనంలోని 7, 774 చదరపు మీటర్ల వైశాల్యం కలిగిన ప్రదేశాన్ని టిసిఎస్‌కు మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసింది. 2016లో డల్లాస్ టెక్నాలజీ సెంటర్ తమ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం ఈ భవనాన్ని కేటాయించింది. ఇప్పుడు ఇదే భవనంలోని కొంత భాగాన్ని టిసిఎస్ సంస్థకు ఎటువంటి అదనపు రుసుము లేకుండా సబ్ లీజుకు >>2

# ప్రభుత్వ విధానాలపై ప్రజాభిప్రాయ సేకరణ

### ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

### ఫోన్‌ద్వారా ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్: సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు.ఇంట్రాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం(ఐవిఆర్ఎస్) విధానం ద్వారా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు వీలు కుదురుతుందని స్పష్టం చేసారు. వారి అభిప్రాయాల మేరకు నడుచుకోవాలనుకుంటోంది. దీనిలో భాగంగా ఇకపై ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోనుంది. లబ్ధిదారులకే నేరుగా కంప్యూటర్ బేస్డ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆ పథకం వల్ల ప్రయోజనం, దాని అమలు, సేవల్లో నాణ్యత వంటి అంశాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనుంది. లబ్ధిదారుల నుంచి ఆయా పథకాల అమలుపై వారి అభిప్రాయం కోరుతూ కాల్స్ వెళతాయి. వాటిపై ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసుకుని పని చేయనుంది. ఇంటింటికీ పింఛన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల లబ్ధిదారుల నుంచి ఈ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. పింఛను సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా లేదా..దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా వంటి ప్రశ్నల ద్వారా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నారు.

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, అన్ని పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయం తెలుసుకోనున్నారు. ఉచిత ఇసుక విధానం అమలు, మద్యం కొత్త పాలసీ, అమ్మకాలపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలు,



కార్యక్రమాలతో పాటు రానున్న రోజుల్లో రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ వంటి పలు కీలక శాఖల్లో ప్రజలు పొందుతున్న పౌరసేవలపై కూడా ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరించనున్నారు. నేరుగా ప్రజల నుంచి వచ్చే ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే..వాటికి గల కారణాలు విశ్లేషించి సేవలను మరింత మెరుగుపరచనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన ప్రభుత్వం పని చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

ఇలా ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు ప్రజలు ఓపిగ్గా తమఅభిప్రాయాలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుతున్నారు. ఈ ఫోన్ కాల్స్‌కు ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిముషాల సమయంతో ప్రభుత్వ నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దీనికి ప్రజలు తమ వంతుగా సహకరించాలని...మంచి పాలనకు, నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. పౌరసేవలపై ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించామన్నారు.

ఇందులో భాగంగా మెరుగైన సేవల కోసం నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ జరపాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ మేరకు ఐవీఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలని చెప్పారు. ఏ అంశంపైనైనా ప్రజలు చెప్పిందే ఫైనల్ అని స్పష్టం చేశారు. నాణ్యమైన సేవల కోసం ఖచ్చితమైన అభిప్రాయం చెప్పాలని ప్రజ >>2

# రేపు కేబినెట్ భేటీ

**విజయవాడ డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఈ నెల 3న మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 4కు బదులుగా 3నే కేబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం 4 గంటలలోగా ప్రతిపాదనలు పంపాలని శాఖాధిపతులకు సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశం పంపారు. నిజానికి ఈ నెల 4వతేదిన కేబినెట్ జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది.అయితే ఒక రోజు ముందుగా నిర్వహిస్తోంది.ఈ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకునే దిశలో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

# రాజస్యసభ రేసు నుంచి తప్పుకున్న జనసేన

**విజయవాడ డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఖాళీ అవుతున్న మూడు స్థానాలకు ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చింది. ఈ ఎన్నికల పోటీ నుంచి జనసేన స్వచ్ఛంధంగా తప్పుకుంది.మొదట ఈ సీటుకు పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగేంద్రబాబు(నాగబాబు) పోటీలో ఉంటారనే ప్రచారం జరిగింది.అయితే రాజ్యసభకు తాను పోటీ చేయడం లేదని నాగబాబు స్పష్టం చేసారు.అంతే కాకుండా ఇప్పటికే కూటమి భాగస్వామ్యంలో పలు పదవులు దక్కించుకున్న తమ పార్టీని ఈపోటీకి దూరంగా ఉంచాలని పవన్ కల్యాణ్ భావించారు.అదే విషయం కేడర్‌కు వివరించారు. సిఎం చంద్రబాబుకు ఆయన ఇదే విషయం చెప్పారు.ఇక మూడు స్దానాలో ఎవ్వరికి ఎన్ని అనే అంశంలో టిడిపి, బిజెపి లెక్క తెల్చుకోవాల్సి ఉంది. మూడింట్లో టిడిపి రెండు స్దానాలకు, బిజెపి ఒక స్థానానికి పోటీ చేయాలని ఆలోచన చేస్తున్నాయి.. వైకాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మోపిదేవి వెంకట రమణారావు, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడంతో ఇప్పుడీ ఉప ఎన్ని >>2

# మన్యంలో పేలిన తూటా


ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు

### ఏడుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్

### ఇల్లెందు, నర్సంపేట ఏరియా దళ కమాండర్ భద్రు మృతి

### దద్దరిల్లిన ఏటూరునాగారం అటవీప్రాంతం

**ములుగు జిల్లా క్రైమ్, డిసెంబరు1, ప్రభాత వార్త:** గత కొన్ని రోజులుగా తెలంగాణ ఛతీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో అలజడి నెలకొంది. ఈ క్రమంలో వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివాసీ యువకులను ఇన్ఫార్మర్ల నేపంతో మావోయిస్టుల హత్యచేసిన ఘటన పాఠకులకి విదితమే...దీనితో బలగాలు అప్రమత్తం అయ్యాయి. గ్రేహౌండ్స్,యాంటీ మావోయిస్టు స్క్వాడ్ బృందాల క్యాబింగులు ఒక వైపు, మావోయిస్టుల వారోత్సవాలు మరో వైపు జరుగనున్న నేపథ్యంలో మన్యం చిగురుటాకుల వణికిపోతుంది. అటవీ సమీప ప్రాంతాల పల్లెల్లో ప్రజలకు ప్రశాంతత కరువైంది.పీఎల్ జీఏ ఆవిర్భవించి 24 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా డిసెంబరు 2 నుంచి 8వ తేదీ వరకు వార్షికోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టుపార్టీ తెలంగాణ రాష్ట్రకమిటీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏటూరునాగారం చల్పాక అటవీ ప్రాంతంలోజరిగిన ఎన్‌కౌంటర్ ఘటనతో మన్యం మరోమారు ఉలిక్కి పడింది. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు కాలనీలో నవంబరు 23న ఇద్దరు అమాయక ఆదివాసులు ఊయకే.రమేశ్ ,ఊయకే.అర్జున్‌లను మావోయిస్టులు హత్య చేసిన తరువాత ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ములుగు జిల్లా పోలీస్ బృందం మావోయిస్ట్ పిఎల్‌జిఏ వారోత్సవాలలో భాగంగా ఈ రోజు ఉదయం పూల కొమ్మ అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుండగా సుమారు 12 నుండి 13 మంది ప్రభుత్వ నిషేదిత సిపిఐ మావోయిస్టులు పోలీసులను చూసి కాల్పులు ప్రారంభించగా, పోలీసులు వారిని లొంగిపొమ్మని పదేపదే హెచ్చరికలు చేసిన మావోయిస్టులు వినకుండా కాల్పులు జరిపారు. పోలీస్ వారు తమ ఆత్మ రక్షణలో భాగంగా ఎదురు కాల్పులు జరిపారు.కొంత సమయం తర్వాత పోలీస్ వారు సంఘటన స్థలంలో పరిశీలించగా ఏడుగురు సిపిఐ మావోయిస్ట్ పార్టీ తెలంగాణ క్యాడర్‌కి చెందిన సభ్యులు 1) కుర్సం మంగు అలియాస్ బద్రు అలియాస్ పాపన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు, 2) ఏగోలపు మల్లయ్య అలియాస్ కోటి, జిల్లా కమిటీ సభ్యుడు, 3) జమున, ఏరియా కమిటీ సభ్యురాలు 4) కరుణాకర్, ఏరియా కమిటీ సభ్యులుగా గుర్తించారు. మృతి చెందిన మిగతా ముగ్గురు పార్టీ సభ్యులను గుర్తించాల్సి ఉంది.సంఘటన స్థలం నుండి రెండు ఏకె47, ఒక జి3, ఒక ఇన్సాస్, ఒక 303 రైఫిల్, ఒక సింగిల్ షాట్, ఒక తపంచా మరియు కొన్ని కిట్ బ్యాగ్ లు, మావోయిస్ట్ విప్లవ సాహిత్యం పోలీసులు స్వాధీనపరచుకున్నారు.

# పాఠశాల విద్యార్థులకు ఇక హోలిస్టిక్ కార్డులు

**విజయవాడ,డిసెంబరు1 ,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలలో ఇకపై విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులకు బదులు హోలిస్టిక్ కార్డులు (సమగ్ర ప్రగతి పత్రాలు) ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని తల్లిదండ్రులకు అందచేయాలని నిర్ణయించింది., అందుకు సంబంధించిన చర్యల్లో భాగంగా హోలిస్టిక్ కార్డులుపాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది.ఏపీలో పాఠశాలల్లో ఇప్పటి వరకు ప్రతి తరగతికి ప్రోగ్రెస్ కార్డులు ఇస్తున్నారు.ఈ కార్డుల్లో విద్యార్థుల హాజరు, పరీక్షల్లో వారు సాధించిన మార్కులను పొందుపరిచే వారు.ఇక పై ఈ విధానానికి స్వస్తి చెప్పి హోలిస్టిక్ కార్డులు ఇచ్చే దిశలో పాఠశాల విద్యా శాఖ కార్యచరణకు దిగుతుంది. కొత్తగా కొన్ని మార్పులు చేసి హోలిస్టిక్ కార్డులను రూపొందించారు. వీటిని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవ్వనున్నారు. హోలిస్టిక్ కార్డులు లోపల పేజీలో క్యూఆర్ కోడ్‌ను పొందుపరిచారు. ఫోన్ ద్వారా దీన్ని స్కాన్ చేసి,విద్యార్థి అభ్యసన సవాళ్లను గుర్తించడానికి వీలుగా ఇది ఉపయోగపడుతుంది. విద్యార్థి అభిరుచులు, ఆసక్తులు, విద్యాపరమైన సామర్థ్యాలు, సవాళ్లను ప్రతి 6 నెలలకోసారి ఇందులో నమోదు చేస్తారు. విద్యార్థి బ్లడ్ గ్రూప్, ఎత్తు, బరువు, బీఎంఐ వంటి తదితర అంశాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. హోలిస్టిక్ కార్డుల ద్వారా విద్యార్థి సర్వతోముఖాభివృద్ధిని ఎప్పటికప్పుడు అంచనా వేయవచ్చని విద్యాధికారులు చెబుతున్నారు.

# రైల్వే ప్రాజెక్టుల పూర్తికి రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలు



**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న రైల్వే ప్రాజెక్టులు - జాతీయ రహదారులు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం రెండు వేర్వేరు టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలకు రాష్ట్ర రోడ్లు. భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి నేతృత్వంలో పనిచేస్తోంది. .రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిని పూర్తి చేయడానికి మంత్రి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ కమిటీలు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, అటవీ క్లియరెన్స్ అనుమతులు, లెవెల్ క్రాసింగ్ మూసివేతలకు సంబంధించి అనుమతులు, యుటిలిటీస్ షిఫ్టింగ్, నిధుల విడుదల వంటి అంశాలను పర్యవేక్షిస్తుంది.గుర్తించిన సమస్యలను పరిష్కరించి, వేగవంతంగా రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నివేదికను రూపొందిస్తోంది మంత్రి జనార్ధన్‌రెడ్డితో 9 మందితో టాస్క్ ఫోర్స్ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు.

రవాణా, రోడ్లు , భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి, సిసిఎల్ఎ చీఫ్ కమిషనర్, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్, ఆర్‌బీ (ఆర్ ఎస్ డబ్ల్యూ) శాఖ చీఫ్ ఇంజనీర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కనస్ట్రక్షన్ వాల్తేర్), చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కనస్ట్రక్షన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్స్ సికింద్రాబాద్), చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కనస్ట్రక్షన్ - సికింద్రాబాద్), చీఫ్ ఇంజనీర్ (కనస్ట్రక్షన్ బెంగళూరు) సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెల సమావేశం కావడంతో పాటు, రాష్ట్రంలో రైల్వే పనులను వేగవంతం చేయడానికి ఆయా సమస్యలు పరిష్కరించడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడం జరుగుతుంది. ఇక జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయడానికి మంత్రి బిసి జనార్ధన రెడ్డి ఆధ్వర్యంలోనే ఏర్పాటయిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ కమిటీ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారులు (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్ర రోడ్లు,రవాణా, హైవే శాఖ) పనులనపరిశీలిస్తుంది. అవి త్వరితగతిన పూర్తిచేయడమే కీలకంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు >>2

# కారు ప్రమాదంలో ముగ్గురు డాక్టర్లు మృతి

### విడపనకల్లు వద్ద దుర్ఘటన

### పొగమంచు కారణంగా అదుపు తప్పిన కారు


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

**విడపనకల్లు, డిసెంబరు1 ప్రభాతవార్త :** అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వైద్యులు ప్రాణాలు కోల్పోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. తీవ్రమైన పొగమంచు, అతివేగం కారణంగా ప్రమాదం జరిగి నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మండల కేంద్రంలోని >>2




భారీ వర్షాలకు పుదుచ్చేరిలో చెరువులను తలపిస్తున్న రోడ్లు

# తుఫాను ధాటికి తీరం విలవిల

>> రోడ్డు కోతకు గురైంది. మాయపట్నం, అమీనాబాద్, సూరాడపేట, జగ్గరాజుపేట, కొత్తపట్నం, సుబ్బంపేటలలో మత్స్యకారులకు తీవ్రనష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అలల ధాటికి బోట్లు, వలలు దెబ్బతిన్నాయని మత్స్యకారులు అంటున్నారు. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా.. విశాఖపట్నం నుంచి రాకపోకలు నిర్వహించాల్సిన విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. చెన్నై నుంచి విశాఖపట్నం వచ్చే విమాన సర్వీస్, విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే విమాన సర్వీస్ రద్దు అయింది. తిరుపతి నుంచి విశాఖపట్నం వచ్చే విమాన సర్వీస్, విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్లే విమాన సర్వీస్ కూడా రద్దు అయింది. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

**విజయవాడ విమానాశ్రయం నుంచి పలు సర్వీసులు రద్దు**

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. చెన్నై విమానాశ్రయాన్ని మూసివేయడంతో అక్కడినుంచి గన్నవరానికి రాకపోకలు నిర్వహించాల్సిన రెండు ఇండిగో విమానాలు రద్దు అయ్యాయి. తిరుపతి, షిర్డీ విమాన సర్వీసులు కూడా రద్దు అయ్యాయి. చెన్నై, షిర్డీ, తిరుపతి వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. తిరుపతి (రేణిగుంట) విమానాశ్రయంలోని రన్‌వేపై నీళ్లు చేరడంతో ఏడు విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. తుఫాను నేపథ్యంలో చెన్నై, తిరుపతి వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెన్నై ఎయిర్ పోర్టును అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. చెన్నై నుంచి హైదరాబాద్ రావాల్సిన మూడు విమానాలను రద్దు చేశారు. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లాల్సిన విమానాలు కూడా రద్దయ్యాయి. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లాల్సిన ఏడు విమానాలతో పాటు తిరుపతి నుంచి హైదరాబాద్ విమానాలను రద్దు చేసినట్లు ఎయిర్ లైన్స్ ప్రకటించాయి. ప్రతికూల వాతావరణం వల్ల దాదాపు పది విమానాలు రద్దు చేసినట్లు ఎయిర్ పోర్ట్ అధికారులు వెల్లడించారు. ముంబయి, త్రిపుర వెళ్లే పలు విమాన సర్వీసులు కూడా రద్దు చేశారు.

# రైతన్నకు తీవ్ర నష్టం

>> మండలాల్లో కూడా వర్షం ప్రభావం తీవ్రం కావడం వలన అక్కడి నుంచి ప్రవహిస్తున్న నదుల నీళ్ల లోతట్టు గ్రామాల వైపు మళ్లుతున్నాయి. అధికారులు ప్రతి రెండు మూడు గంటలకు వర్షపాతం వివరాలు సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేస్తున్నారు. ప్రత్యేకించి సరిహద్దు మండలాల్లోని వర్షపాతం ఎక్కువగా నమోదవుతోంది. ఈ వర్షంతో ఇప్పటికే పలుచోట్ల తీరప్రాంత గ్రామాలు విలవిల్లాడుతుంటే, మరోవైపు పులికాట్ సరస్సులోకి వరదనీరు విస్తృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే ఇక్కడ మత్స్యకారులు వేటను మానుకొని కుప్పాలలోనే తలదాచుకుంటున్నారు. రేవుల్లో ఉంచిన పడవలు దెబ్బతిన్నాయని పలువురు జాలర్లు తెలిపారు. కనీసం తాము మండల కేంద్రానికి వచ్చి చెప్పుకుందామన్నా ఎడతెరిపి లేని వర్షాలు, సక్రమంగా లేని రహదారుల వలన సాధ్యం కావడం లేదన్నారు. పాముల కాలువ సమీపంలో ఇప్పటికే పంట పొలాలు మునిగిపోగా, కాళంగి నది వాటంబేడు రోడ్డులోకి ఏ క్షణమైనా ప్రవహించడానికి సిద్ధంగా నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం సాయంత్రానికి మండల పరిధిలోని పాముల కాలువ, కరిపేటి కాలువలకు కూడా వర్షపు నీరు ఎక్కువగా చేరడంతో ఆ పరివాహక పంట పొలాల రైతులు భయపడుతున్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణ

>> లకు చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇసుక డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా సరఫరా పెంచాల్సిందిగా సిఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఇసుక లభ్యత, ధరలు, అక్రమ రవాణా, సరఫరా ఇతర ఫిర్యాదులపై ముఖ్యమంత్రి అధికారులతో కీలకంగా వర్చువల్ సమావేశాల ద్వారా సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఇసుక లభ్యతపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లభ్యత, పారదర్శకంగా సరఫరా, అక్రమాల నియంత్రణ వంటి అంశాలపై ముఖ్యమంత్రి మరోమారు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక లభ్యతను పెంచాల్సిందిగా సిఎం ఆదేశించారు. రవాణా, తవ్వకం వ్యయం భారం వినియోగదారులపై ఎక్కువగా పడకుండా చూడాలని సూచించారు. జిల్లాల్లో ఇసుక ధరల్ని పున: సమీక్షించాల్సిందిగా సిఎం ఆదేశాలు జారీ చేశారు.

# ఫెంగల్ తుఫాన్‌తో ఎడతెరపిలేని వానలు

## • నిండిన జలాశయాలు • గోగర్భండ్యామ్ గేట్లు ఎత్తివేత

**తిరుమల,డిసెంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలకు తిరుమలలోని ఐదు ప్రధానజలాశయాలు వరద నీటితో పూర్తిగా నిండిపోయాయి.రెండురోజులుగా భారీ వర్షాలతో తిరుమలలో ప్రధాన జలాశయాలు గోగర్భమ్‌డ్యామ్, ఆకాశగంగ,పాపవినాశనమ్, కుమారధార,పసుపుధారతీర్థాలకు వరదనీరు చేరింది. ఆదివారం ఉదయం 6గంటలకే జలాశయాలన్నీ దాదాపు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం వరదనీటితో నిండిపోయి నిండుకుండల్లా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో గోగర్భమ్ డ్యామ్, పాపవినాశనమ్ డ్యామ్ గేట్లును తెరిచి నీటిని బయటకు వదిలిపెట్టారు. ఇప్పటికే ముందు జాగ్రత్తగా పాపవినాశమ్ మార్గం, శ్రీవారిమెట్టుదారులు మూసివేశారు. భక్తులను అనుమతించడం లేదు. తమిళనాడులో తుఫాన్ తీరం దాటడంతో ఆదివారం ఉదయం నుండి తిరుపతి జిల్లాలో తిరుపతి,తిరుమల,శ్రీకాళహస్తి,సత్యవేడు ప్రాంతాల్లో వర్షం తగ్గుముఖం పట్టింది.

**నిండిన జలాశయాలు:**

తిరుమలకు ప్రధాన తాగునీటి జలాశయమైన గోగర్భండ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు కాగా పూర్తిస్థాయిలో నీరు చేరింది. దీంతో గేట్లను తెరిచి నీటిని వదిలారు. గోగర్భం డ్యామ్‌లోనే నిండిన నీటితో తిరుమల అవసరాలకు ఐదారునెలలు సరిపడే నీటినిల్వ చేరింది. పాపవినాశనం 697.14అడుగులు పూర్తిస్థాయిలో నీటితో కళకళలాడుతోంది. పాపవినాశనం గేట్లు మంగళవారం తెల్లవారుజామున తెరిచి నీటిని బయటకు విడుదలచేశారు.

ఆకాశగంగ జలాశయమ్ కూడా 685లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యంతో నిండుకుంది. ఈ గేట్లను తెరిచారు. ఇక తిరుమలలో మరో రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈరెండు జలాశయాలు నీటిసామర్థ్యం కుమార ధార ప్రాజెక్టు 890.80మీటర్లుగా వరదనీరు 898.24మీటర్లు చేరింది. పసుపుధారప్రాజెక్టు 896.35మీటర్లుగాగా 898.24మీటర్లు అత్యధికంగా వరదనీరు చేరింది. రెండు జలాశయాల్లో వసుపు ధార2,833లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం,కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్లు నీటిసామర్థ్యం. ఈ రెండు కూడా పూర్తిగా వరదనీటితో నిండిపోయాయి. తిరుమలలోని ఐదు జలాశయాలు కలిపి 14,304, 49లక్షలగ్యాలన్లు నీటిసామర్థ్యం.ఈ జలాశయాలు నిండుకోవడంతో మరో ఏడాదిన్నర వరకు నీటిసమస్యతలెత్తే అవకాశం లేదు. రెండేళ్ళ తరువాత మళ్ళీ ఇప్పుడు తిరుమలలోని జలాశయాలన్నీ వరదనీటితో నిండుకోవడంతో టిటిడి అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా భక్తుల సంఖ్య రోజుకు లక్షమంది వరకు తిరుమలకు వస్తుండటంతో నీటివాడకం కూడా అధికంగానే ఉంది. తిరుమలలో మంచినీటి సమస్య ఇబ్బందులు తప్పినట్లేనని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, వాటర్‌వర్క్సు విభాగం అధికారులు భావిస్తున్నారు.



గోగర్భండ్యామ్ పూర్తిగా నిండటంతో గేట్లు తెరచి నీటిని కిందకు విడుదల చేస్తున్న దృశ్యం



బంగ్లాదేశ్‌లో చిన్మోయ్ కృష్ణదాస్ అరెస్టుకు నిరసనగా బెంగళూరులో ఆదివారం ఆందోళన చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

# టాస్క్‌ఫోర్స్ కమిటీలు

>> సంబంధించి సమస్యలను సులభతరం చేయడంతో పాటు క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలోని ఈ కమిటీలో 12 సభ్యులుంటారు. ఈ కమిటీలో జలవనరుల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ, విద్యుత్ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ, సీసీఎల్ ఎ ఛీఫ్ కమిషనర్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, గనులు, భూగర్భవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రవాణా, ఆర్ బీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, అటవీ శాఖ ప్రిన్సిపల్ ఛీఫ్ కన్సర్వేటర్, రీజనల్ ఆఫీసర్, రీజనల్ ఆఫీసర్, ఆర్ బీ, ఆర్ ఎస్ డబ్ల్యూ ఛీఫ్ ఇంజనీర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కనస్ట్రక్షన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్స్ సికింద్రాబాద్ ) సభ్యులుగా ఈ కమిటీ ఉండనుంది. మంత్రి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలోని ఈ కమిటీ ప్రతి నెల సమావేశం కావడంతో పాటు, రాష్ట్రంలో జాతీయ రహదారుల పనులు వేగవంతం కావడానికి ఆయా సమస్యలు పరిష్కరించడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడం జరుగుతుందని మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు.

# తప్పుకున్న జనసేన

>> కలు జరగనున్నాయి. ఈ ముగ్గురిలో ఇద్దరు మళ్లీ పోటీకి దిగబోతున్నారు. బీద మస్తాన్‌రావు తెలుగుదేశం పార్టీ నుంచి ,ఆర్ కృష్ణయ్య భారతీయ జనతా పార్టీ తరపున తిరిగి బరిలో నిలవబోతున్నారు. మోపిదేవి స్థానాన్ని కొత్తవారికి ఇవ్వనున్నారు. మూడో సీటు కూడా టిడిపి ఖాతాలోకి రానున్న నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ఆశావహులు గట్టిగానే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కంభంపాటి రామ్మోహన్‌రావు, భాష్యం రామకృష్ణ ,వంగవీటి రాధాకృష్ణ తదితరులు ఈ ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పుడు ఉప ఎన్నికలు జరుగుతున్న స్థానాలకు మిగిలిన పదవీకాలం విషయానికొస్తే మోపిదేవి 2026 జూన్ వరకు, మస్తాన్ రావు, కృష్ణయ్యల పదవీకాలం 2028 జూన్ వరకూ ఉన్నాయి.

# విభజన సమస్యలపై నేడు 2 రాష్ట్రాల సిఎస్‌ల సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు1:** రాష్ట్ర విభజన సమస్యలు, పరిష్కారంపై సోమవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు నీరబ్‌కుమార్ ప్రసాద్, శాంతికుమారి ఆధ్వర్యంలో సమావేశం జరగనుంది.విజయవాడ వేదికగా జరిగే ఈ సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన పెండింగ్, ద్వైపాక్షిక అంశాలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించనున్నారు.ఇంధన శాఖ, ఆర్థిక శాఖ, కన్స్యూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ సివిల్ స్లపస్, కార్మిక, ఫ్యాక్టరీల శాఖ, రెవెన్యూ, ఎక్సైజ్, హోంశాఖ అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు.ఏపీ, తెలంగాణకు చెందిన సుమారు 20 మంది ఐఏఎస్, 4 ఐపీఎస్ అధికారులు, సెక్రటేరియట్ అధికారులు సమావేశంలో పాల్గొననున్నారు.

THE GOVERNMENT OF BODOLAND
Results of 01/12/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:22
1st Prize Rs.100000/- 487722
2nd Prize Rs.7000/- 35934
3rd Prize Rs.3500/-
01052 02214 28507 31409 39327
56448 69824 76225 85457 89228
4th Prize Rs.200/-
1390 1595 1602 2235 3440
4335 4720 5343 7035 8652
5th Prize Rs.100/-
0204 1573 1958 2020 5460
5575 7065 7505 7681 8921
6th Prize Rs.50/-
0005 1592 4362 5830 7002 8699
0144 1635 4457 5891 7372 8822
0189 1933 4494 5919 7486 8960
0211 2053 4513 5999 7508 8999
0233 2241 4519 6195 7521 9052
0245 2657 4555 6201 7562 9060
0283 2779 4571 6264 7605 9084
0519 3054 4841 6332 7644 9240
0731 3184 5001 6349 7717 9395
1004 3199 5252 6399 7887 9646
1101 3535 5399 6444 7944 9705
1250 3631 5446 6543 7975 9725
1252 3650 5477 6555 8221 9818
1379 3725 5617 6760 8340 9898
1497 4027 5619 6849 8516 9902
1518 4040 5693 6851 8605
1527 4098 5716 6997 8662

SINGAM SERIES Dr No:22
1st Prize Rs.100000/- 497681
2nd Prize Rs.7000/- 35037
3rd Prize Rs.3500/-
10694 26112 42685 50724 65802
66527 70288 77383 78065 92016
4th Prize Rs.200/-
0969 2178 2453 3045 4629
4743 7307 8565 9035 9794
5th Prize Rs.100/-
0298 3199 3847 6449 7031
7081 7352 7830 7883 9408
6th Prize Rs.50/-
0015 1848 3582 5371 6918 8655
0025 1898 3658 5389 6991 8823
0029 2042 3849 5597 6992 8883
0079 2054 4029 5823 7336 8889
0179 2109 4060 5922 7348 8906
0391 2295 4134 5925 7426 9286
0508 2617 4144 5988 7436 9299
0589 2666 4231 6054 7494 9411
0752 2767 4304 6301 7720 9473
0931 2821 4326 6399 7874 9498
1052 3104 4328 6408 7886 9560
1061 3152 4559 6414 7988 9605
1112 3181 4579 6467 8049 9825
1138 3239 4670 6574 8072 9887
1263 3267 4853 6613 8179 9893
1530 3429 5087 6787 8269
1788 3447 5300 6810 8550

KUIL SERIES Dr No:22
1st Prize Rs.100000/- 863952
2nd Prize Rs.7000/- 30133
3rd Prize Rs.3500/-
09278 17665 19929 26557 35447
57135 73073 82348 91320 92296
4th Prize Rs.200/-
0746 1440 2578 3765 4094
4279 4952 5934 7127 8062
5th Prize Rs.100/-
2400 4743 5365 6854 7779
8493 8944 9232 9473 9644
6th Prize Rs.50/-
0028 1794 3263 4665 6671 8297
0091 1868 3273 4839 6692 8438
0275 1882 3288 5047 7235 8442
0298 1897 3370 5111 7399 8500
0337 2258 3510 5289 7432 8640
0447 2455 3806 5356 7437 8654
0494 2581 3869 5375 7466 8904
0592 2639 3884 5416 7488 8933
0677 2655 4029 5429 7624 8955
0702 2745 4032 5735 7658 9321
0737 2758 4065 5801 7944 9403
0902 2898 4129 5920 8102 9556
0912 2978 4452 6042 8131 9599
1008 3148 4481 6192 8138 9844
1192 3162 4534 6324 8191 9936
1243 3166 4567 6416 8252
1302 3235 4635 6661 8291

ROSA SERIES Dr No:22
1st Prize Rs.100000/- 528366
2nd Prize Rs.7000/- 40053
3rd Prize Rs.3500/-
35846 59494 60849 63027 63124
71828 80036 82714 83744 93314
4th Prize Rs.200/-
1903 2094 2205 2953 5234
5247 5976 6909 7462 8841
5th Prize Rs.100/-
0158 0973 1190 2891 6520
6996 7537 8001 8330 9031
6th Prize Rs.50/-
0010 1543 4102 5847 6929 9000
0012 1653 4118 5890 7039 9140
0240 1803 4205 5919 7042 9197
0245 1931 4250 6009 7209 9208
0371 2221 4328 6148 7211 9288
0414 2342 4517 6173 7301 9300
0533 2347 4609 6177 7320 9451
0568 2458 4857 6178 7356 9484
0691 2530 4964 6293 7520 9639
0754 2651 5082 6372 7849 9647
0826 2729 5354 6377 8107 9804
0876 2770 5428 6552 8254 9862
0964 2922 5524 6630 8353 9881
0987 3247 5542 6753 8566 9906
1385 3415 5652 6754 8655 9957
1448 3770 5665 6840 8730
1493 4074 5792 6865 8867

DEAR SERIES Dr No:22
1st Prize Rs.100000/- 982293
2nd Prize Rs.7000/- 42566
3rd Prize Rs.3500/-
01308 12805 20680 30068 44379
72613 73792 77205 79783 84013
4th Prize Rs.200/-
0212 0575 0942 2026 3493
3584 7129 7200 8312 9013
5th Prize Rs.100/-
0427 2203 2649 3334 5659
6907 7177 8934 9661 9778
6th Prize Rs.50/-
0036 1373 3481 5208 7110 8253
0080 1430 3544 5242 7135 8393
0099 1881 3708 5364 7252 9002
0168 2239 3723 5409 7356 9007
0356 2315 3876 5429 7378 9014
0554 2448 3992 5451 7535 9038
0572 2487 4172 5595 7580 9117
0694 2789 4431 5614 7704 9241
0724 2904 4517 5781 7706 9268
0760 3124 4565 5919 7869 9336
0803 3171 4617 6368 7881 9461
0822 3191 4700 6408 8084 9487
0909 3198 4704 6549 8113 9620
0976 3249 4907 6780 8142 9864
1333 3317 5043 6970 8149 9906
1334 3333 5056 7040 8202
1351 3396 5080 7068 8239

THANGAM SERIES Dr No:22
1st Prize Rs.100000/- 366105
2nd Prize Rs.7000/- 62039
3rd Prize Rs.3500/-
44126 54210 63604 66058 68489
78849 79819 80645 97461 98981
4th Prize Rs.200/-
1479 1828 2016 3307 3954
4506 6140 6667 9003 9193
5th Prize Rs.100/-
0818 1348 1629 1651 2459
3367 3641 5019 7732 9919
6th Prize Rs.50/-
0182 1468 3449 5355 6490 8458
0335 2096 3539 5363 6798 8471
0377 2176 3590 5470 6908 8487
0426 2253 3635 5508 6909 8648
0529 2272 3708 5542 6996 8759
0647 2283 3804 5840 7209 8810
0697 2290 3838 5910 7252 8831
0710 2355 4037 5926 7381 8858
0893 2369 4349 5991 7388 9165
1024 2383 4364 6062 7467 9252
1086 2680 4461 6196 7518 9261
1239 2718 4470 6233 7532 9397
1264 2766 4968 6240 7550 9525
1265 2895 5052 6261 7706 9734
1291 3254 5061 6298 7980 9742
1366 3423 5148 6370 8080
1377 3431 5185 6448 8399

THE GOVERNMENT OF BODOLAND
Results of 01/12/2024
M.R.P. ₹.2/-

ABBLE SERIES Dr No:22
1st Prize Rs.100000/- 126216
2nd Prize Rs.7000/- 99067
3rd Prize Rs.3500/-
04404 14866 21509 25629 30595
39345 40375 46564 65133 78338
4th Prize Rs.200/-
0442 0739 1479 2180 3348
3977 6887 8409 8524 9537
5th Prize Rs.100/-
0382 1194 3389 3538 4947
5724 6995 7115 8520 9866
6th Prize Rs.50/-
0009 1641 3134 5135 6473 8060
0294 1690 3202 5138 6479 8165
0453 1713 3266 5284 6507 8172
0499 1767 3317 5342 6835 8204
0503 2018 3336 5478 6937 8218
0505 2112 3531 5522 7107 8290
0521 2117 3649 5796 7127 8366
0775 2450 3665 5833 7150 8419
0790 2524 3956 5920 7248 8510
0870 2533 3976 6015 7343 8641
1082 2797 4348 6024 7356 8798
1131 2837 4499 6063 7476 9117
1181 2842 4757 6136 7704 9431
1257 2888 4834 6184 7724 9527
1388 2917 5059 6369 7743 9894
1425 3010 5060 6442 7879
1474 3133 5083 6452 7932

NALLANERAM SERIES Dr No:22
1st Prize Rs.100000/- 213216
2nd Prize Rs.7000/- 87835
3rd Prize Rs.3500/-
16598 21145 25193 26270 27905
53970 59803 65613 77423 95689
4th Prize Rs.200/-
0173 1006 1975 4427 4584
5817 6168 6899 7558 9689
5th Prize Rs.100/-
2885 3004 4141 4315 6562
7034 7184 7192 7551 9470
6th Prize Rs.50/-
0036 2105 3665 5622 7093 8727
0153 2130 3679 5667 7227 8803
0184 2207 3949 5782 7419 8855
0185 2269 3962 5815 7461 8982
0299 2278 4114 6025 7597 9081
0369 2309 4266 6107 7706 9090
0431 2489 4417 6219 7791 9110
0729 2493 4482 6242 7864 9315
0742 2501 4512 6254 7958 9401
0812 2653 4674 6272 8004 9571
1220 2685 5178 6409 8016 9660
1305 2709 5246 6455 8181 9796
1522 2780 5281 6754 8224 9866
1676 3108 5300 6931 8522 9877
1804 3290 5590 7018 8588 9968
1835 3433 5593 7059 8599
2062 3607 5608 7068 8676

KUMARAN SERIES Dr No:22
1st Prize Rs.100000/- 926959
2nd Prize Rs.7000/- 62471
3rd Prize Rs.3500/-
02576 10155 10690 21576 39157
67961 68422 86982 91820 96469
4th Prize Rs.200/-
1255 1403 2844 3259 3573
4761 5290 5783 8674 9238
5th Prize Rs.100/-
0124 0398 0824 2905 4055
5162 5908 7547 8097 9091
6th Prize Rs.50/-
0031 1235 3022 4586 6518 8806
0067 1251 3026 4657 6633 9030
0102 1617 3209 4802 6637 9084
0156 1683 3216 4975 6722 9145
0207 1743 3270 5128 6916 9288
0235 1901 3325 5151 7155 9359
0259 1952 3626 5201 7441 9394
0337 1958 3637 5231 7753 9395
0374 2073 3660 5234 7831 9507
0589 2237 3890 5313 8168 9537
0800 2374 3940 5335 8260 9575
0861 2393 4291 6087 8297 9659
0999 2793 4336 6304 8379 9682
1075 2820 4514 6314 8461 9702
1151 2885 4537 6357 8628 9943
1167 2974 4546 6397 8629
1209 2998 4575 6467 8691

VISHNU SERIES Dr No:22
1st Prize Rs.100000/- 135841
2nd Prize Rs.7000/- 74872
3rd Prize Rs.3500/-
21639 33114 36124 45673 46672
51505 68100 80850 94835 96635
4th Prize Rs.200/-
1408 1999 2524 3203 3758
4840 7498 7849 8925 9595
5th Prize Rs.100/-
0356 0847 1315 2651 3176
4868 6035 6726 7452 8004
6th Prize Rs.50/-
0071 1623 2739 4516 6636 7880
0132 1686 2755 4615 6645 8177
0170 1810 2812 4667 6708 8182
0226 1820 2901 4767 6839 8200
0254 1854 2950 4783 6863 8271
0549 1861 3110 4875 6950 8344
0613 1900 3138 5047 6985 8387
0708 1904 3205 5201 6992 8610
0768 2048 3400 5349 7080 8767
0913 2061 3449 5809 7112 8871
0991 2129 3576 5818 7466 9112
1004 2149 3892 6000 7502 9488
1103 2477 4055 6197 7583 9516
1106 2509 4177 6301 7598 9812
1305 2693 4285 6344 7612 9958
1440 2703 4382 6566 7712
1462 2713 4463 6612 7745

SWARNALAXMI SERIES Dr No:22
1st Prize Rs.100000/- 638853
2nd Prize Rs.7000/- 51397
3rd Prize Rs.3500/-
16277 27118 27775 49741 51166
51725 62974 73391 84752 95703
4th Prize Rs.200/-
2408 2545 2911 5498 6180
6245 6655 6910 7505 8539
5th Prize Rs.100/-
0293 0321 1535 1633 3230
3925 5346 6532 7086 8818
6th Prize Rs.50/-
0149 1885 3570 5090 7018 8630
0160 1999 3577 5102 7162 8641
0193 2090 3766 5176 7220 8663
0286 2198 3936 5198 7413 8748
0552 2329 3984 5348 7542 8850
0717 2611 4038 5383 7549 8943
0746 2627 4126 5539 7563 9140
0990 2706 4416 5758 7596 9202
1010 2742 4530 5763 7741 9211
1120 2834 4577 5768 7778 9328
1200 2851 4646 5943 8035 9388
1251 2864 4723 6076 8043 9603
1287 2989 4756 6091 8112 9730
1370 3004 4808 6206 8277 9832
1410 3482 4840 6217 8343 9892
1674 3491 4891 6224 8376
1814 3546 5033 6911 8558

LION SERIES Dr No:22
1st Prize Rs.100000/- 126112
2nd Prize Rs.7000/- 94579
3rd Prize Rs.3500/-
15673 26336 26789 37708 48780
59112 59937 72349 72794 83387
4th Prize Rs.200/-
0374 0819 1663 2762 5748
7141 8409 8857 9349 9658
5th Prize Rs.100/-
0670 0752 0801 1562 1876
4833 5215 5867 8895 8943
6th Prize Rs.50/-
0098 1407 4299 5484 6847 8770
0439 1520 4302 5512 6857 8809
0449 1532 4362 5572 6926 8816
0477 1664 4378 5668 7136 8837
0534 2233 4407 5779 7195 8860
0550 2451 4667 6077 7201 8878
0607 2505 4701 6084 7329 8882
0616 2977 4749 6090 7331 8983
0703 3413 4886 6110 7641 8986
0770 3489 4901 6137 7711 9060
1007 3494 4924 6197 7885 9086
1141 3548 5013 6229 7913 9375
1164 3635 5049 6307 8053 9411
1217 3661 5158 6404 8175 9441
1338 4087 5184 6616 8394 9716
1340 4144 5307 6680 8706
1360 4210 5479 6755 8708

# టిసిఎస్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

>> ఇస్తూ ప్రభుత్వం ఉత్తరం జారీ చేసింది. అంతేకాకుండా టిసిఎస్ కార్యకలాపాలు త్వరితగతిన ప్రారంభమయ్యేందుకు సంబంధిత అధికారులు అందరూ సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

తొలి దశలో 2000 మంది ఉద్యోగులతో కార్యకలాపాలను ప్రారంభించనుంది. అదనపు నిర్మాణాల కోసం మరొక 1600 చదరపు మీటర్ల కూడా టిసిఎస్‌కు ప్రభుత్వం కేటాయించింది. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఋషికొండ పై హిల్ నెంబర్ 1,2 లలో ఐటి పరిశ్రమల ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. అయితే చాలాకాలం ఈ కొండపై మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో గత ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపకపోవడంతో దిగ్గజ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించడానికి ఆసక్తి చూపలేదు. ఆ తర్వాత కాలంలో చిన్న చిన్న ఐటీ కంపెనీలు మాత్రమే ఇక్కడికి వచ్చాయి తప్ప పెద్ద కంపెనీలు ఇక్కడికి వచ్చేందుకు మొగ్గు చూపలేదు. కొద్ది కాలం కిందట ఇన్ఫోసిస్ విశాఖ ఐటీ సెజ్ నుంచి కార్యకలాపాలు మొదలుపెట్టింది. తాజాగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఐటీ మంత్రిగా ఉన్న లోకేష్ విదేశాల్లో పర్యటించి ఐటి పరిశ్రమలను మన రాష్ట్రానికి రప్పించేందుకు విశేష కృషి చేశారు. ఆ ప్రయత్నంలోని భాగంగానే టిసిఎస్ విశాఖకు వచ్చిందని చెప్పటంలో ఏ మాత్రం సందేహం లేదు. యాంకర్ ఐటీ కంపెనీగా టిసిఎస్ కార్యకలాపాలు ప్రారంభిస్తే, మరిన్ని ఐటీ కంపెనీలు ఈ ప్రాంతానికి తరలి రానున్నాయి.

**20,000 మందికి పరోక్ష ఉపాధి**

ఐటీ దిగ్గజ సంస్థ టిసిఎస్ విశాఖలో కార్యకలాపాలు ప్రారంభిస్తే ప్రత్యక్షంగా 10,000 మందికి, పరోక్షంగా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఋషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఓ.నరేష్ కుమార్ తెలియజేశారు. టిసిఎస్ రాకతో మరిన్ని ఐటి కంపెనీలు విశాఖకు వస్తాయని దీనివలన అన్ని రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన చెప్పారు. టిసిఎస్ వంటి ప్రముఖ సంస్థను విశాఖకు రప్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి లోకేష్ తీసుకున్న చొరవకు నరేష్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రమాదంలో ముగ్గురు డాక్టర్లు మృతి

>> స్థానిక భారత్ పెట్రోల్‌బంక్ సమీపంలో జాతీయ రహదారి-42పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వైద్యులు దుర్మరణం చెందారు. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. విజయనగర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఓపిడి) బళ్లారికి చెందిన ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులు బ్యాంకాక్ విహారయాత్ర ముగించుకుని తిరిగి స్వస్థలానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వైద్యులు కన్నుమూశారు. బళ్లారికి చెందిన ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ యోగేష్, డాక్టర్ గోవిందరాజ, డాక్టర్ అమరేగౌడ విహారయాత్ర కోసం బ్యాంకాక్‌కు వెళ్లారు. విదేశీయాత్ర ముగించుకుని రాత్రి బెంగుళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడినుండి కారులో బళ్లారికి బయలుదేరారు. అర్థరాత్రి దాటిన తరువాత అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద జాతీయ రహదారిపై వీరి వాహనం ప్రమాదానికి గురైంది. పొగమంచు కారణంగా వేగంగా వెళుతున్న కారు చెట్టును ఢీ కొట్టినట్లు సమాచారం. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. అతివేగంగా వచ్చి చెట్టును ఢీ కొనడంతో ముగ్గురు వైద్యులు గోవిందరాజ (52), యోగేష్ (54), ప్రైవేటు ఆసుపత్రి మేనేజర్ వెంకటనాయుడు (53) అక్కడికక్కడే మృతి చెందగా అమరేగౌడకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని బళ్లారి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బళ్లారి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ అధికారి ఏబివిఎస్‌బి శ్రీనివాస్ పరిశీలించారు.

# సియోనిహైవేపై రోడ్డుప్రమాదం

## అంబులెన్స్ తిరగబడి నలుగురు మృతి

**సియోని(ఎంపి), డిసెంబరు 1:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లానుంచి బీహార్‌కు వెళుతున్న ఓ అంబులెన్స్ ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఓ రోగినికర్నూలు జిల్లానుంచి బీహార్‌లోని చంపారన్‌కు తరలిస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో ఆదివారం ఉదయం ఓ పాదచారుడిని ఢీకొట్టిన అంబులెన్స్‌ఆ తర్వాత స్తంభాన్ని ఢీకొని బోల్తాపడిందని పోలీసులు తెలిపారు. జబల్‌పూర్ నాగ్‌పూర్ హైవే ఎన్‌హెచ్34పై చోటుచేసుకున్న ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా ఐదుగురికి గాయాలయినట్లు తెలిపారు. అనిష్‌షా(18) అనే రోగిని కర్నూలునుంచి బీహార్‌లోనిచంపారన్‌లో తమ స్వగ్రామానికి తరలిస్తుండగా ఈఘటన జరిగింది. ప్రమాదం సమయంలో అంబులెన్స్‌లో ఇద్దరు డ్రైవర్లతోపాటు అనిష్‌షా కుటుంబసభ్యులు ఆరుగురు ఉన్నారు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో పాదచారుడిపైకి దూసుకెళ్లిన అంబులెన్స్ ఆ తర్వాత ఒక స్తంభం ఢీకొని బోల్తాపడింది. ఈప్రమాదంలో మృతులను 35 ఏళ్లప్రమిత షా, నాలుగేళ్లప్రిన్స్‌షా, 36 ఏళ్ల ముకేశ్‌షా, 40 ఏళ్ల సునీల్‌షాగా గుర్తించారు.

## వారం - వర్జ్యం

తేది : 02-12-2024, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
పాడ్యమి మ.12.44
జ్యేష్ఠ మ.3.45
వర్జ్యం రా.12.03-1.43
దు.మ.12.27-1.12, 2) మ.2.41-3.26
శుభసమయం : ఉ.6.00-6.50,
సా.3.50-4.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** స్కాలర్‌షిప్‌లు లభిస్తాయి. వస్తు భద్రతకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. అరుగుదల లోపిస్తుంది.

**వృషభం :** ఋణాలు మీద వడ్డీలు తగ్గించుకోవడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి.

**మిథునం:** దూరప్రాంతాలలోని మీ వారి క్షేమ సమాచారం తెలుస్తుంది. ప్రముఖులతో పరిచయాలు.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వ్యవహారాలు అనుకూలిస్తాయి.

**సింహం:** అన్నింటా మీదే పైచేయిగా ఉంటుంది. సంఘసేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు.

**కన్య :** గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. షేర్లు భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**తుల :** దీర్ఘకాలిక ఋణాలను కొంతవరకు తీర్చగలుగుతారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**వృశ్చికం:** మంచికి పోయి ఒక సందర్భంలో చెడ్డవారు అవతారు. నేర్పు, ఓర్పు నైపుణ్యాలను కలిగి ఉంటారు.

**ధనుస్సు:** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. శత్రువులు సమస్యలను సృష్టించినా అధిగమిస్తారు.

**మకరం:** నూతన పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కుంభం:** ఉద్యోగులు విధి నిర్వహణలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** కుటుంబ బాధ్యతలను కొంతవరకు తీర్చుకోగలుగుతారు. శ్రమకు తగిన ఫలితం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

2-12Pg3exHMNWJQE.qxd:2-12Pg3exHMNWJQE.qxd 01/01/01 9:10 AM Page 1



## న్యాయశాఖ జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయసు పెంపు

**విజయవాడ,డిసెంబరు1,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని న్యాయశాఖ జ్యుడిషియల్ ఆఫీసర్ల( న్యాయాధికారులు ) పదవీ విరమణ వయసును పెంపు చేస్తూ ప్రభుత్వ జీవో ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ తెలిపారు. ఇప్పటి వరకు పదవి విరమణ వయసు 60 సంవత్సరాలు కాగా, ఒక సంవత్సరం పెంచి పదవీ విరమణ వయసును 61 గా జీవో జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఉత్తర్వులు 1 నవంబరు 2024 నుండి అమల్లోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలోని న్యాయశాఖ జ్యూడిషియల్ ఆఫీసర్లకు పదవి విరమణ వయస్సును పెంచుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్నట్లుగానే వారి రిటైర్‌మెంట్ వయసును ఎన్డీఏ ప్రభుత్వం పెంచింది.ఆ దిశలో ఉత్తర్వులు జారీ చేసింది.



## గరుగుబిల్లిలో అక్రమ మైనింగ్ ఆపాలి: సిపిఐ నేత రామకృష్ణ

### ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ

**విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** గరుగుబిల్లి అక్రమ మైనింగ్ వ్యవహారంపై వాస్తవాలు బయట పెట్టాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ లేఖ రాశారు. ఇక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను నియంత్రించాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలో అత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమ మైనింగ్‌ను ఆపాలని అందులో కోరారు. ఈ ప్రాంతంలో డ్రిల్లింగ్ వల్ల భూగర్భ జలాలు, తాగునీరు కలిషితమైపోయాయమిన పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులకు గురై ఇప్పటికే 12 మంది మృతి చెందగా అనేక మంది అనారోగ్యం పాలయ్యారని చెప్పారు. అక్రమ మైనింగ్ గోతులవల్ల కొండపైనుంచి దిగువ పొలాలకు వర్షపు నీరుఅందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని రామకృష్ణ లేఖలో కోరారు.

## దేశంలోని వైద్యులందరికీ జాతీయ వైద్య కమిషన్ యూనిక్ ఐడీ జారీ

**విజయవాడ,డిసెంబరు1,ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోని వైద్యులందరికీ జాతీయ వైద్య కమిషన్ యూనిక్ ఐడీ నంబరు జారీ చేస్తోంది. ఆయా రాష్ట్రాల్లోని వైద్య మండళ్లు జారీచేసే రిజిస్ట్రేషన్ నంబరుకు ఇది అదనంగా ఉంటుంది. దీనివల్ల వైద్యులకు సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తున్నాయి. వారు ఎక్కడ చదివారు? ఎక్కడ ప్రాక్టీస్ చేస్తున్నారు? వారి అర్హత సర్టిఫికెట్లు నిజమైనవా కాదా అనే వివరాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. వైద్యుల వివరాలను వెబ్‌సైట్‌లో చూసే అవకాశమూ ఉంది. దేశం మొత్తం మీద 13.08లక్షల మంది అల్లోపతి వైద్యులు ఉన్నారు. అయితే మన రాష్ట్రంలో 2016 నుంచి ప్రైమరీ సభ్యత్వం పొందినవారు 39,249 మంది, రెన్యువల్స్ పొందిన వారు 36,694 మంది ఉన్నారు. ఇప్పటివరకు నేషనల్ మెడికల్ రిజిస్టర్‌లో రాష్ట్రం నుంచి 2000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మిగిలిన వారు జాతీయ వైద్య కమిషన్ సూచించిన వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్‌ల సందర్భంగా నిశిత పరిశీలన ఎక్కువైనందున అక్రమ వైద్యుల గుట్టు రట్టవుతోంది. డాక్టర్ విద్య పూర్తిచేసిన వారు వైద్య మండళ్ల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న తర్వాతే ప్రాక్టీసు చేయాలి. ఒకవేళ వేరే రాష్ట్రానికి వెళ్లాలనుకుంటే ముందుగా నమోదు చేసుకున్న కార్యాలయం నుంచి నో అబ్జెక్షన్ తీసుకోవాలి. ఆ తర్వాత వెళ్లాలనుకున్న రాష్ట్రంలోని మండలి కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ పొందాలి. ఈ క్రమంలోనే నకిలీ వైద్య సర్టిఫికెట్ల ఘటనలు బయటపడుతున్నాయి.గడచిన 2 నెలల్లో రాష్ట్రంతో 5 నకిలీ సర్టిఫికెట్ల ఘటనలు ఏపీ వైద్యమండలి కార్యాలయం దృష్టికి వచ్చాయి.

# ప్రతి యేటా నార్ల ఉత్తమ పాత్రికేయ అవార్డులు

### విజయవాడలో ఘనంగా నార్ల వెంకటేశ్వరరావు 116వ జయంతి

### ముగ్గురు పాత్రికేయులకు ఒక్కొక్కరికి రూ.50వేలు నగదు పురస్కారం

### పద్మ భూషణ్, అచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



ఆదివారం విజయవాడలో జరిగిన నార్ల వెంకటేశ్వరరావు 116వ జయంతి సందర్భంగా ప్రసంగిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

**విజయవాడ,డిసెంబరు1,ప్రభాతవార్త ప్రతినిధి:** పాత్రికేయ జగత్తులో ధృవతార దివంగత నార్ల వెంకటేశ్వరరావు పేరిట ఇకపై ప్రతి సంవత్సరం ఉత్తమ పాత్రికేయ అవార్డులను అందించనున్నట్లు పద్మ భూషణ్, అచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. పత్రికా సంపాదకీయలను ఒక ఉద్యమంగా, సామాజిక సంస్కరణలకు స్ఫూర్తిగా ఉపయోగించిన నార్ల, పత్రికా సమాజానికి దిక్సూచి వంటి వారని కొనియాడారు, నార్ల వెంకటేశ్వరరావు 116వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పించారు. లోక్ నాయక్ ఫౌండేషన్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగగా పలువురు సాహితీ వేత్తలు, రచయితలు, పాత్రికేయులు నార్ల విగ్రహానికి పుష్పర్చన గావించారు. ఈ సందర్భంగా అచార్య యార్లగడ్డ మాట్లాడుతూ ఆధునిక తెలుగు జర్నలిజానికి ఆద్యునిగా వినతికెక్కిన నార్ల వెంకటేశ్వరరావు నీతి, నిజాయితే తన ఆభరణంగా వ్యవహరించారన్నారు. అనాడు అధికార దుర్వినియోగంపై ఎక్కు పెట్టిన ఎన్నో సంపాదకీయాలు నేటి తరానికి మార్గదర్శిగా నిలుస్తాయన్నారు. లోక్ నాయక్ ఫౌండేషన్ నేతృత్వంలో ఇకపై ప్రతి సంవత్సరం ముగ్గురు జర్నలిస్టులకు ఒక్కొక్కరికీ రూ.50వేల నగదు పురస్కారంతో విజయవాడ వేదికగా నార్ల ఉత్తమ పాత్రికేయ అవార్డులను అందిస్తామన్నారు. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తామని, ఇందుకోసం లబ్ధప్రతిష్టులతో కమిటీని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అవార్డుల ప్రదానం ప్రతి సంవత్సరం డిసెంబరు 1 వతేదీన క్రమం తప్పకుండా జరగుతుందని అచార్య యార్లగడ్డ స్పష్టం చేసారు. లోక్ నాయక్ పౌండేషన్ గత 21వ సంవత్సరాలుగా విశాఖ వేదికగా ఉత్తమ సాహితీ వేత్తలకు రూ.2 లక్షల పురస్కారం, ముగ్గురు సామాజిక సేవకులకు జీవన సాఫల్య పురస్కారాలుగా ఒక్కొక్కరికి లక్ష వంతున రూ.3 లక్షలు, మొత్తంగా రూ.5 లక్షల నగదు బహుమతితో క్రమం తప్పకుండా అందచేస్తూ వస్తుందన్నారు. తాజాగా పాత్రికేయులకు కూడా పురస్కారాలు అందించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, ప్రముఖ కవి బండ్ల మాధవరావు, ప్రముఖ విద్యావేత్త గుమ్మా సాంబశివరావు, సుంకర నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు మరికొన్ని ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 1,ప్రభాతవార్త:** శబరిమల వెళ్లే అయ్యప్ప స్వాముల వారి భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ తెలుగు రాష్ట్రాల నుంచి డిసెంబరు నెలలో మరికొన్ని ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బందరు-కొల్లాం-బందరు ప్రత్యేక రైళ్లు : ఈ నెల 2,9,16వ తేదీల్లో సోమవారాల్లో మచిలీపట్నం నుంచి కొల్లాం వెళ్లే నెంబర్ 07145 ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం మధ్యాహ్నం 3.15గంటలకు మచిలీపట్నం నుంచి బయలుదేరి,మంగళవారం రాత్రి 9.20గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి మచిలీపట్నం వెళ్లే నెంబర్ 07146ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4,11,18వ తేదీల్లో బుధవారాల్లో తెల్లవారుజామున 2.30గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి గురువారం ఉదయం 7గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు పేదన,గుడివాడ, విజయవాడ, న్యూగుంటూరు,తెనాలి, బాపట్ల, చీరాల,ఒంగోలు, సింగరాయకొండ, కావలి,నెల్లూరు,గూడూరు, రేణిగుంట,కాట్పాడి,జోలార్ పేట్,సేలం,ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పాల్ఘాట్,తిరువళ్ల, చెంగనూరు, కన్యాకులం స్టేషన్లలో నిలుస్తాయి.

**మౌలాలి-కొల్లాం-మౌలాలి ప్రత్యేక రైళ్లు :** మౌలాలి నుంచి కొల్లాం వెళ్లే నెంబర్ 07143ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6,13,20,27వ తేదీల్లో శుక్రవారం ఉదయం 11.30గంటలకు మౌలాలి నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 7గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి మౌలాలి వెళ్లే నెంబర్ 07144ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 08,15,22,29వ తేదీల్లో ఆదివారం తెల్లవారుజామున 2.30గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 10గంటలకు మౌలాలి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యంలో చర్లపల్లి, భువనగిరి, జనగామ, ఖాజీపేట్, వరంగల్లు, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల,ఒంగోలు, నెల్లూరు,గూడూరు, రేణ ిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్,సేలం, ఈరోడ్, తిరుప్పూర్,కోయంబత్తూర్, పాల్ఘాట్, త్రిశూర్,అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్, కొట్ట యాం, చెంగనచేరి, తిరువళ్ల, చెంగనూరు, కన్యాకులం స్టేషన్లలో నిలుస్తాయి.

# కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం

### టీడీపీ కార్యకర్త ఆత్మహత్యపై ఎక్స్‌లో లోకేశ్ భావోద్వేగ పోస్టు



**విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం కార్యకర్త శ్రీను ఆత్మహత్యపై మంత్రి నారాలోకేశ్ ఎక్స్‌లో భావోద్వేగ పోస్టు చేశారు. అన్నా..అన్నా.. అని పిలుస్తూ ఎవరికి ఏ కష్టం వచ్చినా సహాయం చేయాలని మెసేజ్ చేసే శ్రీను తనకు ఆపద వస్తే ఒక్క మెసేజ్ చేయాలని పించలేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. దిద్దలేని చాలా పెద్ద తప్పు చేశావు తమ్ముడు, ఐ మిస్ యూ అంటూ తన బాధను వ్యక్తపరిచారు. కష్టమేంటో కూడా అతడు చెప్పుకోలేదని లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఓ అన్నగా తానున్నానని వారికి అండగా అంటూ అన్ని బాధ్యతల్ని నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా కష్టసుఖాలను పంచుకుందాం అంటూ కార్యకర్తలకు లోకేశ్ పిలుపునిచ్చారు. సమస్యలను కుటుంబం, స్నేహితులు, బంధువులు, పార్టీలో హితులు, ఎవరితోనైనా షేర్ చేసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని దయచేసి ఆత్మహత్య లాంటి తప్పుడు నిర్ణయాలు ఎవరూ తీసుకోవద్దని కోరారు. బతికే ఉందాం మరో నలుగురిని బతికిద్దాం అంటూ పిలుపునిచ్చారు. శ్రీను ఆత్మహత్య గురించి తెలుసుకొని కాపాడేందుకు తీవ్ర ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే తనకు చెప్పాల్సిందని, కానీ, ఇలా ప్రాణాలు తీసుకోవడం చాలా విచారకరమని లోకేశ్ అన్నారు. అందరి కష్టాలను శ్రీను తన దృష్టికి తెచ్చేవాడు.. వారి కష్టాల పరిష్కారంకు కృషి చేసేవాడు. కానీ, తన కష్టం గురించి మాత్రం ఎప్పుడూ చెప్పలేదు. నీకు ఆపద వస్తే ఈ అన్నకి ఒక్క మెసేజ్ చేయాలనిపించలేదా? దిద్దలేని చాలా పెద్ద తప్పుచేశావు తమ్ముడు. అంటూ లోకేశ్ పేర్కొన్నారు. దయచేసి ఇటువంటి తప్పుడు నిర్ణయాలు ఎవ్వరూ తీసుకోవద్దు అని లోకేశ్ ట్వీట్‌లో పేర్కొన్నారు.


# రాష్ట్రంలో 3 లక్షల 25 వేల మందికి హెచ్ఐవి

### ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులో ఏపి శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్. ఏ. సిరి

**విజయవాడ,డిసెంబరు1, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి హెచ్ఐవీని పూర్తిగా నిర్మూలించే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్. ఏ. సిరి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి శ్రీ క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఎయిడ్స్ పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్. ఏ. సిరి మాట్లాడుతూ రాష్ట్రంలో హెచ్ఐవీ వైరస్ బారిన పడే వారిలో యువత ఎక్కువగా ఉంటున్నారని, ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. "టేక్ ది రైట్స్ పాత్" అనే నినాదంతో ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో దాదాపు 3 లక్షల 25 వేల మందికి హెచ్ఐవీ ఉన్నట్లు అంచనాలు ఉన్నాయన్నారు. ఇందులో 2 లక్షల 75 వేల మంది మాత్రమే చికిత్స తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో యువతకు 50 కి.మీ. కన్నా తక్కువ దూరంలో లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీ శాక్స్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సరస్వతి మాట్లాడుతూ హెచ్ఐవి నిర్మూలన మన అందరి బాధ్యత అని, అది అవగాహనతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జేడీలు డాక్టర్. టి. మంజుల, డాక్టర్. కామేశ్వర్ ప్రసాద్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ డా. చక్రవర్తి, అడిషనల్ డీఎం అండ్ హెచ్వో డా. జే. ఉషారాణి, కోఆర్డినేటర్ డా.రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, డాక్టర్. సమరం తదితరలు పాల్గొన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ గ్రౌండ్ నుంచి తుమ్మల పల్లి కళా క్షేత్రం వరకు ఎయిడ్స్ అవగాహనపై అనేక నినాదాలు ఇస్తూ ర్యాలీ చేపట్టడం జరిగింది. ఏపీ శాక్స్ ఆధ్వర్యంలో విభిన్న విభాగాలలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభను కనపరిచిన వారిని అభినందిస్తూ సర్టిఫికేట్, మెమొంటోలను అందించడం జరిగింది. తదుపరి వినూత్న రీతిలో సోషల్ మీడియా లో ఫ్లాస్మాబ్స్ ద్వారా అవగాహన కల్పించడానికి యువతముందుకు రావడంతో వారిని అభినందిస్తూ మెమొంటోలు, సర్టిఫికెట్లు అందించారు.

## వీడియో వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు

**విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ గ్రంథాలయ 57 వ వారోత్సవాల సందర్భంగా నవంబర్ నెలలో "విద్యార్థి వాహిని మా గ్రంథాలయం" అనే శీర్షికతో నిర్వహించిన వీడియో వక్తృత్వ పోటీల విజేతలను ప్రకటించారు. వారికి ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో బహుమతులు అందజేసారు. ఈ పోటీల్లో ఇతర ప్రాంతాల విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు పోస్టు ద్వారా పంపించారు. ఈ ప్రధానోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణాజిల్లా వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ మరియు అడిషనల్ గవర్నమెంట్ లీడర్ చిన్నం రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థిని విద్యార్థులు ఇటువంటి పోటీలలో పాల్గొని వారి యొక్క మేధాశక్తిని నైపుణ్యతను అభివృద్ధి చేసుకున్నచో భవిష్యత్తులో ఉన్నత స్థానాలలో నిలబడతారని సమాజానికి మంచి చేసే పౌరులుగా తయారవుతారని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించుచున్న విద్యార్థి వికాస వాహిని సంస్థ అధ్యక్షులు వి కేశవరావు ని ప్రత్యేకంగా అభినందించినారు. విద్యార్థి వికాస వాహిని అధ్యక్షులు వి కేశవరావు మాట్లాడుతూ నేటి బాలబాలికలు గంధాలయాలను తరచుగా సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్ట్స్ సొసైటీ కార్యదర్శి పావులూరి చిదంబేశ్వరరావు విజయవాడ లైన్స్ క్లబ్ జోనల్ సెక్రటరీ మహమ్మద్ ఇస్మాయిల్ గ్రంథాలయ అధికారిని కే. రమాదేవి సిబ్బంది కే రాంబాబు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠకులు పాల్గొన్నారు.



వీడియో వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## స్త్రీలు చైతన్యవంతమై సమాజాన్ని చైతన్యం చేయాలి

### దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** అణగారిన వర్గాలకు చెందిన స్త్రీలపై జరుగుతున్న దాడులను సంఘటితంగా ఎదుర్కొవాలని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అన్నారు. ఏ వర్గానికి చెందిన మహిళలైనప్పటికి అంతా ఈ పరిస్థితులను ప్రతిఘటించాలన్నారు. స్త్రీలపై జరిగే హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా దళిత స్త్రీ శక్తి అధ్వర్యంలో గత నెల 27వ తేదీ నుండి నేటి వరకు గుంటూరు, కృష్ణ,ఎన్టీఆర్ జిల్లాలలోని పాఠశాలలు, కళాశాలలు, మురికివాడలు,గ్రామాల్లో ప్రచారో ద్యమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ,నేషనల్ కో-ఆర్డినేటర్ జాబాలి సత్యకామ,జిల్లా కో-ఆర్డినేటర్లు రోజా,రాణిలు పాల్గొన్నారు. విజయవాడలో జరిగిన ముగింపు సభలో ఝాన్సీ మాట్లాడుతూ రోజు రోజుకీ బాలికలపై,స్త్రీలపై పెరుగుతున్న హింసకు ప్రధాన కారణాల్లో కుటుంబం ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. హింస లేని సమాజం రావాలంటే తల్లిదండ్రులు చైతన్యవంతులయి సన్మార్గంలో నడిపించాలని కోరారు. మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాలు సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయన్నారు. యుక్త వయస్సులో పిల్లలు చెడు స్నేహాలకు తావివ్వకుండా,భవిష్యత్తుని తీర్చిదిద్దుకోవాలని హితవు పలికారు. పేదరికం పోవాలంటే ఒకే ఒక్క ఆయుధం చదువేనని,అందుకు చదువుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా పేదల జీవితాల్లో మార్పు రాదనీ,నిజమైన మార్పు రావాలంటే మనం చైతన్యవంతుల వడము అవ్వడమే పరిష్కార మార్గమన్నారు.




స్త్రీలపై జరిగే హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమ ముగింపు సభలో గెడ్డం ఝాన్సీ

# తిరుమల సమాచారం

## జనవరి 10నుంచి వైకుంఠ ద్వారదర్శనం

### 10న వైకుంఠ ఏకాదశి,11న ద్వాదశి

### పదిరోజులు విఐపిలు స్వయంగా వస్తేనే బ్రేక్ దర్శనం



**తిరుమల,డిసెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ వైష్ణవాలయాలలో వైకుంఠద్వార దర్శనాలకు సమయం సమీపిస్తోంది. పవిత్రమైన ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా, ద్వాదశిని వైకుంఠద్వాదశిగా ప్రసిద్ధి. కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మోక్షమార్గం వైకుంఠద్వారం రానున్న జనవరి 10వతేదీ తెల్లవారుజామున 1.45గంటలకు తెరచుకోనుంది. రానున్న ఏడాదిలో కూడా పదిరోజులుపాటు వైకుంఠ ద్వారం తెరచి భక్తులకు మోక్షమార్గం దర్శనం చేయించేలా టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పదిరోజులపాటు దాదాపు 7లక్షలమంది భక్తులు ఆరోజుల్లో వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు చేయనుంది. జనవరిలో వైకుంఠద్వారం తెరచి ఉంచే 10వతేదీ నుండి జనవరి 19వరకు పదిరోజుల పాటు ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించరు. దర్శన టిక్కెట్, టోకెన్లు లేని భక్తులను ఆలయంలోపలకు అనుమతించరు.రాజ్యాంగపరిధిలోని ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తేనే పరిమితంగా బ్రేక్ దర్శనాలు జారీచేస్తారు. ప్రత్యేక దర్శనాలు చంటిపిల్లలు, దివ్యాంగులు,వృద్ధులు, ఎన్ఆర్ఐలు అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్, తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీ చేయనున్నారు.

**జనవరి 10న స్వర్ణరథం, 11న చక్రస్నానం:** పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన జనవరి 10వతేదీ శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు స్వర్ణరథం జరుగుతంది. శ్రీదేవిభూదేవిసమేతంగా మలయప్పస్వామివారు విశేష అలంకరణలో స్వర్ణరధాన్ని అధిరోహించి ఆలయ మాఢవీదుల్లో ఊరేగనున్నారు. 11వతేదీ ద్వాదశిరోజు పవిత్ర పుష్కరిణిలో స్వామివారి చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవం జరిపిస్తారు.

## కొండపై తగ్గిన వానజోరు, డ్యామ్‌ల గేట్లు తెరచిన టిటిడి



**తిరుమల,డిసెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని సప్తగిరులపై కొలువైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో ఫెంగల్ తుఫాన్‌తో ఎడతెరపి లేకుండా మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో తిరుమల,తిరుపతిలో భారీగా వరదనీరు జలాశయాలకు చేరింది. భారీగా కురిసిన వరదనీటితో తిరుమలలోని జలాశయాలన్నీ పూర్తిగా నిండిపోయాయి. ఆదివారం ఉదయం గోగర్భమ్‌డ్యామ్, పాపవినాశనం డ్యామ్‌ల గేట్లు తెరచి నీటిని విడుదల చేశారు. ఈ డ్యామ్‌ల పరిసరాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం నుండి వర్షంజోరు తగ్గింది. చిరుజల్లులతో కూడిన వాన అప్పుడప్పుడు కురిసింది. కొండపై విపరీతమైన చలివాతావరణం నెలకొంది.

## ఆలయాల పవిత్రత కాపాడటం అందరి బాధ్యత

### తిరుపతిలో భక్తుల ర్యాలీ



**తిరుమల,డిసెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ఆలయాల్లో పవిత్రతను కాపాడుకోవడానికి హిందూ సనాతన భోర్డును ఏర్పాటు చేయాలని, హిందూ దేవాలయాల పరిరక్షణ ప్రతి హిందువుపై ఉందని బిజెపినేత, శ్రీవారిభక్తుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం తిరుపతిలో గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెలగపూడి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో బాలాజీకాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం నుండి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వరకు హిందూ సనాతన ధర్మాన్ని రక్షించాలంటూ ర్యాలీ చేపట్టారు. టిటిడిలో సమాచార హక్కు చట్టం తీసుకురావాలని, తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించే కానుకలను భక్తులకు తెలిసేలా ప్రతి సంవత్సరం ఆడిట్ రిపోర్టు టిటిడి వెబ్‌సైట్‌లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. తిరుమలలో అవినీతి నిర్మూలనకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు.

## 'కల్తీ' కారకులపై వేటుకు 'సిట్' సిద్ధం!




**తిరుమల,డిసెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** గోవిందుని లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి కారకులను గుర్తించిన సిబిఐ సిట్ అధికారులు చర్యలకు సిద్ధమవుతోంది. వారంరోజులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో లోతుగా దర్యాప్తు చేపట్టిన సిట్ బృందం దోషులెవరనేది తేల్చే పనిలో నిమగ్నమైంది. లడ్డూల తయారీలో వినియోగిస్తున్న ఆవునెయ్యిలో పందికొవ్వు, గొడ్డుకొవ్వునూనెలతోబాటు శాఖాహారపదార్థాలతో తయారుచేసిన నూనెలు కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కుపంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రపై నివేదికలు సిద్ధం చేశారు. పవిత్రమైన లడ్డూలను కలుషితంచేసిన పాపం పై శిక్ష ఎవరికి పడనుందనేది రెండు రోజుల్లో తేలిపోనుంది. నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించి నలుగురు డైరీ నిపుణులతో ఇప్పటికే ప్రస్తుత టిటిడి అధికారులు ఓ కమిటీ ఏర్పాటు చేసిన టిటిడి , ఎన్‌డిఆర్ఎ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఆచార్య స్వర్ణలత, బెంగళూరుకు చెందిన డాక్టర్ మహదేవన్ అభిప్రాయాలు తీసుకున్నారు. నెయ్యి రుచిని పొందడానికి వెన్నను 120డిగ్రీల సెంటిగ్రేడ్‌లో 2-5నిమిషాలు వేడిచేస్తే నాణ్యత తెలిసిపోతుందని చెబుతున్నా అందుకు తగ్గట్లు టిటిడిలో ఎందుకు చర్యలు తీసుకోలేదనేది సిట్ ఆరా తీసింది.



## ప్రత్యేక హోమాలతో లోకక్షేమం

### వేదోక్తంగా ముగిసిన కార్తీకమాస పూజలు

**తిరుమల,డిసెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానం అనుబందంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో నెలరోజులపాటు జరిపించిన పలు రకాల హోమాలు, ప్రత్యేక పూజలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. వేదోక్తంగా నెలరోజులపాటు ఆలయంలో నిర్వహించిన ఈ హోమమహోత్సవాలతో లోకక్షేమం, మానవాళి ఆయురారోగ్యాలతో ఉంటారని ఆలయ అర్చకులు అనుగ్రహించారు. ఆదివారం ఉదయం ఛండీహామాన్ని నిర్వహించి మహాపూర్ణాహుతితో మొత్తం హోమమహోత్సవాలను ముగించారు.

పంచ ఉత్సవమూర్తులకు పలు రకాల రుద్రయాగం,కపిలేశ్వరహోమం, గణపతి హోమం, సుబ్రమణ్యేశ్వరహోమం, కామాక్షి హోమం, కాలబైరవహోమం, చండీ హోమంతో సాయంత్రం మహాపూర్ణాహుతి, మహా శాంతి అభిషేకం,కలశ ఉద్వాసన కపిలేశ్వ రస్వామి పుష్కరిణిలో పవిత్రంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, అర్చకులు ,భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.

-వివేకానందుడు

# దిక్సూచి ఆస్ట్రేలియా

సామాజిక మాధ్యమాల బారినపడి మైనర్లు ఎంతటి ఘోరాలకు బలవుతున్నారో ప్రపంచ దేశాల్లో మనం చూస్తూనేఉన్నాం. పోర్న్‌వెబ్ సైట్లు, అశ్లీల సాహిత్యాలకు బానిసలవుతూ అనేక ఘోరాలు, అకృత్యాలు నిత్యకృత్యంగా ప్రపంచంలో ఏదో ఒకచోట మనకు కనిపిస్తున్నాయి. మైనార్టీ దాటని వయసులో ఉన్న బాల్యం పెడదారిపడుతోంది. పాలక ప్రభుత్వాలు ఎన్ని కట్టడి చర్యలు చేపట్టినా ఏదోఒక లొసుగు ఆధారంతో ఈ విషవలయంలో చిక్కుకుంటున్నారు. సోషల్ మీడియా అంటే మంచిచెడూ రెండింటికీ వేదికగా మారిపోతున్నదన్న భావన రానురాను పెరిగిపోతోంది. ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న కొద్దీ సోషల్ మీడియా ప్రభావం మరింతగా పెరుగుతూవస్తోంది. అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాలు, పేద దేశాల్లో కూడా ఇప్పుడు ఇంటర్నెట్ కారుచౌకగా లభిస్తోంది. దీనితో ఎక్కడలేని సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లు పుట్టుకొచ్చాయి. సమాచారం చేరవేతకు అత్యంత సులువైన మార్గంగా ఈవేదిక ఉపకరిస్తున్నప్పటికీ వీటి ఆధారంగా చెడుమార్గాలకు కూడా అంతే సులువుగా యువత ఆకర్షితులవుతున్నారు. భారత్‌లో కూడా ఇలాంటి ప్లాట్‌ఫామ్‌లను కట్టడి చేసేందుకు కఠినమైన ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం అమలుచేస్తున్నా ఎక్కడో ఒకచోట ఏదో మూలనుంచి ఈ సోషల్‌మీడియా ప్రభావం వల్ల తీవ్రస్థాయిలో ముప్పు కూడా ఎదురవుతోంది. ఇప్పుడు సోషల్ మీడియాను మైనర్లకు దూరంగా ఉంచాలని దేశాలు కొన్ని కఠినచట్టాలు అమలుకు తెస్తున్నాయి. వీటిలో ఆస్ట్రేలియా ఇప్పుడు ప్రపంచదేశాలకు దిక్సూచిగా నిలిచిందని చెప్పాలి. 16 ఏళ్లలోపు చిన్నపిల్లలకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో లేకుండా ప్రత్యేక చట్టం తెచ్చింది. ఈ బిల్లును ఆదేశ సెనేట్‌లో ప్రవేశపెడితే 19మంది సభ్యులు వ్యతిరేకిస్తే 34మంది ఆమోదించారు. అలాగే దిగువసభ ప్రతినిధుల సభలో అయితే 13 మంది మాత్రమే వ్యతిరేకిస్తే ఏకంగా 102మంది ఆమోదం తెలిపారు. ఇక అధ్యక్షుడి ఆమోదంతో బిల్లు చట్టరూపంలోకి వస్తుంది. ఈ చట్టంప్రకారం సోషల్‌మీడియా సంస్థలు ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టిక్‌టాక్ వంటివి 16 ఏళ్లలోపు పిల్లలకు లాగిన్ అయ్యేందుకువీలులేకుండా చర్యలు చేపట్టాలి. ఈచట్టాన్ని అతిక్రమించిన పక్షంలో ఆ సంస్థలపై విచారణల అనంతరం భారీ జరిమానాలు వేస్తారు. ఈ మొత్తం సుమారు 33 మిలియన్ అమెరికన్ డాలర్లవరకూ కూడా ఉంటుంది. ఈ అతిచిన్న ఉపఖండ దేశం భావితరం భద్రత శ్రేయస్సుకు పెద్దపీట వేసింది. దేశంలోఎక్కడా కూడా ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై 16ఏళ్ల లోపున్న మైనర్లు లాగిన్ అవడానికి వీల్లేదు. ఆవిధంగా ఆ సంస్థలు చర్యలు తీసుకోవాలి. జనవరి నుంచి ప్రయోగాత్మకంగా అమలుకు తెస్తున్న ఈ చట్టం అతిత్వరలో పూర్తిస్థాయిలో మైనర్లపై నిషేధం అమలుకు తెస్తామని ఆదేశ ప్రధాని ఆంటోని అల్బనీస్‌ప్రకటించారు. యువతలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభ పెడదారి పడుతోంది. చెడువ్యసనాలకు బానిస అవుతున్న యువత భారీ సంఖ్యలో వృద్ధిచెందుతోంది. బాలల కారాగారాలకు వస్తున్న కేసుల్లో ఇలాంటి చెడువ్యసనాల కేసులే ఎక్కువ ఉంటున్నాయి. అయితే విద్యాసంబంధిత విషయాల్లో యూట్యూబ్ కొంత భిన్నంగా ఉన్నందున ఈ చట్టం నుంచి యూట్యూబ్‌కు మినహాయింపు ఇచ్చారు. జనవరి నుంచి మార్చివరకూ జరిగే ప్రయోగాత్మక అమలులో టెక్నాలజీ సంస్థ కెజెఆర్ సర్వేచేస్తుంది. సోషల్‌మీడియాను వినియోగిస్తున్న వారిలో వయసుల వారీగా సర్వేపూర్తిచేసిమైనర్లు ఎంతమంది ఉన్నారన్నది తేలుస్తారు. ముందు బయోమెట్రిక్ వయసు నిర్ధారణవ్యవస్థను అమలుకు తీసుకురావడం, సెల్ఫీద్వారా వయసు నిర్ధారణ వంటి ఫీచర్లు తీసుకురావాలి. ఈడేటా ప్రాసెస్ అయిన తర్వాత వయసు నిర్ధారణ అయితే వారిఖాతాలు ఆటోమేటిక్‌గాతొలగిపోతాయి. లేదా కస్టమర్లు తమ వయసు ధృవీకరణపత్రాలుఅప్‌లోడ్ చేయాలి. పాస్‌పోర్టు, వయసు ధృవీకరణ పత్రాలు వంటివి జతచేస్తేనే వీటినియాక్సెస్ చేసుకునే వీలుంటుంది. నిత్య చదువు పుస్తకాలను వదిలేసి యువత నిత్యం మొబైల్ ఫోన్లకే అతుక్కుపోతున్నారు. అదేపనిగా నిరంతరంఫోన్లపై కొనసాగుతుంటే యువతలో మానసిక సమస్యలు కూడా అత్యధికంగా పెరుగుతున్నట్లు గ్లోబల్ సర్వేలుకూడా చెపుతున్నాయి. ఇప్పటికే కొన్ని యూరోపియన్ దేశాలు, అమెరికాలోని కొన్నిరాష్ట్రాల్లో సోషల్ మీడియా వినియోగంపై వయోపరిమితిని అమలు చేస్తున్నా సమగ్రస్థాయిలోలేదు. వయసు నిర్ధారణకోసం కొన్ని సోషల్‌మీడియా సంస్థలు 'యోతి' వంటి సంస్థలను లీజుకు తీసుకుంటున్నాయి. ఈ సేవలు ప్రయోజనకరంగానే ఉన్న ప్పటికీ పూర్తిస్థాయిలో ఉండవని ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా చెపుతోంది. ఇప్పుడు ఆస్ట్రేలియా చట్టంతెస్తే ముం దుగా దెబ్బతినేది ఎలాన్‌మస్క్ 'ఎక్స్'సంస్థ అని నిస్సందేహంగా చెప్పవచ్చు. 27మిలియన్ల జనాభాఉన్న ఆస్ట్రేలియాలో ఈచట్టం అమలుతీరును పరిశీలించి అభివృద్ధి చెందిన దేశాలు మరికొన్ని అమలుకు ఆసక్తిచూపిస్తున్నాయి. చిన్నారులను పెడమార్గం నుంచి విముక్తి కల్పించేందుకు ప్రపంచదేశాల్లో ఇలాంటి చట్టాలు మరిన్ని రావాల్సిన అవసరం ఎంతో ఉంది. భారత్‌లాంటి దేశాలకు ఈ చట్టాలు మరింత అవసరం. అయితే పాలక ప్రభుత్వాలు చేపట్టే ఇలాంటి సంస్కరణలపై న్యాయస్థానాలకు వెళుతున్న సందర్భాలే ఎక్కువ. విశ్వప్రయోజనం కోసం అమలవుతున్న ఇలాంటి చట్టాల అమలుపై వస్తున్న పిటిషన్లను సాధ్యమైనంతగా నిరుత్సాహపరచాల్సిన బాధ్యత అటు న్యాయవ్యవస్థలకు సైతంఉంది. అప్పుడే ఈ చట్టాలకు బహుముఖ సార్ధకత కలుగుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

నీకు వినడానికి కష్టంగా ఉన్నా నీ గురించి వాస్తవాలు చెప్పేవారి సలహానే తీసుకో.



రామకృష్ణ పరమహంస

నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్‌కామూ

# ప్రజావాక్కు

## మంత్రులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి!

కాకినాడ పోర్ట్ ద్వారా రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్న విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌గారు పట్టుబడిన బియ్యం నౌకవద్దకు వెళ్ళి పరిశీలించడం ఆహ్వానించదగిన పరిణామం. గత అయిదు సంవత్సరాల పాలనలో అధికార యంత్రాంగం పూర్తిగా భ్రష్టు పట్టిపోయింది. ఎక్కడా జవాబుదారీ తనం కానరావడం లేదు, ఆ పైన అక్రమాల దస్త్రాలు, ఫైళ్లు మాయం చేస్తున్నారు. వివిధప్రభుత్వ శాఖల్లో వైఫల్యాలు, లోపాలపై పత్రికల్లో ఆధారాలతో సహా వార్తలు వస్తున్నా మంత్రుల్లోచలనంలేని దుస్థితినెలకొంది. మొత్తం మంత్రివర్గంలో ఒకరో, ఇద్దరో మంత్రులు తప్పించి మిగిలిన వారు పరిస్థితి తీవ్రతను గుర్తించడం లేదు. ప్రభుత్వ పాలన తీరు మెరుగుపడకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతుంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు క్షేత్రస్థాయి తనిఖీలు దినసరి కార్యక్రమంగా చేపట్టాలి.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

## పెరుగుతున్న ఫుడ్‌పాయిజన్ మరణాలు

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 1000 కి పైగా గురుకులాలు, ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాలలో రోజురోజుకు విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్, మరణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గురుకులాలలో పనిచేస్తున్నడాక్టరేట్ పొందిన పరిశోధకులురాష్ట్రంలోని వివిధ గురుకులాలలో లెక్చరర్స్‌గా ఉపాధ్యాయులుగా ప్రస్తుతం పనిచేస్తున్న వారిని వారి వివరాలు సేకరించివారిలో ఎస్సీ ఎస్టీబీసీ వికలాంగుల రిజర్వేషన్ ప్రకారంవీరిని రాష్ట్రసమగ్ర అభివృద్ధిలోభాగంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వీరి సలహాలను కూడా స్వీకరించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా చూడాలి.

-రాపాక రవీందర్, జనగాం

## బస్సులకు అనుమతి ఇవ్వాలి

హన్మకొండ జిల్లా నయీమ్‌నగర్ పెద్ద మోరీపై ఏడు కోట్లతో నిర్మితమైన బ్రిడ్జి పనులు పూర్తయి ఆటోలు, కార్లు, ప్రైవేట్ వాహనాలు నెలరోజుల నుండి రాకపోకలు సాగిస్తున్నాయి. కానీఅధికారులు ఆర్టీసీబస్సులను ఈబ్రిడ్జిమీద నుండి నడపకపోవడంవల్ల ప్రయాణికులుతీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. బ్రిడ్డి పనులు పూర్తయి అన్ని వాహనాలు నడుస్తుంటే బస్సులెందుకు అనుమతించడం లేదు.

- ఎన్. పవన్‌కుమార్, సిద్ధిపేట జిల్లా

## వలంటీర్ల రద్దు

నూతన ఏపి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం వలంటీర్లు సేవలను రద్దుచేయడం జరిగింది. అప్పటి వరకు ప్రజల సేవలను వారి గృహాలకు అందజేసేవారు. అనారోగ్యంతో బాధపడేవారు, వయస్సు 70దాటినవారు సాధారణంగా దూరం వెళ్లలేకపోవచ్చు. వీరికి వలంటీర్ సేవ బాగా ఉపయోగం. అయితే ఇప్పటి వరకుఉన్న చెల్లింపుల బాధ్యత పూర్తిగా కార్యదర్శులు చేయాలి. పింఛను దారు వచ్చిన తరువాత చెల్లింపులకు పని సిద్ధంగా ఉంటేచాలు. గ్రామంలో ఒకేసారి హెచ్చు సంఖ్యలో వస్తారు. పట్నంలో వారి అవసరాన్ని బట్టి రావొచ్చు. అన్ని పెన్షన్‌లను 3 తారీఖులో పూర్తిచేయాలన్న అత్యవసర నిబంధన మంచిదే గానీ సిబ్బందికి కొంత వారి పరిధి దాటుతుంది. ఆ సమయంలో వారుఫీల్డ్ విధులు చేయలేరు. సిబ్బంది కొందరు సెలవులో ఉండొచ్చు. మొత్తంగా వారికి అప్పగించిన విధులన్నిటినీ దృష్టిలో ఉంచడం సబబు.

-బొల్లోజు మేఘూనాథమ్, విశాఖపట్నం

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు నూటికి నూరు శాతం నిస్తేజులు, నిర్వీర్యులు, సహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు. వారి తల్లిదండ్రులకు ఏమాత్రం అవకాశం ఉన్నా వారిపిల్లలను ప్రభుత్వపాఠశాలలలో చదివించడానికి ఇష్టపడని రోజులు ఇవి. ప్రైవేటు పాఠశాలలలో ఎన్ని మార్కులకు ఎగ్జామ్ పెడతారో అన్ని మార్కులకే ప్రోగ్రెస్ కార్డులు ఇస్తారు. ఇలా మాయాబజార్ మార్కులు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు ఇవ్వరు. ఈ ఆలోచన ప్రభుత్వ అధికారులకు ,విద్యాశాఖ అధికారులు ఎందుకు వచ్చింది? ఎలిమెంటరీ స్కూలు హైస్కూల్లో కలిపేశారు. అర్థంపర్థంలేని ఆలోచనచేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల మొర చెవిటివాని ముందు శంఖం అయ్యింది.

- వీరగంట భాస్కర్ రావు,బొబ్బిలి

## వ్యాయామ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రస్తుత సమాజంలో ఊబకాయంఎంతో ప్రమాదకరంగా మారుతుంది. పలు ఆరోగ్య సమస్యలకు, ముఖ్యంగా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది. మారుతున్న జీవన విధానం, ముఖ్యంగా ఆహారపుఅలవాట్లు మారుతుండడం ఊబకాయానికి ప్రధాన కారణమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. బడి ఈడు పిల్లల్లో ఈసమస్య పెరగడంఆందోళన కలిగించే అంశం.

-ఎం.ముత్యంరెడ్డి, అందెగ్రామం, సిద్ధిపేటజిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వ్యవసాయంలో 'డ్రోన్ల' సాంకేతికత

**మనదేశంలో డ్రోన్ పరిశ్రమ 2030నాటికి తయారీ సామర్థ్యానికి 5,00,000 మందికి పైగా ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా. డ్రోన్ సాంకేతికతను స్వీకరించడా నికి ఆటంకం కలిగించే కొన్నిసవాళ్లు కూడా ఉన్నాయి. డ్రోన్ల వాడకం వల్ల మానవ శ్రమ అవసరం తగ్గుతుందని, తమ జీవనోపాధి దెబ్బతింటుందని చాలామంది కూలీలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జనాభాలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయంలో డ్రోన్లను ప్రవేశపెట్టడానికి ఇది ఒక అవరోధంగా మారవచ్చు. ఈ సవాళ్లను అధిగమించడానికి మరిన్ని ప్రయత్నాలు, చొరవలు అవసరం. డ్రోన్‌లను నిర్వహించడానికి శిక్షణ, నైపుణ్యం అందించాలి. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగానికి అనుకూలమైన ఎనేబుల్ చేసే పర్యావరణ వ్యవస్థను రూపొందించడం అవసరం. డ్రోన్లు భారతీయ వ్యవసాయాన్ని మార్చడానికి, దేశ ఆహార భద్రత శ్రేయస్సును నిర్ధారించడానికి శక్తివంతమైన సాధనం. అయితే వీటిని ఉపయోగించడంలో కొన్ని సందేహాలను, రైతుల భయాలను పోగొట్టవలసిన అవసరం ఎంతైనాఉంది.**

డి జె మోహన రావు

ప్రతీ ఎనిమిది సంవత్సరాలకు ఏ రంగంలోనైనా చెప్పుకోదగ్గ మార్పులు వస్తాయనేది అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి వ్యవసాయరంగం మినహాయింపు కాదు. వ్యవసాయ ఆధారిత దేశమైన మన దేశంలో సుమారు 77శాతం ప్రజానీకం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ద్వారానే ఉపాధి పొందుతున్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 17.5 శాతం ఈ రంగం ద్వారా సమకూరుతుంది. రైతన్నఅనుకూలించని ప్రకృతి, పంట దిగుబడిలో క్షీణత, ఖరీదైన రసాయన మందులు వాడాల్సిరావడం, నైపుణ్యం ఉన్న మానవ వనరుల కొరత, వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గడం లాంటి ఎన్నో ఒడిదుడుకులను పంట చేతికొచ్చేవరకు ఎదుర్కొంటున్నాడు. రానురాను వ్యవసాయంపై అధిక ఖర్చు పెట్టవలసి వస్తుంది. మారుతున్న కాలంతోపాటు, పెరుగుతున్న జనాభాకి సరిపడా ఆహారం పండించాలన్నా, వ్యవసాయంలో పెరుగుతున్న వ్యవసాయ కూలీల కొరతను అధిగమించాలన్నా వ్యవసాయంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. ఈ నూతన సాంకేతికతలో వ్యవసాయ డ్రోన్లు ముందు వరుసలో ఉంటాయనేది కాదనలేని నిజం. మెరుగైన సామర్థ్యంతో కూడిన డ్రోన్‌లు పెద్ద పంటపొలాలను త్వరగా సమర్థవంతంగా కవర్ చేస్తాయి. తద్వారా రైతులు డేటాను సేకరించడానికి, పంటలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తాయి. మెరుగైన కచ్చితత్వం కలిగిన అధిక రిజల్యూషన్ చిత్రాలు, డేటాను క్యాప్చర్ చేస్తాయి. ఇవి సమస్యలను ముందుగానే గుర్తించడంలో సహాయపడుతాయి. వృక్షసంపద లేదా పంట, కలుపు మొక్కలు, అంటువ్యాధులు తెగుళ్ల వల్ల కలిగే పొలాల ప్రాంతాలను అంచనా వేస్తాయి. వీటి ఆధారంగా సమస్యలను ఎదుర్కోవడానికి రసాయనాల కచ్చితమైన మొత్తాలను వర్తింపజేయడం ద్వారా మొత్తం ఖర్చును తగ్గించవచ్చు. నేల నాణ్యత, తేమ, పోషక స్థాయిలపై డేటాను అందిస్తాయి. పంట ఆరోగ్యంపై డేటాను సేకరించేందుకు, వాతావరణ పరిస్థితులను పర్యవేక్షించడానికి రైతులకు సూచనలను సలహాలను అందించడానికి, కరవులు, వరదలు లేదా వడగళ్ల వానలు వంటి విపరీత వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. పంట ఎత్తు, దిగుబడిని కొలవడానికి కచ్చితమైన అంచనాలను అందించడానికి, వ్యవసాయ సరిహద్దులను మ్యాప్ చేయ డానికి, భూమి రికార్డులను డిజిటలైజ్ చేయడంలో వినియోగించవచ్చు. డ్రోన్లో పురుగుమందులు, పోషకాలను నింపడా నికి 5నుంచి 10 కిలోల అధిక సామర్థ్యం కలిగిన మానవరహిత ట్యాంకు ఉంటుంది. సాంప్రదాయక ఎరువుల కంటే పంట ఉత్పాదకతను 8నుండి 25పెంచి, పర్యావరణ ప్రభావాన్ని 50నుండి 70 వరకు తగ్గించే మరింత ప్రభావ వంతమైన, పర్యావరణ అనుకూలమైన నానో యూరియా, నానో డిఎపిలను



సమర్ధవంతంగా పిచికారీ చేయొచ్చు. డ్రోన్ కేవలం 15 నిమిషాల్లో దాదాపు ఎకరం భూమిలో పురుగుమందును ఏకరీతిగా పిచికారీ చేస్తుంది. ఇది రైతుల సమయాన్ని, డబ్బును ఆదా చేస్తుంది. ఇది పంటఉత్పత్తిపై పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఏటవాలులు లేదా అధిక వోల్టేజ్ విద్యుత్ లైన్లు వంటి మానవులకు కష్టమైన లేదా ప్రమాదకరమైన ప్రాంతాలను చేరుకొని మానవప్రమాదాలను తగ్గిస్తాయి. విత్తనాలు, మొక్కలు ఇతర ఇన్‌పుట్‌లను పొలాలకు రవాణా చేయడానికి, రహదారి మౌలిక సదుపాయాలపై ఆధారపడ టాన్ని తగ్గించవచ్చు. రైతులు వారి పంటలను వివరణాత్మ కంగా వీక్షించవచ్చు. వీటివలన తెగుళ్లు, వ్యాధులు, పంట నష్టాన్ని గుర్తించి నిరోధించడానికి, పంట నాణ్యత పరిమా ణాన్ని మెరుగుపరచవచ్చు. విత్తనాలు నాటడానికి అవసర మైన శ్రమను, సమయాన్ని తగ్గిస్తాయి. ఇది రైతులకు మెరుగైన సామర్థ్యం, మెరుగైన పంట దిగుబడి, తగ్గిన ఖర్చులు, మెరుగైన కచ్చితత్వం వంటిఅనేక ప్రయోజనాలను అందిస్తాయి. ఎరువులు, పురుగుమందులు వేసేటప్పుడు వాటిని తాకడంవల్ల వచ్చే ఆరోగ్యసమస్యలు, పురుగుల లేదా పాము కాటు వంటి అనేక సమస్యల నుండి కాపాడుతాయి. హరిత సాంకేతికతవల్ల కలిగే ప్రయోజనాలతో పాటుగాఇబ్బందులను నివారణలో రైతులకు సహాయ పడతాయి. పంట పొలాల వైమానిక చిత్రాలు వీడియోలను రూపొందించడానికి, వాటిని మార్కెటింగ్ ప్రమోషన్ ప్రయో జనాలను పొందవచ్చు. పొలాలనుంచి కూరగాయలు, పండ్లు, మొద లైన వాటిని మార్కెట్లకు తీసుకెళ్లడానికి కూడావీటిని ఉపయోగించవచ్చు. తక్కువనష్టంతో, తక్కువ సమయంవెచ్చించి నేరుగా వీటి ద్వారా మార్కెట్‌కు సరఫరా చేయడంవల్ల రైతులకు నష్టాలను తగ్గించి లాభాలను పెంచుతాయి. వ్యవసాయంలో డ్రోన్‌లవినియోగం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించడానికి పుష్కలమైన అవకాశాలనుకూడా అందిస్తుంది. వ్యవసాయరంగంలో డ్రోన్ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చగల డ్రోన్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, శిక్షకులు అవసరం కాబట్టి ఇవి గ్రామీణప్రాంతంలో యువతకుకొత్తఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. డ్రోన్ పరిశ్రమకు మద్దతు, పరిష్కారాలను అందించగలడేటా విశ్లేషకులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, హార్డ్‌వేర్ తయారీదారులు వంటి పరోక్షఉపాధి అవకాశాలను కూడా డ్రోన్‌లు సృష్టించగలవు. మనదేశంలో డ్రోన్ పరిశ్రమ 2030నాటికి తయారీ సామర్థ్యానికి 5,00,000 మందికి పైగా ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా. డ్రోన్ సాంకేతికతను స్వీకరించడానికి ఆటంకం కలిగించే కొన్నిసవాళ్లు కూడా ఉన్నాయి. డ్రోన్లవాడకంవల్ల మానవ శ్రమ అవసరం తగ్గుతుందని, తమ జీవనోపాధి దెబ్బతింటుందని చాలామంది కూలీలుఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జనాభాలో ఎక్కువ మందికిఉపాధి కల్పిస్తున్న వ్యవసాయంలో డ్రోన్లను ప్రవేశపెట్టడానికి ఇది ఒక అవరోధంగా మారవచ్చు. ఈ సవాళ్లను అధిగమించడానికి మరిన్ని ప్రయత్నాలు, చొరవలు అవసరం. డ్రోన్‌లను నిర్వహించడానికి శిక్షణ, నైపుణ్యం అందించాలి. వ్యవసా యంలో డ్రోన్‌ల వినియోగానికి అనుకూలమైన ఎనేబుల్ చేసే పర్యావరణ వ్యవస్థను రూపొందించడం అవసరం. డ్రోన్లు భారతీయ వ్యవసాయాన్ని మార్చడానికి, దేశ ఆహార భద్రత శ్రేయస్సును నిర్ధారించడానికి శక్తివంతమైన సాధనం. అయితే వీటిని ఉపయోగించడంలో కొన్నిసందేహాలను, రైతు ల భయాలను పోగొట్టవలసిన అవసరం ఎంతైనాఉంది. •

# ఆహార కల్తీపై ప్రభుత్వ చర్యలేవి?

జవ్వాజి దిలీప్ సాహు

తెలంగాణ రాష్ట్రంలో విద్యా కుసుమాలు నేలరాలుతున్నాయి. విద్యా ప్రమాణాలు సైతం రోజురోజుకి పడిపోతున్నాయి. విద్యకు, విలువల బోధనకు చిరునామాగా ఉండాల్సిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఆత్మహత్యలకు అవాంఛనీయ సంఘటనలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థులను విలువలతో కూడిన విద్యకై గురుకులాల్లో చదివించేవారు కానీ నేడు విలువల మాట దేవుడెరుగు విద్యార్థులు విగత జీవులుగా మారి బయటకు వస్తున్నారనటంలో ఎటువంటి సందేహం లేకపోలేదు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలలో మార్పు అనివార్యమని, ప్రజలు భావించి, కోరుకున్న మార్పులకు అనుగుణంగా ప్రజాస్వామ్యపద్ధతిలో మార్పును తీసుకువచ్చారు. ప్రభుత్వాలు మారినప్పటికీ, ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల బతుకులు మారడంలేదు. తల్లితండ్రులు తమ పిల్లల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి అని చదువుకోసం ప్రభుత్వ విద్యాలయాలకు పంపిస్తుంటుంటే అసలు వారికి జీవితాలే లేకుండాపోతున్నాయి. ప్రభుత్వ విద్యాలయాల్లో జరుగుతున్నవి ఆత్మహత్యలు కావు ముమ్మాటికి ప్రభుత్వ తీరు కారణంగా జరుగుతున్న హత్యలుగానే తెలంగాణ మేధావి వర్గం భావిస్తున్నది. ప్రయోగశాలల్లో రసాయనాలతో సమస్యలకు పరిష్కారాలు కనుగొనాల్సిన విద్యార్థులు విషం బాటిళ్లను పట్టుకుంటున్నారు. రాబోయే రోజుల్లో డాక్టర్లుగా మారి స్టెతస్కోప్లను మెడలో ధరించాల్సిన వీరు ఉరితాళ్లను ముద్దాడుతున్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే నానుడి మన భోజనశాలల్లో నిత్యం కనిపిస్తూ ఉంటుంది అయితే అదే అన్నాన్ని తిని స్మశానం బాట పట్టాలని ఆ బ్రహ్మదేవుడే వారి తలరాతను రాసాడేమో గాని కల్తీ అయిన అన్నం తిని విద్యార్థులు జీవచ్ఛావాలుగా మారుతున్నారు. ఇన్ని సంఘటనలు జరుగుతున్న రాష్ట్రంలో 20మందికి పైగా విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకున్న, 40మందికి పైగా విద్యార్థులు మరణించినా, 30 పర్యాయలకు పైగా ఫుడ్‌పాయిజన్ సంఘటనలు జరిగినా, దాదాపుగా 800మందికి పైగా ఫుడ్‌పాయిజన్ జరిగి అనారోగ్యం పాలవుతున్న ప్రభుత్వం స్పందించకపోవటం చర్యలు తీసుకోకపోవడం వెనుకఉన్నవారితీరు మాత్రం అనుమానాస్పదంగా ఉంది. రాబోయే తరాల కోసం చెరువుల పరిరక్షణ అనే సదుద్దేశంతో హైడ్రా అనే ఒక డిపార్ట్మెంట్ ఏర్పాటు చేసి ప్రణాళికపరంగా చెరువుల పరిరక్షణకై ఏ విధంగా పాటుపడుతున్నారో మనం చూస్తూనే ఉన్నాం. మరి అదేవిధంగా విద్యార్థులు పిట్టల్లారాలిపోతున్న కనీసం స్పందించడం లేదు, కాస్మొటిక్ చార్జీలు పెంచాం, విద్యా కమిషన్ ఏర్పాటు చేశాం, విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం అని ప్రగల్బాలు పలుకుతున్న ప్రభుత్వం ఈ ప్రభుత్వ విద్యాలయాల్లో జరుగుతున్నటువంటి ఆత్మహత్యల పైన గాని ఫుడ్‌పాయిజన్ ఘటనలపైన గాని, ఇతర అవాంఛనీయ సంఘటనలపై ఎందుకు స్పందించడం లేదు. అసలు ఇన్ని ఫుడ్‌పాయిజన్ సంఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నా ప్రభుత్వంగాని, వివిధ కులాల వారిగా కేటాయించినటువంటి సంక్షేమ శాఖల మంత్రులు గాని, ప్రభుత్వ అధికార యంత్రాంగం గాని ఎందుకు నేటి వరకు ఎటువంటి రివ్యూమీటింగ్ సైతం నిర్వహించలేకపోయింది. ప్రభుత్వమే ఇంతటి నిర్లక్ష్యపు వైఖరితో ఉన్న కారణంగానే రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో, ప్రభుత్వ విశ్వవిద్యాలయ వసతి గృహాల్లో సైతం ఆహారంలో పురుగులు వస్తున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ, అక్కడ స్థానికంగా క్రియాశీలకంగా పనిచేస్తున్న విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తే ఆయా విద్యార్థులకు ఆయా విశ్వవిద్యాలయ అధికారులు హెచ్చరిక మెమోలు జారీచేస్తూ ఇది ప్రభుత్వ విశ్వవిద్యాలయం వసతి గృహం నచ్చితే తినండి లేదంటే లేదు అన్ని హెచ్చరికలు జారీచేస్తుంది. అయితే ప్రభుత్వ తీరు ఇంతటి నిర్లక్ష్యంగా ఉన్నప్పుడు ప్రభుత్వ విశ్వవిద్యాలయ అధికారులతీరు కూడా ఈ రకంగా ఉండటం సర్వసాధారణమే అనిపిస్తుంది. అయితే ఒకపక్క రాష్ట్రంలో రోజుకో ప్రభుత్వ పాఠశాలలోనూ ప్రభుత్వ వసతిగృహంలోనూ ప్రభుత్వ విశ్వవిద్యాలయంలోనూ ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగుతున్నప్పటికీ ఆహార భద్రత అధికారుల తీరు, చర్యలు మాత్రం అగమ్యగోచరంగా ఉంటున్నాయి. పదేపదే రెస్టారెంట్ బిర్యాని లోను బొద్దింక వచ్చిందని, ఫుడ్ కోర్ట్ చికెన్ రైస్‌లో వెంట్రుకలువచ్చాయని, శాగ్ హౌస్ మటన్ బిర్యానీలో పురుగులు వచ్చాయని తనిఖీలు చేస్తూ ఉంటారు, కేవలం ఆయా ప్రైవేట్ రెస్టారెంట్లలో మాత్రం తనిఖీలు చేయడం వెనక ఆంతర్యం ఏమిటి? అయితే రాష్ట్రంలో ఉన్నటువంటి విపరీతమైన పరిస్థితులను కొన్ని పత్రికలు సమాజం ముందించిన కారణంగా హైకోర్టు సైతం ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి గారు తీవ్రంగా స్పందించారు. ఈ మధ్యకాలంలోనే మాగనూరు ఫుడ్‌పాయిజన్ ఘటనపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేక మళ్లీ అదే ఫుడ్‌పాయిజన్ సంఘటన పునరావృతమైంది. వసతి గృహాల్లో జరుగుతున్న ఆత్మహత్యల విషయంలో కఠిన చర్యలు ఉంటాయని బహిరంగంగా ప్రకటించి వెంటనే విద్యాశాఖ మంత్రిని సైతం నియమించి, జిల్లాల వారిగా కలెక్టర్ల పర్యవేక్షణలో వివిధ కులాల వారిగా, వారి సంక్షేమశాఖల మంత్రులచే గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల వసతి గృహాల స్థితిగతులపై సమీక్ష నిర్వహించి, ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే రోజుల్లో ఇటువంటి ఫుడ్ పాయిజన్ ఘటనలు గాని మరే అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. •

# కనుమరుగవుతున్న మానవతా విలువలు!

స్వామినాథ్ రేవల్లి

రోజు రోజుకి రోడ్డుప్రమాదాలు భారీగా పెరుగుతూ మానవ మనుగడలో పెనుప్రమాదంగా మారినాయి. గతేడాది 2023లో రోడ్డు ప్రమాదాలలో రోజు 474 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023లో భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు దాదాపు 1.73లక్షల మంది ప్రాణాలను కోల్పోయారు. 4.63 లక్షల మంది గాయపడ్డారు, ఇందులో ద్విచక్ర వాహనదారులు ముఖ్యంగా హెల్మెంట్ లేని వారి మరణాల్లో 44 శాతం మంది ఉన్నారు అని ప్రభుత్వ రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ గత నివేదికల్లో వెల్లడించింది. రోడ్డు ప్రమాదాలలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు తమిళనాడు 64,105 ప్రమాదాలతో అగ్రస్థానంలో ఉంది, ఆ తరువాత మధ్యప్రదేశ్ 54,432, కేరళ 43910 ఉత్తర్‌ప్రదేశ్ 41,746 కర్ణాటక 39,762 అలాగే తెలంగాణ రోడ్డు ప్రమాదాలలో 8వ స్థానంలో తెలంగాణ మరణాలలో 10వ స్థానంలో పరిమితమయ్యాయని 2022 నివేదికల్లో వెల్లడయ్యింది. ఇది ఇలాఉంటే నేడు సమాజంలో మానవునిలో నైతిక విలువలు కనుమరుగైపోతున్నాయి. సాటి మానవుడికి సహాయం చేసే ఆలోచనలో కొంతమంది ఉన్న వారి సహాయం సకాలంలో అందితే చాలామందిని కాపాడగలిగే వారు కానీ సమాజంలో చాలామంది వ్యక్తులు ఈ ఉదాసీనత కారణంగా పోలీసులకు, న్యాయపరమైన చర్యలకు భయపడే కారణంగా బాధితులకు అవసరమైన సహాయం పొందడానికి వెనకాడుతుంది. మరి కొంతమంది నైతిక విలువలు మరిచి వీక్షిస్తూ తన చరవాణితో చిత్రాన్ని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెడుతూ తాత్కాలిక ఆనందంలో గడుపుతున్నారు. సమాజంలో కొంతమంది ఉదాసీనత చర్యలకి భయపడుతున్న వారికిపలువిషయాలు తెలియజేయాలి. వాటిలో భాగంగా సేవ్‌లైఫ్ ఫౌండేషన్ 2012లో ఒక పిటిషన్ను సుప్రీంకోర్టులో దాఖలుచేసింది. ఆ పిటిషన్ను విచారించినప్పుడు ప్రమాదాల బాధితులకి సాయం చేయడానికి మార్గదర్శకాలను ఆమోదించాలని సుప్రీంకోర్టు భారత ప్రభుత్వానికి సూచించింది. దీనిలో భాగంగా రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ 13 మే 2015న నోటిఫై చేయబడిన మార్గదర్శకాలను విడుదలచేసింది. ప్రమాదానికి గురి అయిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లే మంచి వ్యక్తులను ఎలాంటి ప్రశ్నలు అడగరు వాళ్ళు వెంటనే వెళ్ళిపోవచ్చు వారు ప్రత్యక్ష సాక్షులు అయితేతప్ప, ఆమె/ అతడు బలవంతంగా వారి చిరునామాను నమోదు చేయరాదు చెప్పరాదు. ప్రమాద బాధితులకు సాయం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం రివార్డు అందజేయొచ్చు, తద్వారా ప్రమాద



బాధితులను రక్షించడానికి ఇతరులని ప్రోత్సహించవచ్చు. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రదేశానికి పోలీస్ లేదా ఎమర్జెన్సీ సర్వీస్‌కు కాల్ చేసే ప్రేక్షకుడు తన పేరు లేదా ఇతర వ్యక్తిగత వివరాలను ఫోన్లో లేదా వ్యక్తిగతంగా వెల్లడించాల్సిన అవసరం లేదు. ఆసుపత్రులు అందించే మెడికల్ లీగల్ ఫారంలో మంచి వ్యక్తులు తమ వ్యక్తిగత సమాచారాన్ని సమర్పించడం ఐచ్ఛికం. అతని/ ఆమె వ్యక్తిగత వివరాలను వెల్లడించినందుకు ప్రేక్షకుడిని బలవంతం చేసే అధికారులపై క్రమశిక్షణ లేదా శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయి. అతడు/ ఆమె ప్రమాదానికి ప్రత్యేక సాక్షిఅని స్వచ్ఛందంగా చెబితే అతను/ఆమెను పోలీసుల దర్యాప్తులో వేధించకుండా ఉండేలా ఆపరేటింగ్ విధానాన్ని అమలుచేస్తారు. ఒక వైద్యుడు ప్రమాద బాధితుడికి సంరక్షణ అందించాలని ఆశించినప్పుడు సహాయం చేయడంలో విఫలమైతే, అతని చర్యలు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ రెగ్యులేషన్ యాక్ట్ 2002 సూచించిన విధంగా ప్రొఫెషనల్ దుర్వినియోగంగా పరిగణించబడతాయి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయి. నైతిక విలువలు మానవతా విలువలు చలనచిత్రాలకి పరిమితమైన నిజజీవిత సమాజంలో మాత్రం కనుమరుగైపోయాయి. ఇలాపై విషయాలపైన నేటి సమాజంలో నైతిక విలువలపై అవగాహన కల్పించాలి. నైతిక విలువలు మానవులలో నశించడం వల్ల సాటి మానవునిపై దయ, కరుణ ధైర్యం సహాయం నిష్పత్తి వాటిని కోల్పోతున్నాడు. సాటి మానవుడు దుర్గతిలో ఉంటే సహాయం చేసే దృక్పథకోణాన్ని నేటి సమాజంలో అందరూ అలవర్చుకోవాలి. ఆ విధంగానైనా నైతిక విలువలని నేటి సమాజంలో చాటి చెప్పడం ద్వారా ఎంతో కొంతనైనా మానవసమాజ రూపకల్పనకి దుహదపడుతూ ఉంటాయి. నేటి సమాజంలో తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచి నైతిక విలువలు సమగ్రత ,బాధ్యత వినయం కరుణా, దయా, క్రమశిక్షణ సామాజిక భద్రత వ్యక్తిగత భద్రత వీటి విలువలపై అవగాహన కల్పించడం చాలా వరకు తల్లిదండ్రుల ముఖ్య లక్షణాలుగా భావించాలి. సామాజిక పద్ధతివైపు నడుస్తున్న పలుసంస్థలలో అలాగే నేటి ఉజ్వల భవిష్యత్తుకు పునాదిగా మారుతున్న విద్యారంగాలలో నేటి విద్యార్థులకు నైతిక విలువలపైన వాటి మార్గదర్శకాలు నేటి మానవ అభివృద్ధిలో ముఖ్యపాత్ర వహిస్తున్నందున వాటిపైన అవగాహన కల్పించే విధంగా అధ్యాపకులు బోధించసాగాలి. అయోమయ సమాజంలో పలు ఎన్జీవోలు నైతిక విలువలు పైన అవగాహన కల్పించుటకు నేటి సమాజంలో అక్కడక్కడ కాంపెన్స్ రన్ చేస్తూనే ఉన్నారు. సాటి మనిషి ఇతరులకి నేటి సమాజంలో నైతిక విలువల పట్ల వాటి ప్రాముఖ్యత గురించి ఇతరుల వ్యక్తులతో ప్రోత్సహించేలా ఆలోచన దృక్కోణాన్ని అలవర్చుకోవాలి. విద్యలు నైతిక విలువలని చేర్చడం విద్య విషయ సాధనకు మంచిది ఇది విద్యార్థులను ఉద్దేశంతోకూడిన జీవితం నైతిక నిర్ణయాధికారం సానుకూల ప్రభావం కోసం సిద్ధం చేస్తుంది. •

# పెమ్మసాని చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ



తెనాలి, డిసెంబర్ 1 (ప్రభాతవార్త) : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయ వంతంగా చేపడుతున్న పెన్షన్లను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన చేతుల మీదుగా వృద్ధులకు ఆదివారం పంపిణీ చేశారు. పచ్చదనం, ప్రాణహితం కార్యక్రమం క్రింద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనేందుకు బుర్రిపాలెం గ్రామానికి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విచ్చేశారు. ఈ కార్యక్రమం అనంతరం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కలిసి పెమ్మసాని వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేశారు.

అమరావతి వార్త

# వణుకు పుట్టిస్తున్న ఫెంగల్ తుఫాను

## చిరుజల్లులతో రైతులు ఉరుకులు,పరుగులు

**కొల్లిపర,డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఫెంగాల్ తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకోవటంతో డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంతో కొద్ది పాటి జల్లులు పడ్డాయి.పంట చేతికొచ్చిన వరి పంట కొంతమేర నేలకొరిగింది.మిషన్‌తో నూర్చి కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని రక్షించుకోవటానికి కొందరు రైతులు ఉరుకులు..పరుగులు పెట్టారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందుతుందో..లేదోనని కొందరు రైతుల్లో కలవరం మొదలైంది.వర్షాలు మరింత పడితే నేలవాలిన పంట..కంకులు వర్షం నీటిలో నానితో మొలకెత్తే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు.. వర్షాలతో పంట చిక్కుకుపోవటం రైతులు నిరుత్సాహంతో నీరుకారి పోతున్నారు.ఆదివారం కూడా ధాన్యం వ్యాపారులు మిషన్‌తో నూర్చిన ధానాన్ని రూ.బస్తా(75 కిలోలు) రూ.1400 వరకు కొనుగోలు చేసారు.చిరు జల్లులు పడటంతో రైతులు ఆశలు అడియాశలుగా మిగిలేలా ఉన్నాయి.మండలంలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర,శిరిపురం,చివలూరు, అత్తోట, దంతలూరు, కుంచవరం తదితర గ్రామాల్లో వరి పంట 90 శాతం కోతకు వచ్చింది.ఇప్పటికే కొందరు రైతులు యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి ఉండటంతో చిరు జల్లులకు తడవకుండా పట్టాలు కప్పి పంటను రక్షించుకున్నారు .మరి కొందరు రైతులు మిషన్‌పై నూర్చిన ధాన్యాన్ని డొంకరోడ్లపై ఆర బెట్టిన రైతాంగం జల్లులు పడతాయనే భయంతో ట్రాక్టర్ల సాయంతో గ్రామాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరికుప్పలు వేసిన రైతాంగం ధాన్యం దెబ్బతిన కుండా కుప్పపైన పట్టాలు కప్పారు.ఏది ఏమైనప్పటికీ ఈ తుఫాన్ ముప్పు తప్పి వర్షాలు మరో 20 రోజులు పడకుండా అగితే రైతాంగం ధాన్యం పూర్తి స్థాయిలో ఇళ్ళకు చేర్చుకోగలుగుతారు. ధాన్యాన్ని ఇంటికి చేర్చుకుని ఆనందమైన సంక్రాంతి పండుగను జరుకుంటారు.రైతులకు అంతా మంచి జరగాలని కోరుకుందాం.



హడావుడిగా ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుతున్న దృశ్యం



కొల్లిపరలో వర్షానికి పడిపోయిన వరి



# దళారులను నమ్మి మోసపోకండి

## -రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, డిసెంబర్ 1 (ప్రభాతవార్త) : రైతుల వద్ద ఉన్న ధాన్యం చివరి బస్తా వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దళారుల మాటనమ్మి రైతులు మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు భరోసా కల్పించారు. ఆదివారం సాయంత్రం ఐతానగంలోని రైతు సహాయ కేంద్రంలో ధాన్యం కొనుగోలు తీరును మంత్రి మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడుతూ రైతాంగం దగ్గర నుండి ఆఖరి బస్తా వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకనుగుణంగా రైతాంగ ప్రయోజనాలకు తగు ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో దళారులు చెప్పే కల్లబొల్లి మాటలను రైతు సోదరులు పట్టించుకోవద్దని సూచించారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతన్నకు మేలు చేసేలా పని చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసి 48గంటల్లోనే రైతులు ఖాతాలకు నగదు జమ చేస్తుందని తెలిపారు. 7,00,000మెట్రిక్ టన్నులపై చిలుకు ధాన్యం కొనుగోలు చేసి నగదు చెల్లింపు చేయడం జరిగిందని మంత్రి మనోహర్ పేర్కొన్నారు. మిల్లర్లు ఇబ్బంది పెడితే రైతులు ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావాలని, ఇబ్బంది పెట్టిన వారిని బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందని ఆయన వివరించారు. సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి మనోహర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఈదర పూర్ణచంద్, మేకల చిట్టిబాబు, నాయకులు కన్నెగంటి మురళీకృష్ణ, తోటకూర వెంకట రమణరావు, ఇస్మాయిల్, అమిరినేని రాజా, పలువురు రైతులు, స్థానికులు పాల్గొన్నారు.



## పేదలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది : ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ,డిసెంబర్1,ప్రభాతవార్త:** పేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఏ.కొత్తపాలెం గ్రామానికి చెందిన చల్లా పద్మకు మంజూరైన 61వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జీ.వీ ఆదివారం అందజేశారు. జీ.వీ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కూటమి ప్రభుత్వం ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పౌరుషానికి ప్రతీక పల్నాటి వీరారాధనోత్సవాలు

**కారంపూడి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** పౌరుషానికి ప్రతీక పల్నాటి వీరారాధనోత్సవాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని తెదేపా పార్ల మెంటరీ పార్టీనేత, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం పల్నాటి వీరారాధనోత్సవాల్లో రాయబారం ఘట్టానికి విచ్చేశారు. శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి అంకాళమ్మ దేవాలయం, చెన్నకేశస్వామి దేవాలయం, వీర్ల దేవాలయంలో పూజలు నిర్వహించారు. కన్నమదాసు ఖడ్గాన్ని చేతపట్టారు. పార్టీ నేతలుభారీ ర్యాలీ నిర్వహించి గజమాలతో సత్కరించారు వీర్ల దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శనలో పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రపంచంలో దైవాలకు పూజలు నిర్వహించడం పల్నాడు ప్రాంతంలోని కారంపూడిలో మాత్రమే జరుగుతాయని అన్నారు. ఆనాడు యుద్ధంలో మృతి చెందిన వీరులను స్మరించుకుంటూ ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. జాతి సమైక్యతకు నిలువెత్తు నిదర్శనమే వీరారాధనోత్సవాలన్నారు. రైతులు పశు సంపదపైదృష్టి పెట్టాలన్నారు. రైతులు ఎడ్ల పందేల కోసమే కాకుండా పాడి పశువులను కూడా పెంచుకోవాలని సూచించారు. శతాబ్ధాల రైతఉల కలసాకారం అవ్వాలని లక్ష్యంతో వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు కుళాయి అందేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల చరిత్రను కులమతాలకు అతీతంగా వీరారాధనోత్సవాలు జరుపుకుంటున్నా పల్నాటి ప్రాంత ప్రజల రుణం తీరదన్నారు. చింతపల్లి విద్యార్థులు ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో వైద్యుడు ఉన్నం నాగమల్లికార్జునరావు, తెదేపా సీనియర్ నాయకులు యనముల కేశవరెడ్డి, పంగులూరి అంజయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, పంగులూరి పుల్లయ్య, గోళ్ల సురేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ రమావత్ నాగులునాయక్, ఇన్‌ఛార్జి సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్, గోరంట్ల నాగేశ్వరరావు, తుపాకుల చినరత్తయ్య, జాస్తి గంగారావు, మునుగోటి సత్యం, చప్పిడి రాము, జనసేన నియోజకవర్గ కన్వీనరు బూసా రామాంజనేయులు, కేసానుపల్లి కృష్ణబాబు, రైతు సంఘం నేతలు బొమ్మిన శేషగిరి, తోట నరసింహారావు, జక్కా నరసింహారావు, మొద్దీన్‌సా తదితరులు పాల్గొన్నారు.





## చెత్తసేకరణ వాహనాలను ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు గల్లా మాధవి ,నసీర్

**గుంటూరు క్రైమ్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** స్థానిక పశ్చిమ నియోజకవర్గంలో పారిశుద్యం మెరుగుకోసం నగరపాలకసంస్థ సహకారంతో మరిన్ని మెరుగైన చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు.ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తగా 100చెత్త సేకరణ బండ్లు,బిన్స్,ఈ-ఆటోలను ఎమ్మెల్యే గల్లా మాధవి,ఎంపి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మహ్మద్ నసీర్,కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ.. గుంటూరు పశ్చిమ నియోజవర్గంలోపారిశుద్య మెరుగుకోసం తాము ఆధిక ప్రాధాన్యం ఇస్తున్నామని "మీతో నేను--మీ వెంటే నేను" కార్యక్రమం ద్వారా అనేక డివిజన్‌లలో పర్యటించినప్పుడు తనకు పారిశుద్య సమస్యలే స్వాగతం పలికాయని,పారిశుధ్యం మీద యుద్ధంప్రకటించాలన్న లక్ష్యంతో "స్పెషల్ శానిటరీ డ్రైవ్" అనే కార్యక్రమం నిర్వహించానని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.చెత్త సేకరణకు చిన్న వీధుల్లోకి ఆటోలు పూర్తిస్థాయిలో వెళ్ళడం లేదని గుర్తించానని,చెత్త సేకరణ బండ్లు అయితే ప్రతి ఇంటి నుంచి నేరుగా చెత్తసేకరణ సులభతరమవుతుందన్న భావంతో చెత్త సేకరణ బండ్లు మంజూరు చేయాలని కమీషనర్ పులి శ్రీనివాసులును కోరగా,గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి 100చెత్త సేకరణ బండ్లను కేటాయించారని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు.





## ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పోను ఆసక్తిగా వీక్షించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిషా

**విజయవాడ, డిసెంబర్ 1, ప్రభాత'వార్త' :** విజయవాడలో జరుగుతున్న ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పోను చివరిరోజు ఆదివారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిషా దంపతులు ఆసక్తిగా వీక్షించారు. ఎక్స్‌పో నిర్వహిస్తున్న శ్రీధర్ సిసి సంస్థ నిర్వహకులు కొమ్మూరి శ్రీధర్ కలెక్టర్‌కు వివరాలు తెలిపారు. వివిధ దేశాలకు చెందిన స్టాంప్స్, అన్ని లోహాలకు చెందిన కాయిన్స్ వున్నాయని, ఫోటో శతాబ్దం నుండి 20264 వరకు భారతదేశంలో ముద్రితమైన నాణెములు, బ్రిటీష్ ఇండియా రిపబ్లిక్ ఇండియా, స్వతంత్ర్య రాజ్యాలకు సంబంధిన కరెన్సీ, అన్కటేడె నోట్స్, పేపర్ కరెన్సీ, పాలిమర్ కరెన్సీ, 120 దేశాలకు చెందిన కాయిన్లను ప్రదర్శనను పెద్దఎత్తున వీక్షిస్తున్న విద్యార్ధిని విద్యార్థులను కలెక్టర్ లక్ష్మిషా పలకరించారు. ఎక్స్‌పో నిర్వహకులను అభినందించారు.





# ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ వికేంద్రీకరణ : కలెక్టర్ నాగలక్ష్మీ

**గుంటూరు కలెక్టరేట్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నేటినుండి (02-12-2024) నుంచి మండల,డివిజనల్,మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల,డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకో వచ్చన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్,మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు.ప్రజలు విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు.



# స్టడీ టూర్‌కి జిఎంసి కమీషనర్

**గుంటూరు,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** ఈనెల 2,3తేదీల్లోజైపూర్ నగరపాలక సంస్థ స్టడీటూర్‌కి నగర కమీషనర్ పులి శ్రీనివాసులు వెళ్ళనున్నారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్తాన్ రాజధాని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ లో వీధి దీపాల పర్యవేక్షణ వ్యవస్థ,రోడ్ల నిర్వహణ,సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్,ద్రవ వ్యర్థాల నిర్వహణ మరియు ఇతర ఉత్తమ పద్దతుల అమలు పరిశీలన,అధ్యాయనం కోసం గుంటూరు నగర కమీషనర్ ఈనెల 2,3తేదీల్లో హాజరుకానున్నారు.

## తాగునీటి పైపులు డ్రైనులో కలువకుండా చూసుకోవాలి : విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్త:** త్రాగునీటి పైపులైనులు డ్రైన్లలో కలవకుండా చూసుకోవాలని, అక్కడి ప్రజలకవసరమైన అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలను పూర్తి చేసి తనకు అందచేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన సాంబమూర్తి రోడ్,భగత్‌సింగ్ రోడ్,జిఎస్‌రాజు రోడ్, పాతపాడు, నూజివీడు రోడ్,సింగ్‌నగర్,కండ్రిక ప్రాంతాలు తిరిగి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. 64వ డివిజన్‌లో నివసిస్తున్న ప్రజలకు సదుపాయాలన్నీ కల్పించాలని,త్రాగునీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా శుద్ధమైన త్రాగునీటి సరఫరా చేయాలని, త్రాగునీటి నమూనాలను పరీక్షిస్తున్నప్పటికీ పూర్తి నిర్ధారణ ఖచ్చితంగా చేసుకోవలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేయాలని పాయకాపురం చెరుకును అభివృద్ధి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇంఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు,సూపరింటెండెంట్ ఇంజనీర్ వర్క్స్ పి.సత్యన్నారాయణ,ఇన్చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ వృథ్యాప్య పింఛన్ అందజేత

నందిగామ డిసెంబర్ 01 ప్రభాతవార్త: నందిగామలోని నిరుపేదలకు వాసవీ వృథ్యాప్య పెన్షన్స్ 2024 డిసెంబర్ నెల 48వ నెలకుగాను శ్రీ పారేపల్లి సాయిబాబు ఆర్యవైశ్య సంఘం ఈరోజు ఉదయం 10:00 గంటలకు ఒక్కొక్కరికి నెలకు 500 చొప్పున ఉచిత పంపిణీ ఇవ్వడం జరిగింది. నందిగామ వాస్తవ్యులు , ఆర్యవైశ్య ప్రముఖులు అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవాసంస్థలకు తమ వంతు సహాయం సహకారాములు అందించారు.

## ఎయిడ్స్ మరణం కాదు ఒక వ్యాధి మాత్రమే

### -ఎయిడ్స్ పై అవగాహన కల్పించిన నందిగామ గ్రామీణ వైద్యులు

**నందిగామ డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఎన్టీఆర్ జిల్లా నందిగామ గ్రామీణ వైద్యులు ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం గాంధీ సెంటర్లో ఆదివారం ఉదయం నిర్వహించారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 1వ తేదీని ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచడం ఎయిడ్స్ వ్యాధితో మరణించినవారిని స్మరించుకోవడం ఎయిడ్స్ వ్యాధి కారక హెచ్‌ఐవీకి వ్యతిరేకంగా పోరాడడం కోసం ఈ రోజును కేటాయించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దాసు వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ నందిగామ గాంధీ సెంటరల్లో ఆదివారం ఉదయం హెచ్‌ఐవీ ఎయిడ్స్ మరియు సుఖ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం వల్ల హెచ్‌ఐవికి గురికాకుండా చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. హెచ్‌ఐవి కేవలం అరక్షితమైన సంపర్కాలు, హెచ్‌ఐవి ఉన్న గర్భిణీ నుండి పుట్టబోయే బిడ్డకు, హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు సిరంజీవులు పరీక్షింపబడని రక్తము ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని ఇక ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వారికి హెచ్‌ఐవి పరీక్షలు ఉచితంగా ఉన్నాయని పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. మందులు అందుబాటులో ఉన్నాయని మందులు వాడుతూ వైదయులు సలహాలు పాటించాల్సిన అవసరం ఉందని ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేకుండా జీవతం కొనసాగించాలని తెలియజేశారు. వ్యాధి ఉందని కారణంతో వివక్ష చూపకూడదని తెలిపారు. ఎయిడ్స్ మరణం కాదని అది ఒక వ్యాధి మాత్రమే అని తెలిపారు.





## అభివృద్ధి పనులు జరగని ఈ కౌన్సిలర్ల సమావేశం ఎందుకు

### -తెదేపా కౌన్సిలర్ ఎస్‌కె అబ్దుల్ హుస్సేన్ ఆగ్రహం

**ఎ కొండూరు, డిశంబరు 1, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నగర పంచాయతీ సమావేశం అధికార వైసిపి ప్రతిపక్ష అధికార వైసిపి ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్ల మధ్య వాడి వేడి చర్చ జరిగింది. ఈ సమావేశంలో టిడిపికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ ఎస్‌కె అబ్దుల్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ ఈ తిరువూరు మున్సిపల్ కార్యాలయం ద్వారా పట్టణంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగటం లేదని చైర్‌పర్సన్ (వైసిపి) కౌన్సిల్ అధికారులు నగర పంచాయతీ పరిధిలో వీధిలైట్లు పారిశుధ్యం, కుక్కలు కోతులు పందులు బెడద లాంటి సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని అధికార వైసిపి చైర్‌పర్సన్ కౌన్సిలర్లను అధకారులను టిడిపి కౌన్సిలర్ ఎస్‌కె అబ్దుల్ హుస్సేన్ గట్టిగా నిలదీశారు. ఈ మునిసిపాలిటీ గత 35 నెలల నుండి ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మునిసిపాలిటీ పరిస్థితి ని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నగర పంచాయతీ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని టిడిపి కౌన్సిలర్ ఎస్‌కె అబ్దుల్ హుస్సేన్ కోరారు. ఈ మొక్కుబడి సమావేశాల వల్ల ఒనగూడిన ప్రయోజనం ఏమీ లేదని కౌన్సిలర్ అబ్దుల్ హుస్సేన్ ఆగ్రహించారు.



## కాపు యువత ఆధ్వర్యంలో కార్తీక వనసమరాధన

**నందిగామ డిసెంబర్ 1 ప్రభాతవార్త:** నందిగామ నియోజకవర్గం కాపు యువత ఆధ్వర్యంలో చల్లా సంగమేశ్వరరావు మామిడి తోట మరియు సిఎస్‌ఆర్ గార్డెన్స్ భద్రయ్య తోట మధిర రోడ్డు, నందిగామ నందు ఏర్పాటు చేసిన కార్తీక వన సమరాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్టీఆర జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయ భాను మరియు జనసేన యువనాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# డిసెంబర్ 9వరకు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువు పెంపు

## - పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, డిసెంబర్1,ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి ఓటర్లుగా నమోదు చేసుకోనివారు తమ ఓట్లు నమోదు చేయించుకోవాలని నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు తేది గడువు పెంచడం జరిగిందని, ఈనెల డిసెంబర్ 9వరకు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని ప్రత్తిపాటి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ,గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గానికి సంబందించి ఓటర్లుగా చేరే గడువు ముగిసిందని, కానీ ఓటర్ల నమోదు ప్రక్రియలో పలు సాంకేతిక కారణాలతో పలు ధరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని అనే అంశం తన దృష్టికి వచ్చిందని ప్రత్తిపాటి తెలిపారు. గ్రామాలలో పెట్టిన ధరఖాస్తులు పట్టణానికి, అదేవిధంగా పట్టణంలో పెట్టిన ధరఖాస్తులు గ్రామాలకు కేటాయించడం జరిగిందనే విషయాన్ని గుర్తించారని అన్నారు. ఈ నేపద్యంలో తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు చొరవతీసుకొని ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లారని అన్నారు. ఈ



విషయంపై ఎన్నికల సంఘం స్పందించి డిసెంబర్9వ తారీఖువరకు అర్హులైనవారు మరలా నూతనంగా ధరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ నమోదు కానివారు ఫారం18ను ఓటుకోసం ధరఖాస్తు చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాను అందరికి అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. ఓటర్ల డ్రాఫ్ట్‌లో పేరు లేని అర్హులైన వారు ఫారం 18ని పూర్తిచేసి ధరఖాస్తు చేసుకోవాలని, ఓటు ధరఖాస్తు చేసుకున్నవారికి ఆన్‌లైన్‌లో ఓటర్‌గా ధరఖాస్తు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్‌గా నమోదు కాని అర్హులైన పట్టభద్రులు అందరూ ఉపయోగించుకోవాలని ప్రత్తిపాటి కోరారు.

## తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

**మాచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త:** తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చిన సంఘటన మాచర్ల పట్టణంలో జరిగిందది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచరన్ల పట్టణానికి చెందిన మూడేళ్లన్ల బాలుడు ఆదివారం తప్పిపోయాడు. ఈ నేపథ్యంలో పలు వాట్సప్ గ్రూపులలో బాలుడి ఫొటోతో సందేశాలు వెళ్లాయి. స్థానికులు బాలుడిని గుర్తించి పోలీసులకు అప్పగించారు. బాలుడి తల్లిదండ్రులు పోలీసు



స్టేషన్‌కు రావడంతో బాలుడిని అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు

## రెంటచింతల మండలంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

**మాచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త:** రెంటచింతల మండలంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం, అందులోని జ్ఞానం ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీల అధ్యక్షులు, సభ్యులు



కటికం సైదారావు, యద్ధనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎన్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, రామాంజనేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్‌లు పాల్గొన్నారు.

## విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం

**చెరుకుపల్లి, డిసెంబరు 1, ప్రభాతవార్త ః** జనవరి 5న విజయవాడ సమీపంలోని కేసనపల్లిలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న



హైందవశంఖారావానికి లక్షలాదిగా తరలిరావాలని బాపట్ల విశ్వహిందూపరిషత్ కోకన్వీనర్ వి వెంకటచలగోపి అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య కల్యాణమండపంలో శంఖారావం నిర్వహణపై ఆయన పరిషత్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. హిందూదేవాలయాలపైన దాడులు అరికట్టాలన్నారు. మత మార్పిడిలను నిరోధించాలన్నారు. ముఖ్యంగా హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తిని కల్పించేందుకు హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రేపల్లె అసెంబ్లీ కో కన్వీనర్ ఉప్పు సాంబశివరావు, హిందూ చైతన్యవేదిక సభ్యులు కోట విజయకుమార్, వేణు, విశ్వంశెట్టిశ్రీను, ఉప్పలపాటి సుబ్బయ్య, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## రహీం సాహెబ్‌కు సత్కారం


**పొన్నూరు, డిసెంబర్ 1,ప్రభాతవార్త:** పొన్నూరు ఆర్టీసి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ రహీం సాహెబ్‌కు శత కవుల సమ్మేళనంలో సత్కారం జరిగింది. విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో అమరావతి ఆర్ట్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శత కవుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షేక్ రహీంసాహెబ్ తెలుగుని బతికించు అనే వచన కవిత గానం చేశారు. రహీంసాహెబ్ చేసిన గానానికి మెచ్చిన కవులు సంస్థ నిర్వాహకులు రహీంసాహెబ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కళారత్న డాక్టర్ పొట్లూరి హరికృష్ణ, ప్రముఖ సంఘ సేవకులు గోళ్ళ నారాయణ, సాహితీవేత్త బివివి సత్యనారాయణ, అమరావతి ఆర్ట్స ఫౌండేషన్ అధ్యక్షుడు కె.విజయలక్ష్మి,



తదితరులు పాల్గొని సత్కరించారు. ఈ సందర్భంగా రహీంసాహెబ్‌ను ఆర్టిసి డిపో మేనేజర్ తుమ్మపూడి అజితకుమారి, ఆర్టీసి నాయకులు షేక్ కరీముల్లా, ఎఎబేగ్, ఎంఎస్ రెడ్డి తదితరులు అభినందించారు.

## శ్రీ బాలకోటేశ్వరునికి విశేషార్చనలు

**పొన్నూరు, డిసెంబర్ 1,ప్రభాతవార్త:** పట్టణంలోని పాతపొన్నూరులో వేంచేసియున్న శ్రీ



బాలకోటేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. అర్చకస్వాములు స్వామివారికి వేకువ జామున అభిషేకాలు, మహా రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. నెల రోజులపాటు ఉభయదాతలుగా పేర్లు నమోదు చేయించుకున్నవారి గోత్ర నామాలతో సహస్రనామార్చన తదితర పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు, అమావాస్య రావడంతో భక్తులు పెద్దఎత్తున దేవాలయానికి వచ్చి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. భక్తులు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## చికిత్సపొందుతున్న తెదేపా నాయకుడుని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** అద్దంకి నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకుడు, టిడిపి సోషల్‌మీడియా యాక్టివిస్ట్ శ్రీను పట్టణంలోని కొమ్మినేని వీరశంకరరావు ఆసుపత్రిలో అనారోగ్యాం కారణంగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, రాష్ట్ర



టిడిపి ఉపాధ్యక్షుడు, స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అన్నివిధాల సహయ సహకారాలు అందిస్తామని చికిత్స పొందుతున్న శ్రీనుకు భరోసా ఇచ్చారు.

## కమ్యూటేషన్ కాలపరిమితి తగ్గించడం హర్షణీయం

**గుంటూరు విద్య,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** ప్రభుత్వ,విశ్రాంత ఉద్యోగులకు కమ్యూటేషన్ గరిష్ట కాలపరిమితి 15సంవత్సరాల నుండి 11సంవత్సరాల 3నెలలకు తగ్గించడాన్ని ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్‌భాషా ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా చాంద్‌భాష మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 45వేల మంది ప్రభుత్వ ఫించన్‌దారులకు,విశ్రాంత ఉద్యోగులకు మేలు జరిగిందని తెలిపారు.అలాగే భవిష్యత్తులో పదవి విరమణ కాబోయే ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు.విశ్రాంత ఉద్యోగులు,ప్రభుత్వ ఫించన్‌దారల పట్ల ప్రభుత్వం ప్రకటన చేయడం వలన రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా నరసరావుపేటలోని చిప్స్ ఫార్మసీ కళాశాల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో చిప్స్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలిపారు.ఈ పోటీలురాష్ట్రస్థాయిలో జరిగాయని,ఆ కళాశాల నిర్వహించిన పోటీల్లో పాల్గొని చాంపియన్స్‌గ నిలిచారన్నారు.నరసరావుపేట కళాశా ఆధ్వర్యంలో నిర్వహించిన



ఈ పోటీల్లో చిప్స్ విద్యార్థులు వాలీబాల్‌లో ప్రధమస్థానం,ఉమెన్ రన్నింగ్‌లో ప్రధమ,ఉమెన్ కబడ్డిలో ద్వితీయ,లాంగ్ జంప్‌లో ద్వితీయ,త్రోబాల్ పోటీల్లో ప్రధమస్థానాలు సాధించారని తెలిపారు.పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికేట్స్‌తో పాటు నగదు బహుమతులు అందజేశారు.విజేతలను యాజమాన్యం ప్రిన్సిపాల్,అధ్యాపకులు అభినందించారు.

## కాళంగి ప్రణవికి ఇంటీరియర్ డిజైన్ అవార్డు

**గుంటూరు విద్య,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** నగరానికి చెందిన కుమారి కాళంగి ప్రణవికి ప్రతిఏటా గ్లోబల్ చాంబర్ ఆఫ్ కన్స్యూమర్ రైట్ కైట్స్ క్రాఫ్ట్ ప్రొడక్షన్ ఎల్‌ఎల్‌పి వారు సంయుక్తంగా అందజేసే ఇంటర్నేషనల్ ఎమినెన్స్ అవార్డుల్లో 2024సంవత్సరానికి గాను బెస్ట్ కమర్షియల్ ఇంటీరియర్ డిజైన్ అవార్డు లభించింది.ఈ అవార్డును ప్రణవి గురుగావ్‌లో ఏర్పాటుచేసిన 21వ ఏడిషన్ సమావేశంలో అందుకున్నారు.ప్రణవి వ్యాపార రంగంలో ఇంటీరియర్ డిజైన్ అవశ్యకతను అభివృద్ధిని విద్యార్థులకు నూతన పద్దతుల్లో బోధించారు.బోధన,అభ్యాసం మరియు అభ్యాస వాతావరణాన్ని పునర్నించడంలో ప్రణవి జరిపిన విశేషకృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్లు న్యాయనిర్ణేతలు ప్రకటించారు.ప్రణవి హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో బి.టెక్ పట్టాను పుచ్చుకున్నారు.తర్వాత హైదరాబాదులోని తన మిత్రులతో కలసి స్టూడియో త్రీ రీ ను ప్రారంభించి ఇంటీరియర్ డిజైన్స్ విభాగంలో మంచిపేరు తెచ్చుకున్నారు.అవార్డు తనకు రావడమనేది చాలా అదృష్టమని తనకు భవిష్యత్తు లో ఇంకా ఎక్కువ ఉత్సాహంతో పనిచేయడానికి ఉపకరిస్తుందన్నారు.ప్రణవి నానమ్మ అహల్య మాట్లాడుతూ తమ తరంలోలా కాకుండా ఆడపిల్లలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని,తాము కూడా అమ్మాయిలు, అబ్బాయిలు అనే బేధభావం లేకుండా పిల్లలందర్ని సమానంగా పెంచామని,ఇప్పుడు తన మనమరాలు సాధించిన పనికి తాను ఎంతో సంతోషిస్తున్నానన్నారు.ప్రణవి తల్లిదండ్రులు నాగలక్ష్మి,కృష్ణ దంపతులు.పెద్దమ్మ,పెద్దనాన్నలు సుజాత,కాళంగి శ్రీనివాస్ మరియు ఇతర కుటుంబ సభ్యులు తమ అమ్మాయికి ఈ అవార్డు రావడం చాలా ఆనందంగాను,గర్వకారణంగాను ఉందన్నారు.

# ఉత్సాహంగా దేశభక్తి గీతాలాపన

**గుంటూరు కల్చరల్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు





ఆధ్వర్యంలో భరత మాత పూజా దినోత్సవాలు నవంబర్ 17నుంచి జనవరి 26వరకు ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న క్రమంలో డిసెంబర్ 1ఆదివారం ఉదయం శ్రీపద్మావతి కళ్యాణ వేదికగా రాష్ట్రంలోని పలు ప్రాంత పాఠశాలల నుండి వచ్చిన జూనియర్స్, సీనియర్స్ మూడవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పోటీల్లో భాగంగా గుండ్రని చేతిరాత,ఇంద్రజాలం,దేశభక్తి బృందగానం పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులను జనవరి 26న నిర్వహిస్తున్న కార్యక్రమంలో అందిస్తామన్నారు.పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు సుమారు 1755మందికి పార్టిసిపేషన సర్టిఫికేట్స్‌తో పాటు బిస్కట్ ప్యాకెట్స్ అందించారు.తొలుత జరిగిన సభా కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సహకార్యదర్శి వూటుకూరి నాగేశ్వర రావు,ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు మంచి సందేశాలను అందించారు.

## బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న బాపట్ల డిఆర్ఓ

**పిట్టలవానిపాలెం,నవంబర్01,ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసివున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి బాపట్ల జిల్లా డిస్టిక్ రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.ప్రాచీనమైన శక్తి క్షేత్రం బాపట్ల జిల్లాలో ఉండటం తనకు చాలా సంతోషదాయకంగా ఉన్నదని అమ్మవారి ఆలయానికి విచ్చేసిన తర్వాత తనకి ప్రశాంతత లభించిందని అమ్మవారి దర్శనం చేసుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా అమ్మవారి పూజా కార్యక్రమాలు జరిపి వేద ఆశీర్వచనము



జరిపించి అమ్మవారి జ్ఞాపిక అందజేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కే నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ఉచిత బిపి, షుగర్ వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి

**కర్లపాలెం, నవంబర్ 01, ప్రభాతవార్త:** కర్లపాలెం శ్రీరామకృష్ణ సేవా సమితిలో పేరలి నరసయ్య తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంతెన సత్యనారాయణ రాజు సహకారంతో ఉచిత బీపి షుగర్ వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు చల్లా రామ్మోహన్ రావు పాల్గొని వైద్య



పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు,పెనుమెత్స బాపిరాజు,ఏ వెంకటేశ్వర్లు,మామిడాల సాంబశివరావు,వెంకటేశ్వరరెడ్డి,జిడుగు వెంకటేశ్వర్లు,కాటూరి బాజీ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**కర్లపాలెం,నవంబర్01,ప్రభాతవార్త:** అవగాహనతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఇనకొల్లు పోలీసురావు అన్నారు.ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ కార్యాలయం ముందు అవగాహన కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో కీలకపాత్ర వహిస్తూనే ఉన్నారు.సందర్భంగా పరమానంద



కుమార్ మాట్లాడుతూ వ్యాధిపై అవగాహన ఆలోచన కలిగి జీవిత భాగస్వామితోనే ఉంటే వ్యాధి దరిదాపుకు రాదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మల్లికార్జున్ రెడ్డి,సుబ్రహ్మణ్యం,కాశీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

**వినుకొండ,డిసెంబర్1,ప్రభాతవార్త:** బ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమం స్థానిక శ్రీనివాసనగర్ నందు గల శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపం నందు ఆదివారం ఘనంగా



నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ పెద్దలు వారిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి, సన్మానించారు. జీ.వీ మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమాభివృద్ధికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. వినుకొండలో త్వరలో బ్రాహ్మణ భవన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఇల్లు లేని వారి ప్రభుత్వం తరుపు నుంచి మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మారుతీ వరప్రసాద్, శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ జీ.వీ రమణారావు, పి.వి సురేష్‌బాబు, గాలి శ్రీనివాసరావు, బాగవతుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండలో కార్తీకమాస ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు

**వినుకొండ,డిసెంబర్1,ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీనివాసనగర్ నందు గల శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేతి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా కోలాట కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వినాయక భజన కోలామండలి వారిచే కోలాట ప్రదర్శనలు అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు, ట్రెజరర్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



**నూజెండ్ల:** మండలంలోని రవ్వారం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని పవిత్రమైన మనస్సుతో ఆ పరమశివునికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు.

## వాడి వేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

### -గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి -మరోసారి అధికారులు గైర్హాజరైతే ఆఫీసుకు తాళాలు

**నిజాంపట్నం, డిసెంబరు, ప్రభాతవార్త ః** మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా



జరిగింది. అధికారుల చర్యలను నిరసిస్తూ సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. సమావేశానికి గైర్హాజరైన సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాఖలపై పరిజ్ఞానంలేని సిబ్బందిని సమావేశానికి పంపటం పట్ల నిరసన తెలిపారు. సమావేశం వాయిదావేయాలని ఒకానొక సమయంలో ఎంపిటిసి సభ్యులు కోరారు. తమ గ్రామంలోని పాఠశాలను అప్‌గ్రేడ్ చేయగా 8వ తరగతికి అనుమతి ఇచ్చారని, ఆ పాఠశాలలో 45 మంది విద్యార్థులు ఉండగా అందులో 40 మందికి టిసిలు ఇచ్చి పంపటం ఏంటని దిండి పంచాయితీ సర్పంచ్ ఎంఇఓ శోభాచంద్‌ను ప్రశ్నించగా తాను ఇటీవలే వచ్చానని పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లు చిన్నవిగా ఉంటున్నాయని వాటిని ఎలా అనుమతిస్తున్నారని , ఏదైనా సమావేశం నిర్వహిస్తే ఎంపిటిసి, సర్పంచ్‌లకు తెలియజేయటంలేదని సభ్యులు ప్రశ్నించారు. ఐసిడిఎస్ తరపున వచ్చిన సూపర్‌వైజర్ గుడ్లు విషయం తనకు తెలియదని, ప్రజాప్రతినిధులకు చెప్పాలని అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులకు చెప్పామని చెప్పారు. దీంతో ఎంపిటిసి సభ్యులు, కొత్తపాలెం,దిండి, కళ్ళిఫలం సర్పంచ్‌లు రవి, రాంబాబు, చిట్టిబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి కౌలు రైతులకు సభ్యత్వం ఉందనే విషయం ఎందుకు చెప్పలేదని ఇరిగేషన్ శాఖ ఎఇలను ప్రశ్నించారు. అందుకు స్పందించిన ఎఇలు సభ్యులు ఎవరనే విషయం రెవెన్యూశాఖ పరిధని తమకు తెలియదన్నారు. ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఎన్‌ఆర్‌ఇజిఎస్ గ్రామసభలు ఎలా నిర్వహిస్తారని సభ్యులు ప్రశ్నించారు. దిండి పంచాయితీలోని రొయ్యల ఫ్యాక్టరీ వల్ల మత్స్యకారులకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, వాతావరణంలో కలుషితం ఏర్పడుతుందని కొత్తపాలెం ఎంపిటిసి సభ్యుడు గోపాలకృష్ణ, సర్పంచ్ రవి సభకు తెలియజేయగా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేస్తామని మత్స్యశాఖ డిడి కృష్ణకిషోర్ తెలిపారు. అనంతరం ఎంపిటిసిల ప్రతినిధి మోపిదేవి హరనాథ్ మాట్లాడుతూ సభకు అనేక మంది అధికారులు హాజరుకాకపోవటం సమంజసంకాదని ఇకనుంచి అలా జరిగితే ఆఫీసుకు తాళాలు వేయటమేన న్నారు. జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ రెవెన్యూశాఖలో అనేక సమస్యలు ఉన్నాయని తహశీల్ధార్ సమావేశానికి హాజరుకాకపోవటం పట్ల ఆయన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణ కిషోర్, ఎంపిపి విజయనిర్మల, ఎంపిడిఓ నాగలక్ష్మి, వైస్ ఎంపిపి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**రేపల్లె(నిజాంపట్నం), డిసెంబరు 1, ప్రభాతవార్తః** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని సిఐ మల్లికార్జునరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెనుమూడి గ్రామ వ్యవసాయ తనిఖీ కేంద్రంవద్ద 35-40 మద్య వయస్సుకల మగ వ్యక్తి చనిపోయి పడి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వవైద్యశాలకు తరలించామన్నారు. మృతునిని గుర్తించి అతనికి సంబంధించివారెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌కు రావాలన్నారు.



## చెరుకుపల్లిలో రక్తనాళాల వైద్యశిబిరం

**చెరుకుపల్లి, డిసెంబరు 1, ప్రభాతవార్తః** ఆరోగ్యంపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని ఏషియన్ వాస్కులర్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ సోమాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆద్వర్యంలో ఉచిత రక్త నాళాల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జివి పవన్‌కుమార్ బృందం వైద్యపరీక్షలు నిర్వహించగా అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అర్హులైన వారిని గుర్తించి త్వరలో వారికి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు మిగిలినవారికి మందులు పంపిణీ చేయనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి విశ్వంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శిబిరంలో డాక్టర్ మౌనిక, సిబ్బంది నవీన్, నబి, పలువురు పాల్గొన్నారు.



## క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి: డిఎస్పీ శ్రీనివాస్

**చెరుకుపల్లి, డిసెంబరు 1, ప్రభాతవార్త ః** పోలీస్‌సిబ్బంది క్రమశిక్షణతో ఎల్లప్పుడూ విధులు నిర్వర్తిస్తూ ఉండాలని రేపల్లె డిఎస్‌పి ఎ శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా ఆదివారం చెరుకుపల్లి



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నేరాల పరిశోధన, వాటినమోదు, రికార్డులు పరిశీలించారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఏ ఒక్కరినీ ఉపేక్షించవద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె రూరల్ సిఐ సురేష్‌బాబు, ఎస్ఐ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు శిక్షణ



**మాచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఉపాధి కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్య శిక్షణ సంస్థ అధికారి తమ్మాజీరావు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

# స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరిట మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు

## -జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: బాపట్ల ఎస్పీ తుషార్ డూడి

**బాపట్ల,నవంబర్ 1,ప్రభాతవార్త:** స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరిట మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల భారినపడకుండా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ



తుషార్ డూడి అన్నారు. స్థానిక జిల్లా పోలీస్‌ప్రధాన కార్యాలయంలో ఆదివారం సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో వచ్చే తెలియని లింక్‌లు క్లిక్ చేయ్యవద్దన్నారు.ప్రజలు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఎస్పీ హెచ్చరించారు. ఆఫర్లు,లాబాల పేరుతో నమ్మించి సైబర్ నేరగాళ్లు,డబ్బులు కాజేస్తున్నారన్నారు.నకిలీ వెబ్ సైట్లతో లాభాల ఆశచూపి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.ఇటీవల కాలంలో ఆన్‌లైన్ స్టాక్ పెట్టుబడుల మోసాలు ఎక్కువగా జరుగుతున్నా యన్నారు.బాపట్ల జిల్లా పరిధిలోని ఒక వ్యక్తికి వాట్సాఫ్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ఓ లింక్ వచ్చింది.ఆన్‌లైన్‌లో ట్రేడింగ్,ఐపిఓలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అధిక లాబాలు వస్తాయని నమ్మించారు.దింతో బాధితుడు తన ఆధార్,పాన్ కార్డ్ వివరాలతో ట్రేడింగ్ అకౌంట్ తెరిచాడు.మొదటగా సైబర్ కేటుగాళ్ల చెప్పిన విధంగా కొంత మొత్తం డిపాజిట్ చేశాడు.నకిలీ ట్రేడింగ్ ఖాతాలో లాభాలు వచ్చినట్లు చూపించారు.అది నమ్మిన బాధితుడు బల్క్ ట్రేడింగ్లో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాడు.ఒక వారం రోజులు స్టాక్స్ కలిగి ఉంటే మంచి లాభాలు వస్తాయని మరోసారి నమ్మించారు. అనంతరం బాధితుడు లాభాలు కలిపి మొత్తం సుమారు రూ.40,00,000లక్షలు చూపించారు. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునే ప్రయత్నం చేయడంతో సాధ్యం కాలేదు.విత్ డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని కమీషన్ ఇతర ఛార్జీల పేరుతో మరింత డబ్బు ట్రాన్స్ ఫర్ చేయాలని ఒత్తిడి చేశారు.దీంతో మోసపోయానని గ్రహించి స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.జిల్లా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ నేరాలు జరుగు విధానం గురించి అవగాహన ఉంటే చాలా వరకు నేరాలను తగ్గించవచ్చునన్నారు.వాట్సప్,టెలిగ్రామ్‌లలో వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. మోసపూరిత మాటలు విని ఇన్వెస్టిమెంట్స్ చేయడం వల్ల అత్యాశతో చాలా మంది వారి విలువైన డబ్బును పోగొట్టుకుంటున్నారన్నారు.సైబర్ కేటుగాళ్లతో తస్మాత్ జాగ్రత్తగా ఉండాలన్నారు.ఏదైన సైబర్ నేరం జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కాల్ చేయడం ద్వారా ఫిర్యాదు చేస్తే మీరు పోగొట్టుకున్న డబ్బులను చాలా వరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు.

## శ్రీశ్రీ పోతురాజు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గాదె

**పిట్టలవానిపాలెం,నవంబర్01,ప్రభాతవార్త:** పిట్టలవానిపలెం మండల కేంద్రంలోని శ్రీశ్రీ పోతురాజు స్వామి సన్నిధి వద్ద నిర్వహించిన కార్తీక దీపోత్సవం మరియు మహా కర్పూర హారతి కార్యక్రమములో గ్రామస్తుల ఆహ్వానం మేరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కుంచల వీర రాఘవరెడ్డి,గోవతోటి విజయ్,మారుబోయి శ్రీనివాస్‌రెడ్డి,డేగల రవి రెడ్డి,పులుగు చినవీర రాఘవులు,గాదె యుససేన,గ్రామ పెద్దలు మరియు మహిళలు,చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## తెదేపా సీనియర్ నాయకుడు తెళ్ల సుబ్బారావుకు మాతృవియోగం

**చిలకలూరిపేట,డిసెంబర్1,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు, చిలకలూరిపేట విద్యాసంఘాల అధ్యక్షుడు తెళ్ల సుబ్బారావు తల్లి తెళ్ల శ్రీహరమ్మ ఆదివారం మృతిచెందారు. ఆమె మృతి పట్ల మాజీమంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుమారుడు తెళ్ల సుబ్బారావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కోరారు.



## విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ మర్రి

**చిలకలూరిపేట,డిసెంబర్1,ప్రభాతవార్త:** పట్టణంలోని పోలిరెడ్డిపాలెం గ్రామంలో వేంచే సియున్న సిద్ధిబుద్ధి విఘ్నేశ్వరస్వామి దేవా స్థానంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహించిన వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ దేవస్థానంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తియ్యగూర అంజిరెడ్డి, శ్యాం, చాపలమడుగు రామలింగేశ్వర రావు, దొప్పలపూడి అప్పారావు, తియ్యగూర నరేంద్రరెడ్డి, తులాబందుల సుధాకర్, కిలారు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## చిప్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

**గుంటూరు విద్య,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** నాగార్జున ఎడు ్యకేషన్ సొసైటీ వారి చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ యొక్క ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్ గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలియజేశారు.కార్యక్రమంలో దాసరి పాలెంలో విద్యార్థిని విద్యార్థుల చేత అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా ఇందులో భాగంగా ఎయిడ్స్‌పైన అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంచారు.కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమం ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి డాక్టర్ జె.సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిందని తెలియజేశారు.ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు యాజమాన్యం కళాశాల సిబ్బందిని అభినందించారు.



## ఎప్పుడు దొరికిపోయినా ఎదురుదాడి వైకాపా ఫార్ములా

### - జనసేన రాష్ట్ర నాయకుడు పెంటేల బాలాజీ

**చిలకలూరిపేట,డిసెంబర్1 ,ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వంలో వేళ్లూనుకుపోయిన రేషన్ మాఫియా కట్టడికి కూటమి ప్రభుత్వం స్వయంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రయత్నిస్తుంటే దీనిపై అంబటి రాంబాబు, వైసిపి నాయకులు విమర్శలు చేయడం శోచనీయమని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి హోదాలో నడి సముద్రంలో అక్రమ రేషన్ బియ్యం పట్టుబడిన నౌకను పరిశీలించేందుకు, రేషన్ బియ్యం మాఫియాను కట్టడి చేయడానికి పవన్‌కళ్యాణ్ వెళితే ఈ అంశంపై వైసిపి నేతలు రాద్ధాంతం చేయవలసిన అవసరం ఏమొచ్చిందని బాలాజీ ప్రశ్నించారు. కూటమి నేతల సహకారంతోనే ఈ మాఫియా నడుస్తుందని వైసిపి నాయకులు ఎదురుదాడికి దిగటాన్ని ఆయన ఖండించారు. రేషన్ బియ్యం మాఫియాపై చర్యలు తీసుకోకూడదా అని బాలాజీ వైసిపి నేతలను ప్రశ్నించారు. రేషన్ మాఫియాకు పుట్టినిల్లు వైసిపియే నని బాలాజీ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయంలో అధికారులు కూడా రేషన్ బియ్యం మాఫియాను కట్టడి చేయలేక పోయారని బాలాజీ వెల్లడించారు. దీనితో పౌరసరఫరాల శాఖలో అవినీతి తారాస్థాయికి చేరిందని అన్నారు. పేదలకు ఉచితంగా ఇచ్చే బియ్యం కాకినాడ పోర్టునుంచి విదేశాలకు తరలిపోతోందని బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి పెద్దల సహకారంతో గత ప్రభుత్వంలో వెళ్లిన బియ్యం విలువ షుమారు 950 కోట్ల రూపాయిలు అని బాలాజీ గణాంకాలు వెల్లడించారు. స్వయంగా మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడకు వచ్చి పోర్టుతో సహ గోదాములను జులైలో తనిఖీచేసి రూ157 కోట్ల విలువైన 50.647 టన్నులు బియ్యాన్ని స్వాధినం చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ మాఫియాపై ప్రత్యేక దృష్టి సారించిందని, విదేశాలకు ఎగుమతి చేస్తున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపిందని తెలిపారు. తప్పుచేసిన వైసిపి నేతలు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని బాలాజీ హెచ్చరించారు.



# అలరాజు రాయబారం వికటించడం యుద్ధానికి బీజం

**కారంపూడి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** పల్నాటి వీరారాధ నోత్స వాల్లో రెండోరోజు రాయబార ఘట్టం ఆదివారం జరిగింది. అరణ్యవాసం అనంతరం తమ మాచర్ల రాజ్యాన్ని తమకు అప్పగించమని మలిదేవరాజు, బ్రహ్మనాయుడు న్యాయనిర్ణేత అలరాజును రాయబారిగా నలగామరాజు, నాగమ్మల వద్దకు పంపుతారు. మలిదేవరాజు కోడిపందెంలో ఓడిపోవడంతో ముందుగా జరిగిన ఒప్పందం మేరకు బ్రహ్మనాయుడు వారి అనుచరులు రాజ్యం వదిలి ఏడు సంవత్సరాలు అరణ్యవాసం పూర్తి చేసుకొని వస్తారు. గడువుతీరి ఆరు నెలలు గడుస్తున్నా రాజ్యాన్ని తిరిగి ఇవ్వకపోవడంతో నలగామరాజు అల్లుడు పేరిందేవి భర్త అలరాజును గురజాలకు బ్రహ్మన్న రాయబారం పంపుతాడు. అలరాజును రాయబారం పంపే సమయంలో అతని తల్లి బ్రహ్మన్నతో వీరాగ్రేసుడైన పెదబాలరాజును గానీ, నీ మానస పుత్రుడు కన్నమదాసు, నీ కుమారుడు బాలచంద్రుడిని పంపవచ్చుగా అంటుంది. కోడి పందేలలో గురజాల రాజ్యం వారు చేసిన మోసాలను, దుర్మార్గాలను తెలిసి కూడా ధర్మం పేరిట, న్యాయం పేరిట మనలను ఓటమి అంగీకరించమన్నప్పుడు నిష్పక్షపాతంగా



వ్యవహరించిన ధర్మమూర్తి అలరాజు అని బ్రహ్మనాయుడు అంటాడు. అలరాజు అంగరక్షకుడిగా కన్నమదాసును పంపటమే కాకుండా మహీమాన్వితమైన తులసిమాలను వేసి గురజాల రాజ్యానికి రాయబారిగా పంపుతానని బ్రహ్మన్న తెలుపుతాడు. రాయబారానికి వెళుతుండగా మార్గమధ్యలో బాలచంద్రుడు కనిపిస్తాడు. ఇరువురి మధ్య సరదాగా పందెం కావారు. ఓడినవారు నిలువు దోపిడీగా షరతులు పెట్టగా అలరాజు ఓడిపోతాడు. నిలువుదోపిడీగా అన్ని ఆభరణాలు, తులసిమాలను కూడా తీస్తాడు. అలంకరణ పూర్తి చేసుకొని తులసిమాలను మరచిపోయి గురజాలకు బయలుదేరాడు. నరసింగరాజు, నాగమ్మలు దౌర్జన్యాలు చేసి సూదిమోపినంత నేల కూడా ఇవ్వమని నలగామరాజుతో కోపంతో ఆగ్రహిస్తాడు. సహనానికి విలువ లేకుండా పోయిందని పల్నాట రక్తం ఏరులై పారవలసిందేనంటూ అలరాజు యుద్ధం ప్రకటిస్తాడు. విజయమో, వీరస్వర్గమో రణంలో తేల్చుకుందామంటూ వీరావేశంతో నాగమ్మ వర్గీయులను హతమారుస్తాడు. మార్గమధ్యలో నాయకురాలు నాగమ్మ కుతంత్రంతో తంబళ్లజీయర్ ద్వారా అలరాజుపై విషప్రయోగం చేసి చంపిస్తుంది. ఘటనతో ఆగ్రహం వ్యక్తం చేసిన బ్రహ్మనాయుడు యుద్ధం ఆసన్నమైందని ప్రకటిస్తాడు. వీరావిద్యావంతులు వీర్ల దేవాలయంలో కథాగానాన్ని ఆలపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దైవాలు (కొణతములు) (నాగులేరు గంగధారి మడుగులో స్నానం చేయించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్, ఆచారవంతులు పాల్గొన్నారు.

## సంచార జాతుల వారికి దోమతెరలు పంపిణీ

**తెనాలి, డిసెంబర్ 1 (ప్రభాతవార్త) :** పట్టణ పరిధిలో నివాసాలు లేక, రోడ్ల పక్కన జీవనం గడిపే సంచార జాతుల కుటుంబాలకు ఆదివారం సినీ దర్శకుడు దిలీప్‌రాజా దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దిలీప్‌రాజా మాట్లాడుతూ స్థానిక మార్కెట్ వంతెన దగ్గర రోడ్ల పక్కన, రాత్రులు సరైన అవకాశాలు లేక, దోమల దాడితో సరైన నిద్రకు అవకాశం లేని నిరుపేద కుటుంబాలకు దోమతెరలు ఇవ్వడం ద్వారా కొంతైనా వారికి ప్రయోజనం లభిస్తుందనే భావనను వ్యక్తం చేశారు. అనంతరం పెదరావూరు, కొలకలూరు కాలవ కట్టలపై జీవిస్తున్న గిరిజనులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిపల్లి శ్రీకాంత్, రత్నాకర్, నరేష్, దోనే భాస్కర్ పాల్గొన్నారు.



## రాష్ట్రంలో బంగారు వర్తకుల సమస్యలను పరిష్కరించాలి

### -రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్

**నరసరావుపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో బంగారు వర్తకుల సమస్యలను పరిష్క రించాలని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్



రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జరిగిన మూడు జిల్లాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 13,14,15 తేదీలలో విజయవాడలో అంతర్జాతీయ నగలు, బంగారు వస్తువులు, డైమండ్స్ అమ్మకాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన వర్తకులు పాల్గొన్నారని తెలిపారు. ఆయా జిల్లాలకు సంబంధించి వెంకటగిరి, రాయచోటి, పీలూరు, రేణిగుంట, గూడూరు, నారాయణపేట, తిరుచానూరు పట్టణాల నుండి అసోసియేషన్ సభ్యులు పాల్గొనడం జరిగిందన్నారు. బంగారు వర్తకులకు సంబంధించి వ్యాపారంలో వస్తున్న నూతన బంగారు వస్తువులు, మోడల్స్ పరిచ యం చేసేందుకు విజయవాడలో ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తొలుత రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌కుమార్‌ను అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

**నరసరావుపేట క్రైం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కోటప్పకొండ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో టూ వీలర్ పై ఉన్న బాలుడు కమల్ (14) అక్కడికక్కడే మృతిచెందాడు. పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన రామారావు కుమారుడుగా మృతుడిని గుర్తించారు. చేతికి వచ్చిన కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విజయవంతంగా ముగిసిన పోలీసు స్పోర్ట్స్ మీట్

**నరసరావుపేట క్రైం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా పోలీస్ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం ముగిసింది. గుంటూరు రేంజ్ ఐ.జి. త్రిపాఠి, ఎస్పీ కె.శ్రీనివాసరావు, జేసి సూరజ్, డిఎఫ్ఓ కృష్ణప్రియ కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా ఆర్మ్డ్ రిజర్వు జట్టు నిలిచింది. టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులుగా నిర్వహి స్తున్న క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, సిబ్బందిని ఐజి త్రిపాఠి అభినందించారు. వ్యక్తిగత ఛాంపియన్‌గా వెల్దుర్తి ఎస్.ఐ. షేక్.సమంధర్, ఏఆర్‌పిసి నాగరాజు నిలిచారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వారు తెలిపారు. మంచి ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణ, వ్యాయామం, యోగా, మెడిటేషన్ చేయాలని సూచించారు. క్రీడల ముగింపు సందర్భంగా పోలీస్ పతకాలను, ట్రోఫీలను, మెడల్స్‌ను, మెమోంటోలను విజేతలకు అందించారు. ముగింపు వేడుకలలో క్యాంప్ ఫైర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ సంతోష్, అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, డిఎస్పీలు కె.నాగేశ్వరరావు, హనుమంతరావు, మహాత్మాగాంధీరెడ్డి, రామారావు పాల్గొన్నారు.



## విజయవంతమైన కంటి వైద్య శిబిరం

**రొంపిచర్ల, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని వీరవట్నం గ్రామంలో ఆదివారం ఎం.వి.రెడ్డి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ ఎం.వివేకానందరెడ్డి, డాక్టర్ సృజనలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అభినందించారు. అనంతరం డాక్టర్ వివేకానందరెడ్డి మాట్లాడుతూ శిబిరంలో 257 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. 17 మందికి శుక్లములు, 12 మందికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. కంటి సమస్యలు రాకుండా మంచి పౌష్టిక ఆహారమైన ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎం.వి.రెడ్డి హాస్పటల్ సిబ్బంది దిలీప్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## వీరాటం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే చదలవాడ

**రొంపిచర్ల, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని వీరాటం గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామంలోని సి.సి.రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. రూ.10 లక్షలకు పైగా విలువైన అభివృద్ధి పనులను గ్రామంలో చేసుకోవడం సంతోషమన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. పల్లెల్లో నివాసితులకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. కార ్యక్రమంలో మండల పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే అరవింద్‌బాబు**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభ, ర్యాలీ కార్యక్రమాలను ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు అని తెలిపారు. ఉపాధ్యాయులు బోధించే విలువైన పాఠాలతోనే దేశ నిర్మాతలు తయారవుతారని తెలిపారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను, నాయకులను ఈ సందర్భంగా అభినందించారు.

## ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**బాపట్ల,నవంబర్01,ప్రభాతవార్త:** ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని దాని నియంత్రించడం మన కర్తవ్యమని వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ,అవగాహన కల్పిస్తూ ఎన్జీవోలకు సూచనలు జారీ చేసినట్లు పలు సూచనలు,ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ ర్యాలీ ఏరియా వైద్యశాల జిల్లా



వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయము వద్ద నుండి బాపట్ల పాత బస్టాండ్ వరకు ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పచ్చజెండా ఊపి ర్యాలీ కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రజలకు ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన పెంపొందించే విధంగా సూచనలు సలహాలు తెలియజేశారు.తదుపరి అంబేద్కర్ భవన్,డాక్టర్ నంబూరి ఐజాక్ వేదిక పై అవగాహన సదస్సును ఏర్పాటు చేసి,అవగాహన సభకు ముఖ్యఅతిథిగా బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి జ్యోతి ప్రజ్వలన గావించారు .బాపట్ల జిల్లా లెప్రసీ ఎయిడ్స్,టిబీ అధికారి డాక్టర్ రోహిణీ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ప్రపంచంలో 1983లో కనబడిందని,ఇండియాలో మొదటి కేసు 1986లో బయటపడిందని 1988సంవత్సరం నుండి డిసెంబర్ ఒకటో తేదిన ఓల్డ్ ఎయిడ్స్ డే గా జరుపుకుంటున్నామని అన్నారు.హెచ్ఐవి సోకిన తర్వాత అది ఎయిడ్స్‌గా మారే లోపు తగు జాగ్రత్తలు తీసుకున్న యెడల ఆ వ్యాధిని నియంత్రించవచ్చునని 2030నాటికి పూర్తిగా ఎయిడ్స్ నియంత్రించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మంచి మార్గంలో పయనిద్దాం అనే నినాదంతో జరుగుతుందని ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన పెంచుకొని ఎయిడ్స్ వలన కలిగే కష్టనష్టాలను తెలుసుకుని ఈ వ్యాధిని అరికట్టాలన్నారు.ఎయిడ్స్ వ్యాధి సెక్స్ వర్కర్ల ద్వారా, అపరిశుభ్రతమైనటువంటి శిరంజులు వాడుట వలన,రక్త మార్పిడి జరిగే సందర్భాలలో ఒకరి నుంచి ఒకరికి సంక్రమిస్తుందని ఎయిడ్స్ మహమ్మారి ప్రభల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మేరకు ఏపి స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ వారి సూచనలు ప్రకారం ఆగస్టు 12వ తేదిన బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై మీకు తెలుసా అనే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు.ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని దాని నియంత్రించడం మన కర్తవ్యమని ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు.బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ మన రక్తంలో ఉన్న వైరస్‌ను ఇతర వ్యక్తులకు వెళ్లకుండా చూసుకోవాలని,హెచ్ఐవి సోకిన వ్యక్తిని పేషంట్ అనకూడదని,ఆ వ్యాధి గురించి అవగాహన,కౌన్సిలింగ్ ఇచ్చి వారిలో మనోధైర్యం నింపాలని హైచ్ఐవి అంటే అదో రకమైన భయంకరమైన వ్యాధి అనే అపోహను తొలగించాలని ఎన్జీవోలు వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి మందలు ఇచ్చి ఆ మందులు సకాలంలో వాడుతున్నారా లేదా పౌష్టిక ఆహారం తీసుకుంటు న్నారా లేదా మద్యపానాలు సేవిస్తున్నారా లేదా అన్ని తెలుసుకోవాలని లేనిచో వాళ్ల ఇమ్యూనిటీ పవర్ తగ్గిపోయి వ్యాధి ఎక్కువ అవుతుందన్నారు. హెచ్ఐవి సోకిన వ్యక్తిలో భయాన్ని పోగొట్లాని రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దాని వలన కలిగే ప్రయోజనాన్ని తెలిపి వారిలో అవగాహన పెంచాలని ఎన్జీవోలకి సూచించారు.ఈ కార్యక్రమంలో మేదరమెట్ల,బాపట్ల,చీరాల ఎన్జీవో యూనిట్ల డైరెక్టర్లు,ఉద్యోగులు మరియు నర్సింగ్ విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ఉత్సాహ భరితంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** వర్సిటీలో రెండురోజులుగా జరుగుతున్న సౌత్ వెస్ట్‌జోన్ అంతర విశ్వవిద్యాల యాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా సాగాయి.రెండో రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి,







వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పిపిఎస్ పాల్‌కుమార్ వెల్లడించారు.67కేజీల విభాగంలో మధురై కామరాజు యూనివర్సిటీ క్రీడకారుడు సౌత్ వెస్ట్ షెన్ భాగారాజ్ 154కేజీల బరువులెత్తి బంగారుపతకాన్ని గెలుపొందారు.మనోన్మానియం సుందరంనార్ యూనివర్సిటీ క్రీడాకారుడు ఎం.గోపి సుదర్శన్ 143కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని సాధించారు.ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్రీడాకారుడు మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని పొందారు.73కేజీల విభాగంలో తిరువల్లూరు యూనివర్సిటీ క్రీడాకారుడు లోగేశ్వరన్ 159 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని పొందారు.అలాగే ఆంధ్రకేసరి యూనివర్సిటీ క్రీడాకారుడు ఎస్వీ మహేష్ 156కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని,తిరువల్లూరు యూనివర్సిటీ క్రీడాకారుడు ఏ.మనోబాల 156కేజీల బరువులెత్తి మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం పొందారు. 81కేజీల కేటగిరిలో మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారులు బి.రజత్‌రాయ్ 170కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని గెలుపొందారు.మనోన్ మానియం సుందరనార్ యూనివర్సిటీ క్రీడాకారుడు ఎన్ఎస్.అభిషేక్ వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. యోగి వేమన యూనివర్సిటీ క్రీడాకారుడు దేవరకొండ ప్రేమ్‌సాగర్ 163కేజీల బరువులెత్తి కాంస్య పతకాన్ని సాధించారు.


## తేళ్ల శ్రీహరమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట,డిసెంబర్1 ,ప్రభాతవార్త:** చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటి మాజీ చైర్మన్, చిలకలూరిపేట విద్యాసంఘాల అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు మాతృమూర్తి శ్రీహరమ్మ ఆదివారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తేళ్ల సుబ్బారావు స్వగృహానికి వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు,తేళ్ల సుబ్బారావును పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. తేళ్ల సుబ్బారావును పరామర్శించిన వారిలో బిజెపి నాయకుడు పొత్రు పూర్ణచంద్రరావు, సోమేపల్లి వెంకట సుబ్బయ్య, గ్రంధి ఆంజనేయులు, ఇమ్మడి జానకీపతి, లింగాల విజయ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



# గురజాడ ఒక వెలుగుజాడ

**గుంటూరు కల్చరల్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** కవిగా,రచయితగా,బోధకుడిగా,కార ్యనిర్వాహకుడిగా చరిత్ర పరిశోధకుడిగా,విద్యావేత్తగా విమర్శకుడిగా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన బహుముఖ ప్రజ్ఞాశాలి గురజాడ అప్పారావు అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.సంసధ కార్యాలయంలో అవగాహన ఆరోగ్యసభ బృందసభ్యుల ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి కార ్యక్రమం జరిగింది.సభలో తెలుగు పండితులు రాజన్న మాస్టారు మాట్లాడుతూ తన జీవితకాలంలో దార్శనికతతో కాలాన్ని ముందుకు నడిపిన ప్రతిభామూర్తి చరిత్రలో తనకంటూ ఒకసుస్థిరస్థానాన్ని సంపాదించుకోవడమే కాదు,తనతోనే నూతన చరిత్ర మొదలైందనిపించుకున్న అసమాన మేధావి గురజాడ అపాప్పరావు అన్నారు.అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక తెలుగు రచయితల్లో కెలా్ల గురజాడ అత్యధిక ప్రశంసనీయ,ఆదర్శ ప్రాయులన్నారు.కార్యక్రమంలో కవి జమదగ్ని,రచయిత్రి భాగ్యలక్ష్మి,సాహితీవేత్త ప్రసాదరావు,తదితరులు ప్రసంగించారు.



## గుండ్లపల్లిలో తెదేపాసభ్యత్వ నమోదు

**నకరికల్లు, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఆదివారం సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కరాలపాటి వలి, చింతపల్లి అహ్మద్, జైనుల్లా, ముని, షరీఫ్, వెంకట్రామయ్యలు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు గ్రామ చావిడి సెంటర్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. రూపాయి సభ్యత్వంతో ప్రారంభమై రూ.100లకు ఇది చేరిందన్నారు. సభ్యత్వం తీసుకోవడం సమాజంలో గౌరవాన్ని, గుర్తింపును తీసుకువస్తుందన్నారు. అన్ని కుటుంబాలకు అధికారాలను, పదవులను తెలుగుదేశం అందిస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుర్రిపాలెంలో పచ్చదనం ప్రాణహితం

**తెనాలి, డిసెంబర్ 1 (ప్రభాతవార్త) :** పచ్చదనం ప్రాణహితం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని తొలి అడుగుగా బుర్రిపాలెం గ్రామం నుంచి ప్రారంభిస్తున్నట్లు గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా అందమైన చెట్లు ఉండేలా మొక్కలు నాటుతూ పోతున్నామన్నారు. పార్లమెంట్ వ్యాప్తంగా చెట్లు నాటే కార్యక్రమంలో భాగంగా గురుపాలెం నుండి ఆదివారం తొలి అడుగు వేస్తున్నాం అన్నారు. తొలిదశలో భాగంగా 300చెట్లను ఆదివారం నాటు నాటుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో పార్లమెంటు పరిధిలో కొని వేల చెట్లను పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిసిఎల్ ప్రాజెక్టు తరపున రాజేంద్రప్రసాద్




ఈ కార్యక్రమానికి సహకరిస్తూ సంవత్సరానికి 50లక్షల రూపాయల చొప్పున ఐదేళ్లలో రెండున్నర కోట్లను అందించేందుకు హామీ ఇచ్చారన్నారు. ఒక్కో మొక్క ఎనిమిది 12అడుగుల ఎత్తులో ఉండేటట్లుగా ట్రీ కార్డులతో సహా సిసిఎల్ నిర్వాహకులు అందిస్తున్నారు అన్నారు. ఒక్కో గ్రామానికి అవసరాన్ని బట్టి 300నుంచి 400వరకు మొక్కలు అందిస్తుండగా ఒక్కో మొక్క కోసం 350నుంచి 400టీ కార్డు కోసం 600రూపాయలు కలిపి అందించబోతున్నామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా మొక్కల నిర్వహణ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది అన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారితో కలిసి ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామన్నారు. నాటుతున్న చెట్ల రకాలు గుల్మోహర్ సున్నపుతిస్పతోడియ జకరండా పేల్టో ఫారం తదితర రకాల మొక్కలను నాటుతున్నట్లుగా ఆయన తెలిపారు.

## జనగణనతో పాటు కులగణన చేయండి

### -బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

**తెనాలి, డిసెంబర్ 1 (ప్రభాతవార్త) :** కేంద్ర ప్రభుత్వం దేశంలో చేపట్టనున్న జనగణనతో పాటు సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని బృందావనం సమావేశపు హాల్లో బీసీ సంఘ నాయకుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కేసన



శంకరరావు మాట్లాడుతూ ఈనెల 5వ తేదిన ఇదే అంశంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా, 6న అఖిలపక్ష సమావేశం ఉంటాయన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో తలపెట్టిన ఓబీసీల ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పేదరిక నిర్మూలనకు, సామాజిక న్యాయ సాధనకు సమగ్ర కులగణన దోహదపడుతుందన్నారు. అన్ని పార్టీలు బీసీలను ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయని, కేసన విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ బీసీలకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. పాలకుల అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట మాట్లాడుతున్నారని, బీసీ నాయకులను పార్లమెంట్‌కి పంపినప్పటికీ ఉపయోగం లేదన్నారు. దేశంలో 54శాతం జనాభా ఉన్న ఓబీసీలో ఎందరో పేదలు ఉన్నారని, అందులో కొందరు అంటరానివారిగా, యాచకులుగా, అడవుల్లో జీవించే కొండ జాతులుగా, సంచార జీవనం సాగించే తెగలుగా ఉన్నారని, మరి కొందరు రజక, నాయీబ్రాహ్మణ వృత్తుల్లో ఉన్నారని పేర్కొన్నారు. మిగిలిన వారు కుమ్మరి, గీత నేత కార్మికులుగా జీవిస్తున్నారని తెలిపారు. బీసీల అభివృద్ధి సంక్షేమం కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కేసన శంకరరావు కోరారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు కొల్లూరు హనుమంతరావు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీను, వేముల కృష్ణ, ఓలేటి శివాజీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌ను తరిమికొట్టడమే అందరి లక్ష్యం

### -ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** ఎయిడ్స్‌ను తరిమికొట్టడమే అందరి లక్ష్యమని



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే 2024ను పురస్కరించుకొని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించాయి. ఎయిడ్స్ పై అవగాహన కొరకు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, ప్రైమ్ ... జిల్లా వైద్యాధికారి రవి, లెప్రసీ ఎయిడ్స్ అధికారి మురళీలు ప్రారంభించారు. హక్కుల మార్గాన్ని అనుసరించాలన్నారు. నా ఆరోగ్యం – నా హక్కు అనే నినాదాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రంగోలీ, వ్యాసరచన పోటీలలో బహుమతులను అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏపిటిసిస్ కౌన్సిలర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన పింఛన్లు, రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోండి : కొమ్మాలపాటి శ్రీధర్

**నరసరావుపేట టౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, రేషన్‌కార్డులు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డిసెంబర్ 2వతేదీ నుండి అవకాశం కల్పించారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను పెంచి 1వతేదీనే ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి పథకాలను ప్రజలకు అందించే పరిస్థితి లేదన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. నూతన సంవత్సరంలో కొత్త పెన్షన్లు అందజేస్తామని కొమ్మాలపాటి శ్రీధర్ తెలియజేశారు.



## మహంకాళి అమ్మవారి దేవాలయంలో మహాచండీ హోమం

**నరసరావుపేట టౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం మహాచండీ హోమం నిర్వహించారు. వివరాలను ఆలయ ఈవో నలబోతు మాధవి తెలియజేశారు. కార్తీకమాసంలో ఆదివారం అమావాస్య కావడంతో ప్రత్యేక కుంకుమార్చన, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. విశేష పుణ్యతిథి కావడంతో చండీహోమంలో పది మంది ఉభయదాతలు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఐదు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 1500 మందికి పైగా అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈవో మాధవి తెలియజేశారు.



## గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతిపత్రం

**నకరికల్లు, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** ఏపి మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్ఎంపి పిఎంపి సంఘం ఆదివారం తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. నరసరావు పేట డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న కోటప్పకొండలో రాష్ట్ర మహాసభ జరుగుతుందన్నారు. మహాసభకు హాజరు కావాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావును వారు కోరారు. అదే విధంగా తమకు చట్టపరమైన గుర్తింపును కల్పించాలన్నారు. మధ్యలోనే ఆగిపోయిన శిక్షణా తరగతులను తిరిగి ప్రారంభించాలన్నారు. తమకు న్యాయం జరిగేలా జరిగే పోరాటానికి సహకరించాలని నాయకులు షేక్.బాజీ, షేక్.సైదా, ఎ.నాగేశ్వరరావు, వెంకట్రావు, నాగరాజు లు కోరారు.



## జనసేన రాష్ట్ర నాయకులు నాగబాబుకు రాజ్యసభ సీటు ఇవ్వాలి

**నరసరావుపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుకు రాజ్యసభ సీటును కేటాయించాలని ఆ పార్టీ నాయకులు అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, కృష్ణంశెట్టి గోవిందు, యలమల కొండా లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడేందుకు నాగబాబు ఎంతో కృషి చేశారన్నారు. కష్టకాలంలో పార్టీని నిలబెట్టి కార్యకర్తలకు అండగా నిలిచారన్నారు. గత ఎన్నికల పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును ఆయన త్యాగం చేశారని గుర్తు చేశారు. అటువంటి నాయకుడు నాగబాబుకు ఖచ్చితంగా అవకాశం కల్పించాలని జనసేన నాయకులు అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, గోవిందు, కొండా కోరారు.

## కాశీ విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

**నకరికల్లు, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసియున్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీకమాస ముగింపు పూజలు జరిగాయి. 52వ లక్షబిల్వార్చన కార్యక్రమాలను నిర్వహించారు. 125 కిలోల అన్నాభిషేకాన్ని, లక్ష కుంకుమార్చనను స్వామివారికి నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఆవరణలోని కోనేరులో హంస వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులకు తెప్పోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తెప్పోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



## డిసెంబర్ 8 వరకు అమేజాన్‌ఫ్రెష్ సూపర్ వాల్యూడేస్

**విజయవాడ, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** నవంబర్ 30 నుండి డిసెంబర్ 8 వరకు సూపర్ వాల్యూడేస్‌ను అందిస్తున్నట్లు అమేజాన్ ఫ్రెష్ ప్రతినిధులు ప్రకటించారు. చలికాలంలో వెచ్చని ఆహారం, నిత్యావసరాలు, పండ్లు, కూరగాయలు, స్నాక్ ్స, పానీయాలు తదితరలపై 50శాతం వరకు రాయితీనిస్తామన్నారు. మీరు కోరిన సమయంలో మీ ఇంటివద్దకు డోర్‌స్టెప్ డెలివరీ ద్వారా తెప్పించుకునేలా ఆశీర్వాద్, వేదక, టాటాసంపన్న, పార్లె నివియా, హిమాలయ, న్యూట్రోజినా, డోవ్ లను ఎక్స్‌ప్లోర్ చేసి మీ ప్యాంట్రీని స్టాక్‌చేసి పెట్టుకోవాలన్నారు.

## ల్యాప్రోస్కోపిక్ లైవ్ సర్జరీల సదస్సు

**నరసరావుపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** వైద్యరంగంలో వచ్చినటువంటి ల్యాప్రోస్కోపిక్ విధానంపై ఆదివారం మాతాశ్రీ హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన లైవ్ సర్జరీల ప్రోగ్రాంను తొలుత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ల్యాప్రో స్కోపిక్ విధానం సులభమైందని, రోగులకు శస్త్ర చికిత్సలో ఎటువంటి తీవ్రమైన నొప్పి ఉండదని ఛైర్మన్ డాక్టర్ రామచంద్రారెడ్డి తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యక్షంగా పది మందికి పైగా రోగులకు సీనియర్ సర్జన్‌లు శస్త్ర చికిత్సలను ల్యాప్రోస్కోపిక్ విధానంలో నిర్వహించి సెమినార్‌కు హాజరైన వైద్యుల సందేహాలకు సమాధానాలిచ్చారు. వైద్య విభాగంలో ఎప్పటికప్పుడు వచ్చే అధునాతనమైన ల్యాప్రోస్కోపిక్ వంటి పద్ధతులను రోగులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మెరుగైన వైద్యాన్ని అందించగల్గుతామని మాతాశ్రీ హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ రామచంద్రారెడ్డి తెలియజేశారు. సెమినార్‌లో సీనియర్ వైద్యులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ ఏపివి రామలింగారెడ్డి, కారసాని శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జి.శ్రీనివాసరావు, డాక్టర్ కట్టా రమేష్, డాక్టర్ వసంతరాయ, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

## దుగ్గిరాలలో వైకాపా నాయకుల,కార్యకర్తల ఆత్మీయ సమావేశం

తాడేపల్లి,డిసెంబర్ 1,ప్రభాతవార్త : దుగ్గిరాల మండల వైసీపీ నాయకుల,కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం మంగళగిరిలోని ఆత్మకూరు జాతీయ రహదారి నందుగల నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో దుగ్గిరాల మండలం మాజీ కన్వీనర్ శృంగారపాటి రత్నం అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది.ఈ





సమావేశంలో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పాల్గొన్నారు. ప్రతి కార్యకర్తకి నేను వెన్నంట ఉంటా పార్టీకోసం కష్టపడే ప్రతి వ్యక్తికి తోడుగా ఉంటాను.ఇప్పటికి చాలాసార్లు చంద్రబాబు మాటలకు ప్రజలందరూ మోసపోయారు. చంద్రబాబు చూపులు ఎప్పుడు కార్పొరేట్ సంస్థలపైనే డబ్బున్న వ్యక్తులపైనే తప్ప సామాన్య ప్రజలపైన ఆయన చూపు ఉండదు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజల అభివృద్ధికి బాట వేసింది.జగన్మోహనరెడ్డి మరో రెండు అడుగులు వేసి పేద ప్రజల కోసం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టారు.అలాంటి వ్యక్తి ఈరోజు ప్రజలకు అండగా లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ కూటమి ప్రభుత్వం వల్ల ఆర్థికంగా పేద ప్రజలు అభివృద్ధి చెందలేరు మన పిల్లలు పై చదువులకు వెళ్ళలేరు.జగన్ అనే వ్యక్తి ఓడిపోవడం వలన బాధపడేది బాధపడుతుంది పేద ప్రజలు అన్ని రాష్ట్రాల్లో ఈవిఎం ఎలక్షన్స్ పై అభ్యంతరాలు వస్తున్నాయి,మళ్ళీ జగన్మోహన రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే బడుగు,బలహీన వర్గ ప్రజల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మహారాష్ట్రలో జరిగిన ఎలక్షన్లు ఈవిఎంలో పార్టీ ఓట్లు లేవు అని కాంగ్రెస్ ప్రధాన ఆరోపణ చేస్తుంది. మహారాష్ట్రలోనే అలా జరిగితే ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంకా ఎలా జరిగాయో అర్థమవుతుంది. ఈవిఎం అప్‌డేట్ అయి ఎలక్షన్స్ జరిగితే మరల అధికారపక్షం గెలుస్తుంది తప్ప ప్రతిపక్షం గెలవదు.ఎలక్షన్స్ ఎలక్ట్రిక్ పద్ధతులు జరిగితే ప్రజాస్వామ్యంలో ప్రజలు మోసపోతారు. ఈవిఎం ఎలక్షన్స్ ను అన్ని రాష్ట్రాల్లో అభ్యంతరం చెబుతున్నారు. జగన్మోహన రెడ్డి బడుగు,బలహీన వర్గాల ప్రజల కోసం ఎంతగానో కృషిచేశారు.కానీ ఈవిఎం ఎలక్షన్స్ వల్ల పూర్తిగా ప్రజలు మోసపోయారు. దుగ్గిరాల మండలం ఆనాటి నుండి ఈనాటి వరకు వైసీపిదే. .కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీలు, ఎంపిటీసీలు, మాజీ వార్డు మెంబర్స్,మాజీ సర్పంచులు,ఉప సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'చాపకూడు కార్యక్రమానికి ప్రముఖులు రాక

**కారంపూడి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** సమసమాజ స్థాపన కోసం ఆనాడే బ్రహ్మనాయుడు చాపూడు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. వీరారాధనోత్సవాల్లో మూడోరోజు సోమవారం వీర్ల దేవాలయం సమీపంలోని చాపకూడు కార్యక్రమానికి పలువురు ప్రముఖులు రానున్నట్లు జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, బీసీ సెల్ నియోజకవర్గనేత గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు తుపాకుల చినరత్తయ్యలు ఆదివారం తెలిపారు. రాష్ట్ర మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, తెదేపా పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, బాపట్లశాసనసభ్యులు వేగేసన నాగంద్రవర్మ, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, తాటికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. చాపకూడి కార్యక్రమం, రాష్ట్రస్థాయి ఎడ్లపందేల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. పల్నాడు ప్రాంతంలోని ప్రజలు, రైతులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.



## రామలింగేశ్వర స్వామి దేవాలయంలోకానుకల లెక్కింపు

**నందిగామ డిసెంబర్ 1 ప్రభాతవార్త:** నందిగామ పట్టణం రామలింగేశ్వర స్వామి దేవాలయంలో డిసెంబర్ రెండో తేదీన హుండీ కానుకల లెక్కింపు, అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గంగాధర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు హుండీ లెక్కింపు, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరల వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో గంగాధర్ తెలియజేసే ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని కోరారు.

## కార్తీక మాసం ముగింపు సందర్భంగా అమ్మవారికి చీరెలు సమర్పించిన సుధాస్వామి

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్త:** ఆదివారం కార్తీకమాసం ముగింపు కావడంతో లెనిన్ సెంటర్ లోని ఓం శ్రీ షిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో భక్తులు లక్షలాది పూలతో అమ్మవారిని అలంకరించి పూలాభిషేకాన్ని నిర్వహించారు.ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పసుపు,కుంకుమ, గాజులు,చీరెలను అమ్మవారికి భక్తులివ్వగా మందిర వ్యవస్థాక అధ్యక్షులు సుధాస్వామి సమర్పించారు. అనంతరం మందిర పై భాగం లోని మహా శివలింగానికి అభిషేకాన్ని నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ నుండి మార్గశిర మాసం ప్రారంభమవుతోందని,ఆ మాసంలో నెల రోజుల పాటు మందిరంలో ప్రతి రోజు ప్రత్యేక పూజాదికాలను నిర్వహిస్తామని సుధాస్వామి తెలిపారు. భగవద్గీతలో చెప్పినట్లుగా మాసాలోకెల్లా మార్గశిర మాసం అత్యంత ఉత్తమమైందని, ఆధ్యాత్మిక వెల్లివిరిసే మార్గశిర మాసంలో అనేక పండుగలున్నాయని ఆయన భక్తులకు వివరించారు. అనంతరం ఆయన తన చేతుల మీదుగా భక్తులకు అన్నప్రసాద వితరణను గావించారు.



## కంచికచర్ల గ్రామంలో ఐఎఫ్‌టియు కార్యాలయం ప్రారంభం

**కంచికచర్ల డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ కంచికచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో కంచికచర్ల గ్రామంలో ఐఎఫ్‌టియు కార్యాలయం ప్రారంభోత్సవం జరిగినది. ఐఎఫ్‌టియు కంచికచర్ల మండల కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఐఎఫ్‌టియు జెండాని ఎగరవేయడం జరిగింది. బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల కుమారు బిసిడబ్ల్యూయు జెండాని ఎగరవేయడం జరిగింది. అనంతరం ఐఎఫ్‌టియు మండల కార్యాలయాన్ని బిసిడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరికృష్ణారెడ్డి కంచికచర్ల వీరులపాడు మండల నాయకులు లక్కిశెట్టిఆంజనేయులు కంభంపాటి శీను గంగి శెట్టి సాంబశివరావు మర్రి పుడి చిన్నా షేక్ ఖాజాఫీరా తిరుమల శెట్టి సత్యనారాయణ అందరూ కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు లక్కీ శెట్టి ఆంజనేయులు బండారు శీను బడేటి దాసు కంభంపాటి శ్రీను కంగిశెట్టి బుజ్జి కడియాల సత్యనారాయణ షేక్ బాజీమేడి శివ కేసర గండేపల్లి పెండ్యాల వేములపల్లి గ్రామ కమిటీ అధ్యక్ష ఉధ్యక్షులు కాకుమాను రామారావు జీనేపల్లి స్వామి శేషాచారి విజయలక్ష్మి పులి స్వాతి . వీరులపాడు మండల నాయకులు షేక్ ఖాజా పేరా అల్లూరు నుండి తిరుమల శెట్టి సత్యనారాయణ పెద్దాపురం నుండి అశోక్ పల్లంపల్లి నుండి నంద్రు రమేష్ వెల్లంకి నుండి శ్రీనివాస్ రెడ్డి తాటిగుమ్మినుండి జిల్లా ఉపాధ్యక్షులు విజయరావు జమ్మారం బోమ్మారం బోడాడ గోకరాజుపల్లి పసుపులేటి ఆనందు ఎర్ర అబ్బాయి కంచికచర్ల మండల నాయకులు బల్గారి సాంబశివరావు మర్రిపూడి చిన్న ఒంటి పులి రాజు కొమ్మనబోయిన ముత్తయ్య సయ్యద్ గాలిసా ఉప్పు నరసింహారావు మహేష్ మరియు కంచికచర్ల మండల భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిభిరానికి విశేష స్పందన

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలంలోని రుద్రవరం గ్రామంలో నందిగామకు చెందిన సంజీవిని హాస్పిటల్ వైద్యురాలు . డాక్టర్ బొగ్గవరపు దివ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. చిన్ననాటి నుండి ఉన్నత విద్య చదవాలనే లక్ష్యంతో డాక్టరేట్ చదువుకొని తాను జన్మించిన స్థలములోనే ఆసుపత్రి నిర్మాణం చేసి ఈ ప్రాంత రోగులకు సేవ చేయాలన్న సంకల్పంతో నిర్మించినదే సంజీవని హాస్పటల్. తన లక్ష్యసాధనలో వారి మాతృమూర్తుల శ్రమ ఎంతో ఉన్నది. దివ్య అంచలంచెలుగా ఉన్నత స్థాయి ఎదగాలని, వారి వైద్య వృత్తి మరెన్నో శిఖరాలను చేరుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ శిబిరంలో 125 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి వైద్య సహాయం అందించారు. వివిధ రకాల క్రానికల్ కేసులను పరీక్షించి ఉచిత వైద్య సహాయం అందించడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో గ్రామ పెద్దలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు క్రైమ్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** పశ్చిమ నియోజకవర్గంలోని 33వ డివిజన్ దేవాపురం 5వ లైను,34వ డివిజన్ ఫాతిమాపురం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే గళ్ళా మాధవి వృద్ధులు, వితంతువులు,విభిన్న ప్రతిభా వంతులకు పెన్షన్లను ఇంటి ఇంటికి వెళ్ళి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత సామాజిక పింఛన్లు ప్రతి నెలా 1వ తేదిన ఇంటి ఇంటికి వెళ్ళి పంపిణీచేస్తున్నా మని,1వ తేది ఆదివారం శెలవు దినం కావడంతో ఒకరోజు ముందే పెన్షన్లు పంపిణీచేస్తు న్నామన్నారు.ఇది ప్రజల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నా రు.ఆపన్నులకు సహాయం అందించడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని,వివిధ రూపాల్లో ప్రజలను ఆదుకుంటున్నామని,ఒకరోజు ముందుగానే పెన్షన్లు అందటంతో ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.



## ఆక్రమణల తొలగింపుకు ప్రజలు,వ్యాపారవర్గాలు సహకరించాలి : ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు క్రైమ్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** స్థానిక 33,34డివిజన్‌లోని ఫాతిమాపురం,దేవాపురంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దేవాపురంలో ప్రధానంగా ఆక్రమణల కారణంగా డ్రైనేజీ వ్యవస్థ కుచించుకు పోయిందని ఎమ్మెల్యే మాధవి గుర్తించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు కల్వర్టులు కృంగి,పగుళ్ళు ఏర్పడి ప్రమాదకరంగా తయారు అయ్యాయని,ఈ డ్రైనేజీ లైన్‌లోనే కేబుల్ ్స పైప్‌లైన్లు వెళ్ళటం వలన నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయని గుర్తించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి,వాటిని తొలగించేసి ఒక సరైన మార్గంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆక్రమణల వలన వరద నీరు దేవాపురంను ముంచెత్తుతుంది కనుక పీకలవాగు డైవర్షన్,ఆక్రమణల తొలగింపు మీద దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆదేశించారు,.దీనివలన భవిష్యత్తులో దేవాపుంర వంటి ప్రాంతాలకు వరద ముప్పు ఉండదని,ఈ ఆక్రమణల తొలగింపుకు ప్రజలు,వ్యాపారస్తులు సహకరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఈరంటి వరప్రసాద్,పోపూరి నరేంద్ర,దగ్గు కిరణ్,చిన్న బాజీ,పఠాన్ ఆస్మ,ఉప్పుటూరి పేరయ్య,కొణికి వినోద్,మన్నయ్య, అన్వర్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చీమలపాడు గ్రామంలో సినీహీరో విజయ్‌బాబు సందడి

**ఎ కొండూరు, డిశంబరు 1, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం కేశా గ్యామా తండా గిరిజన (లంబాడా) తండా గ్రామ పంచాయతీలో ఒక సామాన్య గిరిజన మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన జరబల విజయబాబు డిగ్రీవరకు చదివి సినిమాలపై మోజుతో హైదరాబాద్ చెన్నయ్ ముంబాయి తదితర పట్టణాల్లో తిరిగి దర్శక నిర్మాతల పిలుపుతో హైదరబాద్‌లో దర్శక నిర్మాతల వద్దకు చేరుకుని అక్కడ సినీ పరిశ్రమ ద్వారా కాలామా ఈ కన్నీళ్ళెందుకే అనే సినిమాలో హీరోగా నటించి సినీ ఇండస్ట్రీకి పరిచయమయిన విజయ్‌బాబు మొదటి సారిగా తాను హీరోగా నటించిన కాలమా ఈ కన్నీళ్ళెందుకే సినిమా ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలోని శ్రీలక్ష్మి థియేటర్‌లో ప్రదర్శించడంతో హీో విజయబాబుతో సహా అనేక మంది తన అభిమానులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అనేక మంది గిరిజన (లంబాడా) తండాలకు చెందిన సినీ ప్రేక్షకులు ఈ సినిమాను వెండి తెరపై వీక్షించారు. ఈ సినిమాలో హీరో విజయబాబు మొదటిసారి హీరోగా పరిచయమైన తన నటనా చాతుర్యంతో అనేక మంది సినీ ప్రేక్షకుల మనసులను దోచుకున్నాడని మాజీ ఎంపిపి'లు జరబల దీప్లా నాయక్, భూక్యా గనియా నాయక్, కేశా తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ జరబల జమలమ్మ, పెద్దబాబు, వైసిపి రాష్ట్ర నాయకుడు నరెడ్ల వీరారెడ్డి, తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీలకు చెందిన రాజకీయ నేతలు భావిస్తున్నారు. ఈ సినిమా గత వారం రోజులుగా ఎ కొండూరు మండలంలో ప్రదర్శిస్తుండడంతో గత వారం రోజుల నుండి ప్రేక్షకుల ఆదరణ బాగా ఉంది. ఈ సినిమా ఈ లక్ష్మి థియేటర్‌లో మొదటిరోజు ప్రదర్శించగా హీరో విజయబాబు సర్పంచ్‌లు మోర్ల లక్ష్మి సాంబశివరావు, జరబల జమలమ్మ పెద్దబాబు, జడ్పీటిసి మెంబర్ బి గనియా తదితరులు సినీ హీరో విజయబాబు రిలీజ్ సందర్భంగా భారీ ఎత్తున టపాసులతో బాణాసంచా పేలుస్తూ ప్రేక్షకులు వివిధ రాజకీయ పార్టీ నాయకుల మధ్య హీరో విజయబాబు సందడి చేస్తూ భారీ ఎత్తు ప్రేక్షకుల మధ్య కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సినీ హీరో విజయబాబు స్థానికంగా ఉన్న ఎఎంటికె దర్బార్‌కు వెళ్లి అతావుల్లా బాబా ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా ముహమ్మద్ ఖాజా మొహినుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబాను, తాజ్ ఖాదరీ బాబాను కలిసి వారి దీవెనలు పొందారు. సినీ పరిశ్రమలో బాగా రాణించి అభివృద్ధి చెందాలని తద్వారా రాష్ట్రానికి ఎన్‌టిఆర్ జిల్లాకు ఎ కొండూరు వెనుకబడిన గిరిజన మెట్ట మండలానికి తాను పుట్టిన గ్యామా తండా గడ్డకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని పీఠాధిపతి ఆశీర్వదించారు. ఇంకా మూడు సినిమాల్లో నటిస్తున్నానని త్వరలో గోవా సినిమా షూటింగ్ పాల్గొనేందుకు గోవా వెళ్లనున్నట్లు హీరో విజయబాబు ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా హీరో విజయబాబును సీనియర్ సిటీజన్లు కవులు, రచయితలు, పలువురు జర్నలిస్టులు అభినందించారు.



2-12Pg5exN.qxd:2-12Pg5exN.qxd 01/01/01 7:11 AM Page 1



# అక్రమ వలసదారులకు అమెరికాలో విడిది!

## బైడెన్ పాలనపై వివేక్ రామస్వామి ధ్వజం




**వాషింగ్టన్, డిసెంబరు 1:** అక్రమ వలసదారులకు వసతి కల్పించేందుకు న్యూయార్క్‌లోని పాకిస్తాన్ ప్రభుత్వ హోటల్‌కు 1860.40 కోట్లను చెల్లించడాన్ని రిపబ్లికన్ పార్టీ నాయకుడు వివేక్‌రామస్వామి ఆక్షేపణ వ్యక్తం చేసారు. అక్రమ వలసదారులకోసం పన్నుచెల్లింపుదారుల నిధులతో విడిది ఏర్పాట్లుచేయడాన్ని ప్రశ్నించారు. అమెరికాలో వారికి ఆశ్రయం కల్పించడానికి న్యూయార్క్ నగరపాలక సంస్థ పాక్‌ప్రభుత్వానికి చెందిన రూజ్‌వెల్ట్ హోటల్‌కు సొమ్ముచెల్లిస్తోందని వార్తలు రావడంపై ఆయన స్పందించారు. ఇటీవల అమెరికాకు చెందిన రచయిత జాన్ లెఫెవ్రే సోషల్‌మీడియాలో అనేక విమర్శలు చేసారు. మన్హట్టన్‌లోని రూజ్‌వెల్ట్ హోటల్ ప్రస్తుతం పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం అధీనంలో ఉందని, అందులో అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించడానికి న్యూయార్క్ నగరం పాకిస్తాన్‌ప్రభుత్వానికి 220 మిలియన్ డాలర్లు చెల్లిస్తోందని పాక్ దివాలా తీయకుండా ఐఎంఎఫ్‌తో చేసుకున్న 1.1 బిలియన్ డాలర్ల డీల్‌లో భాగంగానే ఈ హోటల్‌ను ఎంచుకున్నారని వివేక్ ఆరోపించారు. ఈ స్టేట్ డీల్‌కు ముందు 2020 నుంచి ఈ స్టార్ హోటల్ సరైన బుకింగ్‌లేక మూతపడిందని అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ పేరుతో ఉన్న ఈ 19 అంతస్తుల భవనం ప్రస్తుతం ఈ వ్యవహారానికి కేంద్రంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తంచేసారు. మొత్తం 1200 గదులున్నాయన్నారు. ఈ పోస్టుకు వివేక్ స్పందిస్తూ అక్రమ వలసదారులకు పన్ను చెల్లింపుదారులే పాక్ ప్రభుత్వహోటల్ విడిదిని ఏర్పాటు చేసారని అంటే నగర పన్నుచెల్లింపుదారులే మన దేశంలో వారు ఉండేందుకు డబ్బులు చెల్లిస్తున్నారని ఇదిమరీ విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన అనంతరం టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామిలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) సంయుక్త సారథులుగా నియమించారు. ఏటా ప్రభుత్వం ఖర్చుచేస్తున్న 6.5 ట్రిలియన్ డాలర్లలో దుబారా, అవినీతిని అరికట్టడానికి ఫెడరల్ సంస్థలను పునర్వ్యవస్థీకరించడానికి వీరిద్దరూ కృషి చేస్తారని ట్రంప్ ప్రకటించారు. వీరు వలంటీర్లుగా ప్రభుత్వానికి సహకరిస్తూ ప్రభుత్వం తరపున పోరాట వీరులుగా ఉంటారని ట్రంప్ తాను గెలిచిన వెనువెంటనే ప్రకటించడం గమనార్హం.

# ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్

## కాష్ పేరు ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్‌డీసీ, డిసెంబరు 1:** అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్‌ట్రంప్ తన ప్రభుత్వ యంత్రాంగాన్ని సన్నద్ధంచేసుకుంటున్నారు. పలువురు భారత సంతతికి చెందిన ప్రముఖులకు కీలక పదవులు కూడా కేటాయిస్తున్నారు. ప్రముఖ న్యాయవాది కశ్యప్ పటేల్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్‌గా ఆయన్ను నియమించనున్నట్లు ఆదివారం ప్రకటించారు. కాష్ గొప్ప న్యాయవాది అని పరిశోధకుడని అమెరికాలో అవినీతి నిర్మూలనకు న్యాయాన్ని గెలిపించేందుకే నిరంతరం శ్రమిస్తున్నారని అమెరికా ప్రజలకు అండగా నిలిచారని ఆయన నియామకంతో ఎఫ్‌బిఐకి పూర్వవైభవం తీసుకొస్తామని ట్రంప్ అన్నారు. ట్రంప్‌కు వీరవిధేయుడిగా కశ్యప్‌కు పేరుంది. కశ్యప్ కుటుంబ మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. ఆతడి తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. ఆతడి తండ్రి ఉగాండలో నియంత ఇడీ అమీన్ బెదిరింపుల కారణంగా అమెరికాకు వలసవచ్చారు. న్యూయార్క్‌లోని గార్డెన్‌సిటీలో 1980లో కశ్యప్ పుట్టాడు. యూనివర్సిటీ ఆఫ్ రిచ్‌మండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తిచేసాడు. ఆ తర్వాత ఒక లా సంస్థలో పనిచేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీనితో ఆతడు మియామీ కోర్టుల్లో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి అనేక హోదాల్లో న్యాయవ్యవస్థల్లో సేవలందించారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరి పోటీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** దేశరాజధాని ఢిల్లీకేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీకి వచ్చేఏడాదిజరిగే ఎన్నికల్లో ఏపార్టీతోను పొత్తులు పెట్టుకోమని ఆప్ ఒంటరిగానే పోటీచేస్తుందని ఇండియా కూటమితో పొత్తుకు తాము సిద్ధంగా లేమని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్‌కేజ్రీవాల్‌ప్రకటించారు. ఢిల్లీ అసెంబ్లీఎన్నికల్లో ఆప్ పొత్తులకు దూరంగానే ఉండాలని భావించిందని, ఒంటరి పోరుకే తాము ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆప్ అధినేత చేసిన ప్రకటనతో ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలోకూడా పంజాబ్‌లో కాంగ్రెస్‌తో పొత్తుకు ఆప్ నిరాకరించిన సంగతి తెలిసిందే. 13 స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగింది. ఇపుడు ఢిల్లీ ఎన్నికల్లో పొత్తులేకుండాచేస్తామని కాంగ్రెస్ కూడా ఇప్పటికే ప్రకటించింది. ఈ క్రమంలోనే ఆప్ కూడా ఒంటరిపోరుకు సిద్ధం అంటూ తాజాగా తెలిపింది. దక్షిణ ఢిల్లీలోని మాలవీయనగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కేజ్రీవాల్‌పై ఒక వ్యక్తి దాడికిపాల్పడిన ఘటన సంచలనం రేపినసంగతి తెలిసిందే. మెరుపువేగంతో స్పందించిన భద్రతా సిబ్బంది ఆతడిని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ దాడిపై కేజ్రీవాల్ కూడా స్పందించారు.

అసలు నేను చేసిన తప్పేమిటి? ఢిల్లీ శాంతి భద్రతల అంశాన్ని లేవనెత్తాను. కేంద్ర మంత్రి అమిత్‌షా ఈ విషయంలో చర్యలు తీసుకుంటారని ఆశించాను కానీ దానికి బదులు పాదయాత్రలో నాపైనే దాడి జరిగింది. ఒకవ్యక్తి నాపై ద్రావకం విసిరాడు.

త అది ప్రమాదకరం కాదు కానీ అది హానికరం కావొచ్చు. మేం ప్రజాసమస్యలను లేవనెత్తామని మీకు తీలైతే గ్యాంగ్ స్టర్లను అరెస్టు చేయించాలని మమ్మల్ని టార్గెట్ చేసుకోవడం మంచిది కాదని హితవుపలికారు.

# బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీ తెస్తే 100శాతం సుంకాలు వేస్తాం: ట్రంప్

**వాషింగ్టన్, డిసెంబరు 1:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్‌ట్రంప్ మరికొన్ని రోజుల్లో అధికారాన్ని చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా బ్రిక్స్‌దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందిస్తే వాటిపై 100శాతం వరకూ సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. బ్రిక్స్ సదస్సుల్లో ఉమ్మడి కరెన్సీపై దృష్టిపెట్టాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ పిలుపుపైట్రంప్ స్పందించి సుంకాలను విధిస్తామని హెచ్చరికలు చేసారు. బ్రిక్స్ సభ్యదేశాలు అమెరికా డాలర్‌కు దూరంగా ఉండాలని ప్రయత్నిస్తున్నాయని, బ్రిక్స్‌దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందించ



కూడదని, శక్తివంతమైన అమెరికా డాలర్‌కు బదులు మరో కరెన్సీని తీసుకురాకూడదని, అలాచేస్తే ఆయా దేశాల దిగుమతులపై 100శాతం సుంకం వేస్తామని, దీనితోపాటు ఆదేశాలు అమెరికాతో ఉన్న వాణిజ్యబంధం కూడా వదులుకోవాల్సి వస్తుందని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియా ఖాతాలో హెచ్చరించారు. అక్టోబరులో రష్యాలోని కజాన్ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగింది. ఈ నేపథ్యంలోనే బ్రిక్స్‌దేశాలు ఉమ్మడిగా కరెన్సీ రూపొందించడంపై దృష్టిసారించాలని రష్యాఅధ్యక్షుడు పుతిన్ విజ్ఞప్తి చేసారు. బ్రిక్స్ పదిదేశాలకు ఉమ్మడి కరెన్సీని తీసుకువచ్చేందుకు సమయం ఇంకా ఆసన్నం కాలేదు. దానిపై నెమ్మదిగా అడుగులు వేస్తాం లేదంటే ఐరోపా సమాఖ్యకు ఎదురైన సమస్యలకంటే పెద్దవి ఎదురవుతాయన్నారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పనిచేస్తోందని పుతిన్ చెప్పారు. సభ్యదేశాలు కొత్త ఆర్థిక సాధనాలను వినియోగించాలని, సాధ్యాసాధ్యాలను ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నట్లు కూడా పుతిన్ చెప్పారు. సెంట్రల్ బ్యాంకులతో ఆ దేశాలకు సన్నిహిత సంబంధాలు రావాలని, డాలరు వాడడం సరైనదేనా అనే ఆలోచనలో యావత్ ప్రపంచం ఉందని, అందుకే చెల్లింపుల్లో, రిజర్వుల్లో దాని పరిమాణం తగ్గుతోందని, అమెరికా మిత్రదేశాలు కూడా డాలర్ నిల్వలను తగ్గించుకుంటున్నాయని పుతిన్ ఈ సదస్సులో ప్రకటించి సంచలనం సృష్టించారు.

# ప్రజావ్యతిరేక శక్తులను తరిమికొడదాం

## వయనాడ్ సభల్లో ప్రియాంక గాంధీ



**వయనాడు, డిసెంబరు 1:** కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వయనాడ్‌లోని మనంతవాడిలోజరిగిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు ఉన్న హక్కులన్నింటినీ నిర్వీర్యంచేసేందుకు ప్రయత్నించే శక్తులపై తాము ఎంతోకాలంగాపోరాటంచేస్తుంటే ప్రధాని నరేంద్రమోడీ మాత్రం ప్రజలగురించి కాకుండా తమ స్నేహితుల అభివృద్ధికి కృషిచేస్తున్నారని ఆరోపించారు. వయనాడులో వరదలు సృష్టించిన విలయంలోప్రజలు తీవ్రంగా నష్టపోయినా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సాయం అందించడంలేదని మండిపడ్డారు. వయనాడు ఎంపిగా అక్కడిప్రజల అవసరాలు హక్కులకోసం పార్లమెంట్‌లో తన గొంతుకను వినిపిస్తానని వారికోసం శక్తివంచనలేకుండా పనిచేస్తానని అన్నారు. మనదేశంలో ఉన్న వ్యవస్థలను బలహీనంచేయడానికి ప్రయత్నిస్తున్న వారికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ఏజెన్సీలను ఎన్డీయే ప్రభుత్వం పావులుగా వాడుకుంటూ ప్రతిపక్షాలను భయపెడుతోందని ధ్వజమెత్తారు. రెండురోజుల కేరళ పర్యటనలో ప్రియాంక రాహుల్‌గాంధీతోకలిసి ముందురోజు లోక్‌సభ సెగ్మెంట్‌పరిధిలోని తిరువంబాడి ముక్కం, నికంబూర్‌లోని కౌలై, వందూరు, కొయ్‌కోడ్ మలప్పురం జిల్లాల్లోని బహిరంగసభల్లో పాల్గొన్నారు. ఆదివారం మనంతవాడిప్రాంత ప్రజలను కలిసి వారి బాగోగులు తెలుసుకున్నారు. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో ఎంపిగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రంచేసిన ప్రియాంక తొలి అడుగులోనే వయనాడు స్థానంనుంచి భారీ విజయం నమోదు చేసారు. ఈ ఉప ఎన్నికలో తమ ప్రత్యర్థిపై 4.11 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ ఏడాదిజరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన సోదరుడు రాహుల్ గాంధీకి ఇక్కడ కేవలం 3.64 లక్షలమెజార్టీ వస్తే ప్రియాంక ఆమెజార్టీని కూడా దాటేసి రికార్డు సృష్టించారు.

# గాలిలోనే చక్కర్లు కొట్టిన ఇండిగో విమానం



**చెన్నై, డిసెంబరు 1:** బంగాళా ఖాతంలో సంభవించిన పెనుతుపాను ప్రభావంతో తమిళనాట భారీ వర్షాలు కురుస్తున్నాయి. చాలాప్రాంతాల్లో వరదనీరు అలాగే నిలిచిపోయింది. చెన్నై విమానాశ్రయంలో కూడా నీరుచేరింది. రన్‌వేలు నీటిలో ఉండటంతో విమానాలు దిగేందుకు ఎగిరేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. వర్షాల ఉధృతి పెరగడంతోకొన్ని గంటలు విమానాశ్రయాన్నే మూసేయాల్సి వచ్చింది. కాగా చెన్నై విమానాశ్రయంలో ఒక విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఎయిర్‌బస్ విమానం ల్యాండింగ్ అయ్యేందుకు ప్రయత్నించగా ప్రతికూల వాతావరణపరిస్థితులకు పట్టుకోల్పోయింది. దాంతో తిరిగి గాల్లోకి మళ్లీ ఎగిరింది. భారీ వర్షాల కారణంగా పుదుచ్చేరిలో పర్యాటక ప్రాంతాలన్నింటినీ మూసివేసారు. వాతావరణపరిస్థితులు మెరుగుపడిన తర్వాత ఇండిగో ఎయిర్‌లైన్స్ ఆదివారం ఉదయం నుంచి తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యే పరిస్థితులు కనిపించకపోవడంతో గాలిలోనే ఇండిగో చక్కర్లు కొట్టింది.

# ఇవిఎం ట్యాంపరింగ్ చేస్తానన్న వ్యక్తిపై కేసు



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** ఈవీఎంలను హ్యాక్ చేయగలనని పేర్కొన్న ఒక వ్యక్తిపై ముంబయిలో పోలీస్ కేసునమోదు అయింది. మెషిన్ ఫ్రీక్వెన్సీలను వేరుచేయడంద్వారా ఈవీఎంలను ట్యాంపరింగ్‌చేయగలనంటూ సోషల్‌మీడియాలో ఆతడు చెప్పడాన్ని ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. అవి తప్పుడు నిరాధారమైన వాదనలని స్పష్టం చేసింది. ఎలక్ట్రానిక్‌ఓటింగ్ మెషిన్‌ను హ్యాక్‌చేయడంతోపాటు ట్యాంపరింగ్ చేయగలనంటూ ఒక వ్యక్తిచెపుతున్న విడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈవీఎంల హ్యాకింగ్‌గురించి చెప్పినట్లు తెలుస్తోంది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల సంఘం ఆతడిని సయ్యద్‌షుజాగా గుర్తించింది. ఆతడిపై మహారాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబయి పోలీసులు గతనెల 30న కేసునమోదుచేసారు. ఈవీఎంలపై తప్పుడు వాదనలుచేస్తున్న ఈ వ్యక్తిపై ముంబయి సైబర్ పోలీసులు కేసు నమోదుచేసారు. 2019లో కూడా ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఈతడిపై ఢిల్లీలో కేసు నమోదయింది. ప్రస్తుతం ఇతను ఇతర దేశంలో ఉన్నట్లు ఈసీ తెలిపింది. ఈవీఎం అనేది స్వతంత్ర వ్యవస్థ కలిగిన మెషిన్ అని వైఫై లేదా బ్లూటూత్ వంటి వాటితో దీనినిఅనుసంధానం చేయలేమని వెల్లడించింది ఈవీఎం ట్యాంపరింగ్ అనేది అసాధ్యమని ఎన్నికల సంఘం తేటతెల్లం చేసింది.

# అక్రమ చొరబాట్లలో భారతీయులే అధికం

**వాషింగ్టన్, డిసెంబరు 1:** కెనడా సరిహద్దుల్లోంచి అక్రమంగా అమెరికాలోనికి చొరబడేందుకు ప్రయత్నించి పట్టుబడుతున్న భారతీయుల సంఖ్య ప్రతిరోజూ పెరుగుతోంది. 2023-24లో కెనడా సరిహద్దునుంచి అమెరికాలోకి చొరబడేందుకు యత్నించిన వారిలో 23 శాతం మంది భారతీయులే ఉన్నారని అమెరికా సరిహద్దు విభాగం ప్రకటించింది. అక్రమ చొరబాట్ల సమస్య అమెరికా కెనడాలమధ్య దౌత్యపరమైన సమస్యగా మారిందంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవాలి. అమెరికా కస్టమ్స్‌అండ్ బోర్డర్‌ప్రొటెక్షన్ లెక్కలను చూస్తే 2022లో కెనడానుంచి అక్రమంగా అమెరికాలోకి చొరబడేందుకు లక్షా



9 వేల 535 మంది యత్నించగా అందులో 16శాతంమంది భారతీయులే. 2023-24లో ఈ సంఖ్య 47 వేలకు చేరింది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారంచేసిన తర్వాత ఈచొరబాట్లపై ఎలా స్పందిస్తారన్నది ఇపుడు అంతుబట్టకుండా ఉంది. అయితే తాను బాధ్యతలు చేపట్టినవెంటనే అక్రమ వలసదారులను కట్టడిచేసి వారిని వెనక్కి పంపిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే హెచ్1బి వీసాల జారీ ప్రక్రియను కూడా హేతుబద్ధీకరణ చేస్తామని ప్రకటించారు. భారతీయులతోపాటు ఇతర దేశాలకు చెందినవారు కూడా లేకపోలేదు. అయితే కెనడా సరిహద్దుల్లోంచి సులువుగా అమెరికాలోప్రవేశించవచ్చన్న భావనతో చొరబాట్లకు పాల్పడుతున్నారు. ఇటీవలి తకాలంలో సరిహద్దు భద్రతను అమెరికా కట్టడిచేయడంతో ఎక్కువ మంది పట్టుబడుతున్నారు. వీరిలో అత్యధికులు భారతీయులే కావడం విచారకరం.

# బిజెపి సమీక్షకు సీతాసోరెన్ డుమ్మా



**రాంచి, డిసెంబరు 1:** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై విశ్లేషించుకునేందుకు నిర్వహించిన బిజెపి సమావేశానికి జార్ఖండ్ సీఎం బంధువు అయిన సీతాసోరెన్ హాజరుకాకపోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. పార్టీ ఎన్నికలకు ముందు సీతాసోరెన్ జార్ఖండ్‌ముక్తి మోర్చాకు రాజీనామాచేసి బిజెపిలో చేరి దుంకా అసెంబ్లీ స్థానంనుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. దీనితో ఇపుడు మళ్లీ ఆమె జెఎంఎంవైపు దృష్టి మళ్లించారన్న టాక్ వినిపిస్తోంది. ఓటమిపై విశ్లేషణ చేసేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బాబూలాల్ మరాండి ఓటమి అభ్యర్థులందరితోనూ సమీక్ష సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి అందరూ హాజరు అయినా సీతాసోరెన్ మాత్రం రాలేదు. దీనిపై విస్తృత స్థాయిలోప్రచారం తెరపైకి వచ్చింది. దీనికితోడు జెఎంఎం నేతలు కూడా పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్న ప్రకటనలు జారీచేయడంతో ఓటమి పాలయిన అభ్యర్థులు అంతా మళ్లీ జెఎంఎంలోకి వచ్చేస్తారన్న భావన పెరిగింది. అలాగే చంపయి సోరెన్ రావాలని భావిస్తే పార్టీలోకి ఆహ్వానిస్తామని జెఎంఎం ప్రతినిధి కూడా స్పష్టంచేసారు. అయితే సీతాసోరెన్ రాకపోవడంపై బాబూలాల్ స్పందిస్తూ ఇదొక సాధారణ సమావేశం అని సాంప్రదాయంగానే ఈ సమీక్షలు నిర్వహిస్తుంటామని అందరూ రావాలని నిబంధన ఏదీ ఖచ్చితంగా లేదని కొట్టివేసారు. అయితే సమావేశానికి సీతాసోరెన్ బయటిప్రాంతంలో ఉండటం వల్ల రాలేకపోయినట్లు సమాచారం ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న జెఎంఎం ఇపుడు అసమ్మతిరాగం వినిపించిన నేతలందరినీ ఒకేవేదికపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులోభాగంగానే సీతాసోరెన్‌నను సప్రందించగా ఈ అంశం జెఎంఎం పార్టీ అంతర్గత విషయమని పార్టీ మారే ప్రశ్న ప్రస్తుతం అప్రస్తుతమని అన్నారు. అయితే జెఎంఎం మాత్రం పార్టీని వీడివెళ్లిననేతలందరినీ వెనక్కి తెచ్చుకునేందుకు కృషిచేస్తోందని చెప్పారు. అయితే బిజెపి సమీక్షా సమావేశానికి హాజరుకాక పోవడంపై సీతాసోరెన్ స్పందిస్తూ ఆ సమావేశం ఏమీ అంత ముఖ్యమైనది కాదని అన్నారు. అదేవిధంగా మాజీ సీఎం చంపయిసోరెన్ ప్రస్తుత ఎన్నికల్లో సరాయికేలా నియోజకవర్గంనుంచి గెలిచారు. జెఎంఎం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరుగా ఉన్నారు. జెఎంఎంకు ఆయన ఎంతోముఖ్యం అందులోనూ 28 గిరిజన రిజర్వుడు సీట్లలో జెఎంఎం ఒక్క స్థానంలో మాత్రమే ఓటమి పాలయి బిజెపికి ఇచ్చింది. జెఎంఎం ప్రధాన కార్యదర్శి పార్టీప్రతినిధి సుప్రియో భట్టా చార్య మాట్లాడుతూ చంపయిదాదా రావాలను కుంటే జెఎంఎం తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయని సంచలన ప్రకటన చేసారు.

# ఫోన్ కాల్‌లో సోనియాగాంధీ కోసం గంటసేపు ఎదురుచూశా

రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్‌పర్సన్ నజ్మాహెప్తుల్లా




**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** రాజ్యసభ మాజీ డిప్యూటీ ఛైర్‌పర్సన్, ప్రముఖ రాజకీయ నాయకురాలు నజ్మా హెప్తుల్లా స్వీయ జీవితచరిత్ర 'ఇన్ పర్స్యూట్ ఆఫ్ డెమోక్రసీ: బియాండ్ పార్టీ లైన్స్' అనే పుస్తకం తాజాగా విడుదలైంది. ఇందులో ఆమె కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి, తనకు మధ్య జరిగిన ఓ సంఘటన గురించి పంచుకున్న విషయాలు బయటకు వచ్చాయి. అదేంటంటే 1999లో తాను ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ (ఐపియు) అధ్యక్షురాలిగా ఎన్నికయ్యానని ఆ విషయం తెలియజేయడానికి కాంగ్రెస్ పార్టీ అప్పటి అధ్యక్షురాలు సోనియా గాంధీకి ఫోన్ చేశానని నజ్మా హెప్తుల్లా పేర్కొన్నారు. అయితే ఆమె సిబ్బంది ఒకరు తనతో మాట్లాడి 'మేడం బిజీగా ఉన్నారు.. లైన్‌లో ఉండండి' అని చెప్పారని, తాను గంటపాటు ఫోన్ లైన్‌లో ఉన్నా సోనియాగాంధీ తనతో మాట్లాడలేదని తెలిపారు. ఈ ఘటనలో తాను తీవ్ర నిరాశకు గురయ్యానని.. మళ్లీ ఆ విషయం గురించి సోనియాతో ప్రస్తావించలేదని పేర్కొన్నారు. అయితే అంతకుముందు ఐపియు ప్రెసిడెంట్ పదవికి తన పేరును సిఫార్సు చేసే ముందు ఆమె తనకు అభినందనలు తెలిపారని గుర్తు చేసుకున్నారు. అదే సమయంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఫోన్ చేయగా ఆ విషయం విని ఆయన సంతోషం వ్యక్తం చేశారని అన్నారు. భారత దేశానికి గౌరవం తెచ్చావని మెచ్చుకున్నారని తెలిపారు. 2000 సంవత్సరంలోనూ న్యూయార్క్‌లో జరిగిన 'మిలీనియం కాన్ఫరెన్స్ ఆఫ్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్' కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సోనియాగాంధీని ఆహ్వానించగా.. తాను రాలేకపోతున్నానని చివరి నిమిషంలో కబురు చేశారని అన్నారు. కాంగ్రెస్ కోసం ఎంతో కృషి చేసిన తనలాంటి వారికి ఆ పార్టీ సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని.. దాని వల్ల అగ్రనేతలు, పార్టీ శ్రేణుల మధ్య అభిప్రాయబేధాలు వచ్చాయన్నారు. పార్టీ పెద్దల సలహాలు, సూచనలను పట్టించుకునే వారు కాదని అందువల్లే ఎందరో రాజకీయ అనుభవజ్ఞులు కాంగ్రెస్‌ను వీడాల్సి వచ్చిందని రాసుకొచ్చారు. కానీ ఇందిరాగాంధీ హయాంలో పార్టీ లోని ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రాధాన్యం ఉండేదని ఆమే స్వయంగా ప్రజల్లోకి, పార్టీ నేతల్లోకి వచ్చి పరిస్థితులు తెలుసుకునేవారని గుర్తు చేసుకున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

## కారును ఢీకొన్న ట్రక్కు.. ఐదుగురు దుర్మరణం



**రాయ్‌పూర్, డిసెంబరు 1:** ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకున్నది. రాయ్‌పూర్ నుంచి అంబికాపూర్ వెళ్తున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ఈ నలుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సుర్గుజా జిల్లా అంబికాపూర్–బిలాస్‌పూర్ జాతీయ రహదారి 130పై ఉదయపూర్ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం తర్వాత ట్రక్కు డ్రైవర్ తప్పించుకునేందుకు తన వాహనాన్ని రివర్స్ చేయగా కారు మరింత దెబ్బతిన్నది. మృతులను చంగురభతా రాయ్‌పూర్ వాసులుగా గుర్తించారు. జగదల్‌పూర్‌కు కారులో బయలుదేరగా.. ఉదయపూర్ అదానీ గెస్ట్‌హౌస్ సమీపంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను కట్టర్ల సహాయంతో తొలగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జనాభా సంఖ్యను పెంచాలి



ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**ముంబై, డిసెంబరు 1:** జనాభా తగ్గుదలపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో క్షీణత కొనసాగితే సమాజం దానంత అదే నశించిపోతుందని పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన.. కుటుంబ ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. కుటుంబాలు సమాజంలో భాగమని తెలిపారు.

'జనాభా తగ్గుదల అనేది ఆందోళనకర అంశం. జనాభా శాస్త్రం ప్రకారం జనాభా పెరుగుదల రేటు 2.1 కన్నా దిగువకు వెళితే.. సమాజం నశిస్తుంది. దానిని ఎవరూ అంతం చేయాల్సిన అవసరం లేదు. అదేవిధంగా భాషలు కనుమరుగవుతాయి. భారత జనాభా విధానం కూడా ఈ రేటు 2.1 కన్నా తక్కువ ఉండకూడదని చెబుతోంది. మన దేశానికి సంబంధించి ఇది మూడుగా ఉండాలి. ఈ సంఖ్య చాలా కీలకం. ఎందుకంటే సమాజ మనుగడకు అది అవసరం' అని మోహన్ భాగవత్ పేర్కొన్నారు.

1960-2000 మధ్య రెట్టింపైన ప్రపంచ జనాభా పెరుగుదల రేటు ఆ తర్వాత నుంచి తగ్గుముఖం పడుతోందని నివేదికలు చెబుతున్నాయి. ప్రతి మహిళ 2.1 మందికి కంటేనే పాత తరాన్ని భర్తీ చేసే స్థాయిలో జననాలు జరుగుతాయి. దీన్ని జనాభా భర్తీ రేటు అంటారు. 2.1కి దరిదాపుల్లో ఉన్న దేశాల్లో భారత్, అర్జెంటీనా, ట్యునీసియా ఉన్నాయి. 2.1 కన్నా తక్కువ రేటు ఉన్న దేశాల్లో అమెరికా, బ్రెజిల్, మెక్సికోలు ఉండగా.. చైనా, జపాన్, దక్షిణ కొరియాల్లో అంతకన్నా తక్కువ కనిపిస్తోంది.

# ట్రంప్‌తో కెనడా ప్రధాని ట్రూడో భేటీ

**వాషింగ్టన్, డిసెంబరు 1:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించనున్నట్లు చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే దీనిపై చర్చించేందుకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో ఎస్టేట్ ఈ బేటీకి వేదిక అయింది. ఇరువురు నేతలు వివిధ అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. 'నేను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో సమావేశమయ్యాను. ఇరు దేశాలు కలిసి పనిచేయడానికి అవసరమైన అనేక అంశాలపై మాట్లాడుకొన్నాం. అక్రమ వలసలు, ఫెంటనిల్ స్మగ్లింగ్ అంశాలు చర్చకు వచ్చాయి. అమెరికా కార్మికులకు నష్టం కలిగించని వాణిజ్యపరమైన అంశాలపై అభిప్రాయాలు పంచుకొన్నాం. చైనా నుంచి వస్తున్న ఫెంటనిల్ కారణంగా మా పౌరులు మాదకద్రవ్యాలకు బానిలుగా మారడాన్ని చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశా. ఈ భయంకరమైన వినాశనాన్ని అంతం చేసేలా ట్రూడో మాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు' అని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి పనిచేసేందుకు తాను ఎదురు



చూస్తున్నట్లు ట్రూడో ఎక్స్ వేదికగా వెల్లడించారు.




ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వెన్నపూస సుబ్బిరెడ్డి

# సమస్యలను పరిష్కరించకుంటే దశల వారీ ఉద్యమం

## ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ హెచ్చరిక

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే దశల వారి ఉద్యమం చేపడతామని ఏపీ విద్యుత్తు కార్మిక సంఘాల పోరాట కమిటీ( ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ) హెచ్చరించింది. ఎపి విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల , కార్మికుల ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ కార్యవర్గ సమావేశము విజయవాడ నగరంలోని సి. ఐ . టి .యు రాష్ట్ర కార్యాలయములో ఆ కమిటీ చైర్మన్ పి సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని అదాని, టాటాకు దారాదత్తం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయతింస్తోం దన్నారు. అడ్డగోలుగా కుదుర్చుకున్న పి పి ఏ లను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు .స్మార్ట్ మీటర్స్ ఏర్పాటుచేసి ప్రజల మీద పెద్దఎత్తున విద్యుత్ భారాలు వేయబోతున్నారని అన్నారు. దేశములో విద్యుత్ రంగాన్ని నాశనం చేయడానికి మోడీ సర్కార్ ముందుకెళ్తోందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాడి విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలన్నారు స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఎపి విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఇరవై ఐదువేల మంది కాంట్రాక్టు కార్మికుల దీర్ఘ కాల డిమాండ్స్ ను గత ప్రభు త్వం పట్టించుకోలేదన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పెర్మనెంట్ చేస్తానని హామీ ఇచ్చిన వైస్ .యస్ జగన్ మోహన్ రెడ్డి మాట నిలుపు కోకుండా ముఖ్యమంత్రి పీఠం నుండి దిగిపోయా దన్నారు. తెలుగుదేశం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గా నారా లోకేష్ యువ గళం లో తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్స్ ను పరిస్కరిస్తామని హామీ ఇచ్చారని అయన తన మాట నిలబెట్టుకుంటారని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ సమావేశములో స్ట్రగుల్ కమిటీ నాయకులు ముజఫర్,సూరిబాబు మోహన రావు, గంగయ్యశివశంకర్ పుల్లారెడ్డిలు మాట్లాడారు.

# హ్యాట్రిక్ కోసం ఒకరు..ఉనికి కోసం మరొకరు..

## రైల్వే ఎన్నికల ప్రచారానికి నేడు తెర




**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 1,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఈనెల 4,5,6వ తేదీల్లో జరుగబోయే రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రచా రానికి నేడు తెరపడనుంది. రైల్వే కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని తమతమ విజయం కోసం విరోచితంగా పోరాడు తున్నాయి. ఎన్నికలకు ఇక రెండు రోజుల గడువు మాత్రమే ఉండటంతో రైల్ భవన్/రైల్ నిలయంలపై విరోచిత పోరాటాల ఫలితంగా అరుణ పతాకాన్ని ఎగురవేయాలని ఒకరు,త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మరొకరు శ్రమతోడ్చి పనిచేస్తున్నాయి. 1924నుంచి రైల్వే కార్మికహక్కు లకై,శతాబ్దకాలంగా కార్మికోద్యమ చరిత్రలో యాజమాన్యం ఎంతటి అడ్డంకులు,అవాం తరాలను సృష్టించిన వాటిని ఏమాత్రం లెక్కచేయకుండ సమర్థవంతంగా ఎదురొడ్డి ప్రాణ త్యాగాలు సైతం చేసిన ఎఐఆర్ఎఫ్, యాజమాన్యం తో సంప్రదిం పులు చర్చలు జరిపి రైల్వే కార్మికులకు న్యాయం చేకూర్చిన కార్మిక సంఘాలు ఈ ఎన్నికలను సవాలుగా తీసుకుని గెలుపు కోసం పోరాడుతున్నాయి. రైల్వే కార్మిక సంఘాల గుర్తింపును రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించి పోల్ అయిన మొత్తం ఓట్లలో 30శాతం లేదా అంతకంటే ఎక్కువగా ఓట్లు సాధించిన కార్మిక సంఘాలను గుర్తించాలని నిర్ణయించడంతో,2007నవంబరు 26,27,28వ తేదీల్లో జరిగిన తొలి రహస్య బ్యాలెట్ ఎన్నికలలో నాడు ఎఐఆర్ఎఫ్ దేశస్థా యిలో 13రైల్వే జోన్‌లలో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు జోన్‌లలో ఎన్ఎఫ్ఐఆర్,మరొక జోన్‌లో బిఆర్ఎంఎస్‌లు విజయం సాధించి గుర్తింపు పొందాయి. 2013ఏప్రిల్ 25,26,27వ తేదీల్లో జరిగిన రెండో దఫా ఎన్నికలలో ఎఐఆర్ఎఫ్-11 జోన్‌లలోను,ఎన్ఎఫ్ఐఆర్ కాస్త పుంజుకుని 06జోన్‌లలో గెలుపొందాయి. ప్రస్తుతం జరుగుతున్న మూడో రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలలో రెండు కార్మిక సమాఖ్యలు కూడా తమ విజయం కోసం ఉనికిని కాపాడుకోవడం కోసం రేయింబవళ్లు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నాయి. రైల్వే కార్మికోద్యమ చరిత్రలో రాయలసీమకే తలమానికమైన దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ ఆది నుంచి చారిత్రాత్మకమైన కీలకపాత్ర పోషిస్తోంది. ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య,సహాయ కార్యదర్శి భరణి భానుప్రసాద్,ఎఐఆర్ఎఫ్ జాతీయ కోశాధికారి శంకర్‌రావులు సైతం ఇప్పటికే డివిజన్‌లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. డివిజనల్ రైల్వే కార్మిక సంఘాలు,ముఖ్యంగా రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి యస్ విజయకుమార్,ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్‌లు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకొని ఆయా సంఘాల కార్మికులను, నారీ లోకం మహిళా సిబ్బంది సైతం రాయలసీమ జిల్లాలలో,డివిజన్ వ్యాపితంగా పర్యటించి ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. రైల్వే జోన్‌లో పోటీ ఢీ అంటే ఢీ అన్న రీతిలో హోరా హోరీగా సాగుతుంది. వీరితో పాటుగా మరో మూడు కార్మిక సంఘాలు సైతం ఎన్నికల బరిలో ఉన్నప్పటికీ పోటీ ప్రధానంగా మజ్దూర్ యూనియన్,ఎంప్లాయిస్ సంఘ్‌ల మధ్యనే ఉంది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో విజ్ఞులైన ఓటరు మహాశయులు తమ ఓటును ఎవరికి వేయాలో అనేవిషయంలో ఇప్పటికే తుది నిర్ణయానికి వచ్చేసినట్టు పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. ఇకఎన్నికలు జరగడమే తరువాయి ఏమైనా ఫలి తాలు పూర్తి ఏకపక్షంగా ఉండే అవకాశం ఉంది.

# జెసి వ్యాఖ్యలపై స్పందించిన వెంకటరామిరెడ్డి



**అనంతపురం, డిసెంబరు 1 ప్రభాతవార్త బ్యూరో:** టిడిపి నేత, తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పై వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన ఆరోపణపై అనంత ఘాటుగా స్పందించారు:మీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు భయపడం. ప్రాణం అందరికీ ఒక్కటే. ప్రజాస్వామ్య బద్ధంగా పోరాట చేయడానికి వెనుకాడం అంటూ తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు, అవినీతి ఆరోపణలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితి గురించి మొన్న ప్రెస్‌మీట్‌లో మాట్లాడా. ఎక్కడ చూసినా అవినీతి జరుగుతోందని, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదని అన్నాను. ఒకరిని ఉద్దేశించి కాకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇసుక, మట్టి, మద్యం, బూడిద వ్యాపారంలో ఉన్నారని చెప్పా. ఈ విషయాలన్నీ పత్రికలు ఘోషించినవే..! ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చినవే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కూడా వాళ్ల పార్టీ మీటింగ్స్‌లో చెప్పారు. చంద్రబాబు చెప్పినా పరిస్థితి మారలేదనే మేం మాట్లాడాం. మీలా గతంలో బెదిరించినోళ్లు జిల్లాలో ఉన్నా మాఫియాను మాత్రం తయారు చేయలేదు. ఇలాంటి మాఫియా జిల్లాకే హానికరం. ఆయనకు కూడా హానికరమే. ఇది మంచిది కాదు. పత్రికల్లో రాస్తే వాళ్లను బెదిరిస్తారు. వాళ్ల పార్టీ వాళ్ల మీదకే వెళ్తారు. అధికారులను బెదిరిస్తారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తారు. అందరూ నోరు మూసుకుంటున్నట్లు మమ్మల్ని మూసుకోమంటే కుదరదు. మీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు ఎవరూ భయపడమ్ అని తెలిపారు.



కాళంగి నదిని పరిశీలిస్తున్న ఎస్ఇ మదనగోపాల్

# నిండిన ప్రాజెక్టులు

**శ్రీకాళహస్తి,డిసెంబరు 1 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు నిండి గేట్లు తెరచుకున్నాయి. మూడురోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు ధ్వంసమయ్యాయి. తిరుపతి,శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని ప్రాజెక్టులు నిండటంతో ఇంకా ఇన్‌ఫ్లో ఉండటంతో ఇరిగేషన్ ఎస్ఇ మదనగోపాల్, తిరుపతి ఎస్పి సుబ్బరాయుడు,స్థానికపోలీసులు ఆయా పరిధిల్లో అప్రమత్తమయ్యారు. సాధారణంగా ఈశాన్య రుతుపవనాల ద్వారా నవంబర్ మాసం సగటు సాధారణ వర్షపాతం 332 మి.మీలు నమోదు కావాలి. కానీ కేవలం 224 మి.మీలు మాత్రమే నమోదైంది. డిసెంబర్ సాధారణ సగటు వర్షపాతం 174 మి,మీలు నమోదు కావాల్సి ఉండగా డిసెంబర్ 1 ఉదయం రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు 88 మి.మీలు నమోదైంది. ఇక అక్టోబర్ మాసం సాధారణ సగటు వర్షపాతం 229 మి.మీలు కాగా 320 మి.మీలు నమోదైంది. అక్టోబర్ మాసం వర్షాలతో బాగా నెమ్ము ఎక్కిన భూమిపై నవంబర్ వర్షాలతోపాటు ఫెంగల్ తుఫానుతో ప్రాజెక్టులు పొంగి పొర్లాయి.

**ప్రాజెక్టులలో నీటి పరిస్థితి:** తిరుపతి జిల్లాలో ఫెంగల్ తుఫాన్‌తో సాగునీటి ప్రాజెక్టుల పొంగిపొర్లాయని ఎస్ఇ నందగోపాల్ వివరించారు. శ్రీకాళహస్తి పట్టణం గుండా పారే స్వర్ణముఖి నది నుంచి 11275.55 క్యూసెక్కుల నీరు సముద్రం పాలౌతుంది.కాగా ఆరణియార్‌కు సంబంధించిన నాలుగు గేట్లు తెరచినారు.ఎఫ్ఆర్ లెవల్ 281 అడుగులు కాగా ఆదివారం ఉదయం 276.8 అడుగుల నీరు చేరింది.ఇన్‌ఫ్లో 4050 క్యూసెక్కులుండగా గేట్లు తెరచి నీటిని వదలిపెట్టారు.అలాగే మల్లిమడుగు రిజర్వాయర్ 366 అడుగులు కాగా రిజర్వాయర్ నిండటంతో 4250క్యూసెక్కుల నీటిని స్వర్ణముఖి కి వదలి పెట్టినట్లు ఎస్ఇ నందగోపాల్ వివరించారు.

# ఆధిపత్యం కోసమే హత్య

## హిజ్రా హాసిని హత్య కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

**నెల్లూరు క్రైమ్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** జిల్లాలో సంచలనం రేపిన హిజ్రా నాయకురాలు హాసిని హత్య కేసును పోలీసులు ఛేదించారు. హిజ్రాలలో ఉన్న రెండు గ్రూపుల మధ్య ఆధిపత్యమే ఈ హత్యకు దారి తీసినట్లు, అందుకు కొందరు పాత నేరస్తులు సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు కు సంబంధించిన వివరాలను ఆదివారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. చిన్న చెరుకూరు గ్రామానికి చెందిన మాణికల హాసిని (33) హిజ్రాల సంఘానికి నాయకురాలిగా వ్యవహరిస్తున్నారు. కేవలం నెల్లూరు నగరం మాత్రమే కాకుండా రాయలసీమలోని అన్ని జిల్లాలు, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, రాయచూరు, ధార్వాడ్ తదితర ప్రాంతాల్లోని హిజ్రాలందరికి హాసిని నాయకిగా వ్యవహరిస్తున్నారు. అంతకుముందు ఇదే తరహాలో హిజ్రాల అందరికీ నాయకురాలిగా వ్యవహరిస్తున్న రాయపనేని అలేఖ్య కు, హాసినికి మధ్య విభేదాలు నెలకొన్నాయి. తనకంటే చిన్నది అయిన హాసిని ఎదగడం సహించలేకపోయిన అలేఖ్య సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నది. ఇదే సమయంలో మరో రెండు హిజ్రా గ్రూపులకు నేతృత్వం వహిస్తున్న సులోచన, షీలాలకు హాసినితో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో అలేఖ్యతో జత కూడిన సులోచన, షీలాలు హాసిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయంలో తమకు సహకరించాలని సుందరయ్య కాలనీకి చెందిన చింతల భూపతిని కోరగా అతను తన స్నేహితులతో కలిసి హాసినిని చంపేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో నవంబర్ 26వ తేదీ విడవలూరు మండలం పార్లపల్లి లోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు ముగించుకుని కారులో వస్తున్న హాసినిని కొడవలూరు మండలం టపాతోపు రైల్వే అండర్ పాస్ వద్ద తమ వాహ నాలతో అడ్డగించి 15 మంది ముద్దాయిలు అతి దారుణంగా హాసినిని చంపి వేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితుల్లో 12 మందిని అరెస్టు చేశారు. అరెస్టు కాబడిన ముద్దాయిలు: ఇల్లపు వంశీకృష్ణ (నాలుగో మైలు), మొలతాటి రాము (మార్టూరు మండలం, బాపట్ల జిల్లా), తాండ్ర కార్తీక్ (అల్లీపురం), అంబూరు (4వ మైలు), షేక్ మస్తాన్ వలి (4వ మైలు), కొత్త పార్టీ వెంకటాద్రి (నాల్గవ మైలు), కొత్తపల్లి రాజేష్(కిసాన్ నగర్), గురునాథం నరసింహ (4వ మైలు), నెల్లూరు వంశీ (జేజే పేట, ఇందుకూరుపేట మండలం), ఊటుకూరి శివ (బోడిగాడి తోట), రాయపనేని అలేఖ్య ( జనార్దన్ రెడ్డి కాలనీ), చింతల భూపతి (సుందరయ్య కాలనీ). మరో ముగ్గురు నిందితులు అరెస్టు కావాల్సి ఉందని, వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.

నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, కొడవలూరు, వెంకటాచలం, నెల్లూరు రూరల్ సీఐలు సురేంద్రబాబు, సుబ్బారావు, వేణు లతోపాటు వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి సిహెచ్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయాభివృద్ధి పనులపై విస్తృత సమీక్ష



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాసరెడ్డికి, నిత్యాన్నదాన ప్రసాదంకు విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, డిసెంబరు 1, ప్రభాతవార్త :** రాబోయే 100 సంవత్సరాలకు భక్తులకు కావాల్సిన సౌకర్యాల కల్పన దిశగా మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం మహామండపంలో జరిగిన మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి పనులపై జరిగిన విస్తృత సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ పనులు గతంలో కొంతమేర అమలు చేసి మధ్యలో ఆపినందున తిరిగి కొనసాగిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి అమలుచేస్తున్న ప్రసాదం స్కీం ద్వారా నిధులు పొందేందుకు వీలుగా కాటేజీలు, వెయిటింగ్ రూంలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రం అమలు చేస్తున్న టెంపుల్ టూరిజం ద్వారా నిధులు విడుదల చేయడం జరుగుతుందని, వీలైనన్ని ఎక్కువ నిధులు అందుకునేలా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ఈ సమీక్షలు పలు సూచనలు చేశారని, వాటిని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరుస్తామన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మాస్టర్‌ప్లాన్‌ను వివరంగా తెలిపారు.

**ఆలయాభివృద్ధికి కృషిచేస్తామన్న ఎంపి:** దుర్గమ్మ ఆలయాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. ఈ సమీక్షలో దేవదాయశాఖ కమీషనర్ ఎస్ సత్యనారాయణ, ఇఒ కెఎస్ రామారావు, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలోజరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1లక్షను విజయవాడకుచెందిన జి రామిరెడ్డి ఫ్రూట్స్ అధినేత జి రామిరెడ్డి సతీసమేతంగా అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు.

# చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కేసు పెట్టలేదు: బాలిక తండ్రి రమణ వివరణ

**తిరుపతిరూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కేసు పెట్టాలని నేను పోలీసులకు చెప్పలేదు. నా కూతురుపై దాడి జరిగితే మేమే స్వయంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పిలవడం జరిగిందని బాలిక తండ్రి రమణ మీడియాకు తెలియజేసారు. యర్రావారిపాళ్యం మండలం, యలమందలో ఓ బాలికపై దాడి జరిగిన విషయం తెల్సిందే. వాస్తవాలు తెలియకుండా అన్ని పత్రికలలో కథనాలు వచ్చాయి. దీనిపై యర్రావారిపాళ్యం పోలీసుస్టేషన్‌లో చెవిరెడ్డిపై కేసు నమోదైన విషయం తెల్సిందే. దీనిపై స్పష్టత ఇవ్వటానికి బాలిక తండ్రి రమణ మీడియా ముందుకు వచ్చారు. ఆదివారం పద్మావతిపురంలో టిటిడి మాజీ చైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రమణ మాట్లాడుతూ నా కూతురుపై దాడి జరిగితే మేము స్వయంగా పిలవడం జరిగిందని, చెవిరెడ్డిపై కేసు పెట్టమని ఎవరికి చెప్పలేదన్నారు. తాను చదువుకోలేదని, పోలీసులు సంతకం పెట్టమంటే పెట్టానే తప్ప, చెవిరెడ్డిపై కేసు పెట్టలేదన్నారు. నా బిడ్డకు అన్యాయం జరిగితే సహాయం చేయడానికి వచ్చిన మంచి మనిషిపై కేసు ఎలా పెడతామని వాపోయారు.

# శివయ్యను దర్శించుకున్న 30వేల మంది భక్తులు

**శ్రీకాళహస్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఆదివారం సుమారు 30 వేల మంది దర్శనం చేసుకున్నట్లు సమాచారం. ఓ వైపు వర్షం కురుస్తున్నా భక్తులు పట్టించుకోకుండా హాజరయ్యారు. రాహుకేతుదోష నివారణ పూజలు ఐదువేలు జరగగా అభిషేకాలు ఏనిమిది పదులు వరకు జరిగాయి. అయితే ఉదయం నుంచి ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఎఇఒ లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్ పెక్టర్లు హరియాదవ్, సుదర్శనంలు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఇఒ బాపిరెడ్డి స్వతహాగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వారాంతంలో తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తుల సంఖ్య అదికంగా ఉంటుంది. అలాగే విఐపిలతాకిడి కూడా అధికంగానే ఉంటుంది.

**6వేల రాహుకేతుదోష నివారణ పూజలు:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 2070 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్టులో 1620 మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 3179 మంది, రూ.750టిక్కెట్లతో 1494, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 435 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 379 మంది, రూ.5వేల టిక్కెట్లు 105 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలు 123 శనీశ్వరాభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 37 శనీశ్వరాభిషేకాలు 24,నిత్యకళ్యాణ సేవల్లో 7 జరిగినట్లు సమాచారం అందించారు.



# ఏడుగంగమ్మల జాతరకు దక్షిణకైలాసం ముస్తాబు

## పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం డిసెంబర్ మాసంలో జాతర నిర్వహణకు ముస్తాబౌతుంది. ఈ నేపథ్యంలో దేవస్థానం ఇఒ టి.బాపిరెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఏడుగంగమ్మల జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. జాతరలు మన సంప్రదాయాలకు దిక్సూచిలని ఎంఎల్ఏ అన్నారు. ప్రతి ఏడాది నిర్వహించే ఏడుగంగమ్మల జాతర ప్రభుత్వ కార్యక్రమం అని వివరించారు. ఈ ఏడాది జాతరలో దేవస్థానం ప్రధాన పాత్ర వహించాలని సూచించారు. సాధారణంగా ఏ ప్రాంతంలో అయినా రాష్ట్రంలో అయినా ఒక చోట గంగమ్మను ప్రతిష్ఠించి పూజలు జరపటం ఆనవాయితి కానీ శ్రీకాళహస్తిలో ఏడు చోట్ల ఏడు గంగమ్మలను ప్రతిష్టించి పూజలు నిర్వహించటం ఆనవాయితి అన్నారు. ఈ ఏడాది గతం కన్నా భిన్నంగా జాతరను నిర్వహించుటకుఏర్పాట్లు చేయాలని దేవస్థానం అధికారులకు ఎంఎల్ఏ సూచించారు.

**8న చాటింపు,11,12న జాతర:** ఓ వైపు చలి,మంచు దడపుట్టిస్తుంటే మరో వైపు జారత కమిటిలు ఏర్పాట్లులో తలమునకలై ఉన్నారు.ఈ నెల 8 రాత్రి చాటింపు కార్యక్రమాలకు సిద్దం చేస్తు న్నారు. డిసెంబర్ 11,12 తేదుల్లో జాతర నిర్వహించుటకు సిద్దం చేస్తున్నారు.



# కల్పవృక్ష వాహనంపై కోర్కెలు తీర్చే అలివేలు మంగ

**తిరుచానూరు, డిసెంబరు 1, ప్రభాత వార్త:**కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి అలివేలుమంగమ్మ కల్పవృక్ష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజగోపాలస్వామివారి అలంకారంలో చంద్రకోలు, దండం ధరించి పద్మావతి అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిరహించారు. అనంతరం ఉత్సవర్లను వాహనం మండపంకు వేంచేపు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం తిరువీధులలో తులకరి చినుకుల నడుమ కల్పవృక్ష వాహనంలో అలివేలుమంగమ్మ భక్తులను అనుగ్రహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి అనుగ్రహానికి పాత్రులైనారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె శ్యామల రావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఓ దేవరాజులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుభాష్, చలపతి, ఏవియస్ఓ సతీష్ పాల్గొన్నారు.

# మేకలకాపరిని హత్యచేసిన వ్యక్తి అరెస్ట్

## కావలి డిఎస్పీ శ్రీధర్

**కావలి (నెల్లూరు), డిసెంబరు 1 ప్రభాతవార్త:** కొండాపురం మండలం గానుగపెంటలో మేకలకాపరి బంకా తిరుపాలును హత్యచేసిన వ్యక్తిని అరెస్ట్‌చేసి అతనివద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి డిఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డబ్బు ఆశతో మేకలకాపరి బంకా తిరుపాలును కావడిమల్లి అలియాస్ గురునాధం మాల్యాద్రి కత్తితో హత్యచేశాడన్నారు. పొలంలో పశువులకాపరివద్ద ఉన్న 23 మేకలను అపహరించాడన్నారు. గత నెల 27వ తేది మద్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో బంకా తిరుపాలును హత్యచేసి అతను మేపుకుంటున్న 23 మేకలను అపహరించాడన్నారు. ఈ మేకల విలువ 2లక్షల 30వేలు ఉంటుందన్నారు. ఈ మేకలను తోలుకుని అగ్రహారం రోడ్డులో పోతుండగా నలుగురు వ్యక్తులు మాట్లాడుకోవడం చూసి వారివద్దకు పోయి డబ్బులుకు ఇబ్బందిగా ఉందిఅని చెప్పి తక్కువ ధరకు మేకలను అమ్ముతానని చెప్పాడన్నారు. వారిలో ఇద్దరువ్యక్తులు గోపి, నవీన్‌లకు చెరొక మేకను అమ్మి 4500లు తీసుకున్నాడన్నారు. మరో వ్యక్తి గోవర్ధన్‌కు అనుమానం వచ్చి తనఫోన్‌లో వీడియో తీశారన్నారు. అది గమనించిన కావడి మల్లి అలియాస్ గురునాధం మాల్యాద్రి భయపడి మేకలను అక్కడే వదిలేసి తప్పించుకుని పారిపోయాడన్నారు. కత్తితో పొడిచిన తిరుపాలు చనిపోయాడని తెలిసి పోలీసులు ముద్దాయికోస వెతుకులాట ప్రారంభించారన్నారు. ఈ విషయం తెలుసు కుని సత్యవోలు విఆర్ లో వద్ద కావడిమల్లి లొంగిపోయారన్నారు. ఈ కేసులో కలిగిరి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకట నారాయణ, కొండాపురం ఎస్ఐ ఎం.వెంకట రావు, వింజమూరు ఎస్ఐ కె.ప్రతాప్, హెడ్‌కానిస్టేబుల్ బి.రమేష్ కుమార్, కానిస్టేబుళ్లు ఆర్ మహేష్, పి.సుబ్రహ్మణ్యం, యు.రాజశేఖర్, యన్.సురేష్, వింజమూరు కానిస్టేబుల్ యస్‌కె.సుల్తాన్‌బాష, కొండాపురం కానిస్టేబల్ యం.ప్రతాప్, ఏఆర్‌పిసి కె.శ్రీకాంత్‌లు ఈ కేసులో కృషిచేశారన్నారు. ఈ సమావేశంలో కలిగిరి సి.ఐ వెంకటరమణ, కొండాపురం ఎస్ఐ వెంకటరావులు పాల్గొన్నారు.




# జాతీయ స్థాయిలో మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారిణిల ప్రతిభ




**సచివాలయం,డిసెంబరు 1,ప్రభాతవార్త :** 2024 అండర్ 20 జాతీయ మహిళా ఫుట్‌బాల్ జట్టు ట్రయల్ కోసం ఇద్దరు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారిణిలు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఎంపికచేసింది. అనంతపురం జిల్లా మందల అనూష,కడప జిల్లాకు చెందిన తమటపు అరుణ ఈ ట్రయల్ రన్‌కు ఎంపికయ్యారు.గతేడాది కూడా ఆంధ్రప్రదేశ్ నుండి ఇద్దరు జూనియర్ అమ్మాయిలు జాతీయ జట్టు ప్రాబబుల్స్‌గా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్రంలో టోర్నమెంట్‌లు ఎక్కువగా నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుండడంతో ఏపి క్రీడాకారిణిలు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారు.ఆటలో తమను ప్రోత్సహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు కోటగిరి శ్రీధర్, డేనియల్ ప్రదీప్‌లకు ఈ సం దర్భంగా మందల అనూష,తమటపు అరుణ కృతజ్ఞతలు తెలిపారు. మందల అనూష,తమటపు అరుణలు మరిన్ని విజయాలు అందుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని,పేరు ప్రఖ్యాతలు జాతీయస్థాయిలో పెంచాలని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు కోటగిరి శ్రీధర్,డేనియల్ ప్రదీప్‌లు ఆకాంక్షిస్తూ వారికి అభినందనలు తెలిపారు.

# కిషన్‌రెడ్డికి తెలంగాణపై మాట్లాడే హక్కులేదు


## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు1:** రాష్ట్ర బిజెపి విడుదల చేసిన చార్జ్‌షీట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ గురించి ప్రశ్నించేందుకు ఏం హక్కు ఉందని, ఆయనకు తెలంగాణతో ఏం సంబంధం ..మాట్లాడటానికి ఆయనకు ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. ఆయన గుజరాతీ గులాం, అందుకే గుజరాత్ వెళ్తున్నానని గతంలో కిషన్‌రెడ్డి చెప్పారంటూ వ్యాఖ్యానించారు. అలాగే కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి గతంలో ఇచ్చిన హామీలపై మ్యానిఫెస్టోపై చర్చలకు సిద్దంగా ఉన్నామని, మా మంత్రులు చర్చకు సిద్దంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. కేంద్రంలో 11 ఏళ్లలో బిజెపి మ్యానిఫెస్టో హామీల అమలుపై, 11 నెలల్లో మా మేనిఫెస్టో హామీలపై చర్చించడానికి మేం సిద్ధమని సవాల్ చేశారు. గుజరాత్ లో మధ్య నిషేధం ఉందని బీజేపీ చెబుతోంది కానీ, కావాలంటే అక్కడ ఏ బ్రాండ్‌లు దొరుకుతాయే తీసుకెళ్లి చూపిస్తా.. అని ఓ ప్రశ్నకు సమాధానంగా సిఎం రేవంత్ చెప్పారు. రాష్ట్ర ప్రజలకు మొత్తం బిజెపి వైపు చూస్తున్నారని బిజెపి నేతలు అంటున్నారని స్పందిస్తూ దీనికి సమాధానంగా సిఎం రేవంత్ మాట్లాడుతూ కాకి పిల్ల కాకికి ముద్దు అంటూ సమాధానం ఇచ్చారు.

# విజయవంతంగా రైతు పండుగ

## వెల్లడించిన వ్యవసాయ, రైతు కమిషన్

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** మూడు రోజులపాటు జరిగిన రైతు పండుగ విజయవంతంగా సాగిందని వ్యవసాయ మరియు రైతు కమిషన్ వెల్లడించింది. హైదరాబాద్‌లో ఆదివారం కమిషన్ కార్యాలయం లో ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కెవిన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, భవాని తదితరులు సమావేశమై వివిధ అంశాలపై చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, నిన్న రైతు పండగలో మరో 3 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం ప్రకటించడం సంతోషమన్నారు. భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు కూడా సర్కార్ సాయం చేస్తున్నారు. వరదలకు నష్టపోయిన పంటలకు ఎకరాకు 10 వేలు ఇచ్చిందని, సన్నాలకు 500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌దేనన్నారు. అలాగే రైతులకు మార్కెట్ దగ్గర చేయడం, కల్తీ విత్తనాల్ని అరికట్టడానికి చేపట్టాల్సిన చర్యలు, సమగ్ర, సహకార వ్యవసాయం ఎట్లా అనే అంశాలపై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

# రైతులను వంచిస్తే బిజెపి ఊరుకోదు

## ఎంపి ఈటల రాజేందర్

### 7న సరూర్‌నగర్ స్టేడియంలో భారీ సభ

**హైదరాబాద్ (ఎల్‌బినగర్), డిసెంబరు 1, ప్రభాతవార్త:** రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని వంచిస్తే బిజెపి చూస్తూ ఊరుకోదని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల గ్యారడి ఆరు అబద్దాల 66 మోసాలపై రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షుడు సామారంగారెడ్డి ఆధ్వర్యంలో దిల్‌సుక్‌నగర్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఏడాది కాలంలోనే కాంగ్రెస్ నిజస్వరూపం బటబయలైందన్నారు. రైతుల భూములు లాక్కొని రియల్‌ఎస్టేట్ వ్యాపార బ్రోకర్ల కాంగ్రెస్ వ్యవహరించాలని చూస్తే బిజెపి ప్రజాసమస్యలపై బాధ్యతగా పోరాటం చేస్తుందన్నారు. యేడాది కాలంగా రాష్ట్రానికి ఏం వరగపెట్టారని కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటుందని ఎద్దేవా చేశారు. అభివృద్ధికి బిజెపి అడ్డంకి కాదని, కోట్లాది రూపాయల విలువ చేసే భూములను తీసుకొని లక్షలు ఇస్తామంటే బిజెపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 7న సరూర్‌నగర్ స్టేడియంలో భారీసభను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, బేతి సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీరాములుయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, చింతల సురేందర్‌యాదవ్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, దాసరి జయప్రకాష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

# దేశంలో బిజెపి బలపడడం ప్రమాదకరం

## రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అసంతృప్తితో జనం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**గజ్వేల్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** దేశంలో బిజెపి బలపడడం అత్యంత ప్రమాదకరమని సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో కోల అభిరాం గార్డెన్‌లో సిపిఐఎం సిద్దిపేట జిల్లా మూడవ మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. దేశంలో బిజెపి మతోన్మాద విచ్చిన్న రాజకీయాలకు పాల్పడుతుందని, మోడీ కులమతాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. అంబానీ, ఆదానీలను ప్రోత్సహిస్తూ దేశాన్ని ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఆదానిని అరెస్ట్ చేయాలని అమెరికన్ ప్రభుత్వం చెప్పినా పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టిన ప్రధాని మోడి మాత్రం మౌనం వహిస్తున్నారని ఆయన ఎద్దేవ చేశారు. మోడి మౌనం వెనుక ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. అమెరికాలో జరిగిన కుంభకోణంలో ఆంధ్రప్రదేశ్‌తో సహా ఇతర రాష్ట్రాలు దోపిడీకి నివేదికలు వెలువడుతున్నప్పటికీ వాటిపై చర్చించేందుకు మోడి ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. మోడి మూలంగా దేశానికి భద్రత లేదని, ప్రమాద అంచున దేశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు పార్టీలు చట్టసభల్లో సీట్లు లేవని బలహీనంగా ఉన్నారని ప్రచారం చేస్తున్నా తమ పోరాటాలు ప్రజల సమస్యల కోసం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐఎం అన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తుందని, రెండు పార్టీలు ప్రజా వ్యతిరేకాన్ని కూడగట్టుకున్నాయన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల కోసం భూములు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించారని, ఇప్పుడు కొడంగల్ నియోజకవర్గంలో లగిచర్ల పరిశ్రమ విషయంలో రేవంత్‌రెడ్డి అనుకూలంగా తీసుకొని రైతుల భూములు లాక్కుంటున్నారని ఆయన విమర్శించారు.

# తెలంగాణ ఐకాన్, స్ఫూర్తిప్రదాత ఈశ్వరీబాయి

## నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### అధికారికంగా 106వ జయంతి ఉత్సవాలు


ఈశ్వరీబాయి స్మారక అవార్డుతో పల్లె నాగేశ్వరరావును సత్కరిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారావు, పొన్నం, శ్రీధర్‌బాబు. పాల్గొన్న గీతారెడ్డి, మహేష్‌గౌడ్, మామిడి హరికృష్ణ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 1, ప్రభాతవార్త :** తెలంగాణ ఐకాన్, గొప్ప యాక్టివిస్ట్, ఎందరికీ స్ఫూర్తి ప్రదాత జె.ఈశ్వరీబాయి అని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆమె ఆలోచనలు, ఆశయాలను పుణికిపుచ్చుకున్న మంచి నాయకురాలు డా. జె.గీతారెడ్డి అని, శాసనసభ్యురాలిగా, మంత్రిగా మంచి పేరుప్రఖ్యాతులు సంపాదించారని, అందరికీ స్ఫూర్తిదాయకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రవీంద్ర భారతిలో రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సభాధ్యక్షతన తెలంగాణ ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహిస్తున్న జె.ఈశ్వరీబాయి 106వ జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విశిష్ట అతిథులు రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, వాణిజ్యశాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్మే శ్యామ్యూల్, రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు, మహేష్‌గౌడ్, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ డా. జె.గీతారెడ్డి, జస్టిస్ చంద్రయ్య, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, వెన్నెల తదితర ప్రముఖులతో కలిసి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావును ఘనంగా సత్కరించి శ్రీమతి ఈశ్వరీబాయి స్మారక అవార్డు ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. ముందుగా డా. జె.గీతారెడ్డి స్వాగతో పన్యాసంలో తెలంగాణ పోరాట యోధురాలైన ఈశ్వరీ బాయి జయంతిని పదేళ్లుగా ప్రభుత్వపరంగా నిర్వ హించడం జరుగుతుందని, ఆమె రాజకీయ ప్రస్థానాన్ని వివరించారు.

ఆత్మవిశ్వాసం, ధైర్యం ఆమె స్వంతమన్నారు. ఎల్లారెడ్డిలో త్వరలో ఈశ్వరీబాయి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. ఈశ్వరీబాయి పోరాటపటిమ ఎనలేనిది, అనితర సాధ్యమని, సమసమాజ స్థాపనకు కృషిచేశారని, ఏవిధమైన పదవులకు లొంగలేదని, ఆమె జీవితం ప్రతీఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జూపల్లి కృష్ణారావు ప్రారంభోపన్యాసంలో అన్నారు. పొన్నం అధ్యక్షోపన్యాసంలో ఈశ్వరీబాయి ముందుతరాలకు మరింతగా జ్ఞాపకం ఉంచుకునే పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు గొంతుక ఈశ్వరీబాయి ధీర సాహస వనితని, ఎంతోమందికి మార్గదర్శి, తెలుగుతనానికి ముఖ్యంగా మహిళలకు ఆదర్శప్రాయినని కొనియాడారు. చివరిగా ఈశ్వరీబాయి స్మారక అవార్డు గ్రహీత పల్లె నాగేశ్వరరావు తన స్పందనలో ఈ అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందని, ఇందుకు కారకులైన డా. జె.గీతారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వచ్చే యేడాది రెండు సూర్య, రెండు చంద్ర గ్రహణాలు

## సూర్య గ్రహణాలు భారత్‌లో పాక్షికం.. చంద్రగ్రహణం సంపూర్ణం

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది అంటే 2025లో రెండు సూర్య గ్రహణాలు మరో రెండు చంద్ర గ్రహణాలు సంభవించనున్నాయి. ఇందులో సూర్య గ్రహణాల వరకు వస్తే ఇవి భారత్‌లో పాక్షికంగానే కనిపించనున్నాయి. మొదటి సూర్య గ్రహణం మార్చి 29వ తేదీన ఉదయం 8.50 గంటలకు మొదలై మధ్యాహ్నం 12.43 గంటలకు ముగుస్తుంది. ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, అట్లాంటిక్, అర్కిటిక్ సముద్రాల ప్రాంతంలో ఈ సూర్య గ్రహణం సంపూర్ణంగా కనిపి స్తుంది. కాగా రెండవ సూర్య గ్రహణం సెప్టెంబర్ 21వ తేదీన సంభవించనుంది. సాయంత్రం 5.29 గంటల నుంచి రాత్రి 9.53 గంటల వరకు గ్రహణం వుంటుంది. ఈ సూర్య గ్రహణం ఆస్ట్రేలియా, అంటార్కిటికా, ఉత్తర, దక్షిణ అమెరికాలతో పాటు పసిఫిక్, అట్లాంటిక్ సముద్రాల ప్రాంతంలో సంపూర్ణంగా కనిపిస్తుంది.

రెండు సూ ర్య గ్రహణాలు భారత్‌లో పాక్షికంగానే కనిపిస్తాయని ఆగమన పండితులు చెబుతున్నారు. దీంతో పాటు సూతక్ కాలం ప్రభావం ఏ రాశుల వారి పైనా వుండదని వా రంటున్నారు. ఇక వచ్చే ఏడాది రెండు చంద్ర గ్రహణాలు సంభవించనున్నాయి. ఇందులో మొదటిది మార్చి 14వ తేదీన ఉదయం 10.41 గంటల నుంచి మధ్యాహ్నం 2.18 గంటల వరకు వుండనుంది. ఇది భారత్‌లో కనిపించదు. కాగా సెప్టెంబర్ ఏడవ తేదీనాటి చంద్ర గ్రహణం సంపూర్ణ చంద్ర గ్రహణం.
ఇది భారత్‌లో రాత్రి 8.58 గంటలకు మొదలై అర్ధరాత్రి 12.22 గంటల వరకు వుంటుంది. ఈ గ్రహణం భారత్‌లోని అన్ని ప్రాంతాలలో వీక్షించే అవకాశం వుంది. కాగా 2024లో నాలుగు గ్రహణాలు సంభవించాయి. ఇందులో రెండు సూర్య గ్రహణాలు కాగా మరో రెండు చంద్ర గ్రహణాలు.
ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మొదటి సూర్య గ్రహణం ఏర్పడగా చివరిదైన చంద్ర గ్రహణం సెప్టెంబర్ 18వ తేదీన సంభవించింది.



# కనీస మద్దతుధర శాస్త్రీయంగా నిర్వహించని కేంద్రం

## తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర శాస్త్రీయంగా నిర్వహించడం లేదని తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ ఎం కోదండ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 5వ వార్షికోత్సవ సభ ఘనంగా నిర్వహించడం జరిగింది. కోదండ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర శాస్త్రీయంగా నిర్వహించడం లేదని, రైతు కుటుంబ సభ్యుల (భార్యా, భర్త) కష్టం ( శ్రమ కూలీ) కూడా ఖర్చులకు కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని మనం కలిసి పోరాడాలని చెప్పారు. కనీస వేతన చట్టం, విత్తన చట్టం రైతుకు అనుకూలంగా మార్చాలని సహకార వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత న్యాయమూర్తి మాట్లాడుతూ రెడ్డి ప్రతి ప్రాణి జీవించడానికి గాలి, నీరు ఆహారం అవసరమని అశాస్త్రీయ పారిశ్రామిక విధానాల వలన గాలి, నీరు, కాలుష్యం అవుతున్నాయని విపరీతమైన మందుల వాడకం వలన పంటలు కూడా విషతుల్యం అవుతున్నాయని రైతుల పంటలకు న్యాయమైన ధర దొరకడం లేదని చెప్పారు. శాస్త్రవేత్త బాబురావు, ప్రొఫెసర్ వినాయక రెడ్డి, సోగరా బేగం, ఏలేశ్వరం వెంకటేశ్, లక్ష్మీనారాయణ అడ్వకేట్, ప్రొఫెసర్ వెంకట రాజయ్య, సోగరా బేగం, ఎంఎ అజీజ్ ఎం.పి.జె అధ్యక్షులు, నయనాల గోవర్ధన్, మల్లన్న మరియు ఇతర రైతు, ప్రజా సంఘాలు నాయకులు హాజరయ్యారు. దాతల సహకారంతో కొంతమంది ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల వారికి ఒక్కో కుటుంబానికి వేల ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రతినిధులు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుండి అధిక సంఖ్యలో రైతులు, రైతు సంఘాల నాయకులు, తదితర ప్రజాసంఘాలవారు హాజరయ్యారు.

# విఆర్‌ఓ వ్యవస్థ ఉంటే లగచర్ల ఘటన జరిగేది కాదు

## పూర్వ విఆర్‌ఓ, విఆర్‌ఎలకు అండగా ఉంటా

## వారి సమస్యలను సిఎంకు వివరిస్తా..

### రాష్ట్ర ఉద్యోగుల జెఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), డిసెంబరు 1, ప్రభాతవార్త:** పూర్వ విఆర్‌ఓల సమస్యలన్నింటిని సిఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానని, రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంలో పూర్వ విఆర్‌ఓలు భాగస్వాములు కావాలని, గ్రామ స్థాయిలో విఆర్‌ఓ వ్యవస్థ కీలకమని, రెవెన్యూలో పూర్వ వైభవం తీసుకురావటానికి కిందిస్థాయి నుంచి రెవెన్యూ సంఘాలను బలోపేతం చేస్తామని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. పూర్వ విఆర్‌ఓలకు, విఆర్‌ఏలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని అధైర్యపడొద్దని ఆయన భరోసా కల్పించారు. ఆదివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుల్ల వెంకట్‌రెడ్డి పంక్షన్‌హాల్‌లో రాష్ట్ర పూర్వ విఆర్‌ఓల ఆత్మీయ సమ్మేళనం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు అధ్యక్షతన జరిగింది. పూర్వ విఆర్‌ఓలకు తెలంగాణ డిప్యూటీకలెక్టర్ల సంఘం, తహసీల్దార్ల సంఘం, రెవెన్యూ ఉద్యోగుల సంఘం మద్దతు పలికింది. జెఏసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం విఆర్‌ఓలను దోషులుగా చూపి అన్యాయానికి గురిచేసిందని, విఆర్‌ఓ వ్యవస్థను రద్దుచేసి రాత్రికిరాత్రినే విఆర్‌ఓలందరిని వివిధ శాఖల్లోకి సర్దుబాటు చేసిందని, విఆర్‌ఓల ఉనికిని దెబ్బతీసిందని శాఖల్లోకి నెట్టివేసిందని, ఉనికిని దెబ్బతీసి కుటుంబాలనే ఆర్థిక సంక్షోభానికి గురిచేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. విఆర్‌ఓలను ఆదుకోవాలని, పూర్వ విఆర్‌ఓలను ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో చేర్చేలా చూడాలని ఛైర్మన్ అన్నారు.


పూర్వ విఆర్‌ఓల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఐక్యత, సంఘీభావం పలికిన ఉద్యోగుల జెఏసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, పూర్వ విఆర్‌ఓల అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు, పాల్గొన్న వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు

రెవెన్యూ వ్యవస్థలో పూర్వ విఆర్‌ఓలను కలుపుకొని వెళ్లెలా ప్రభుత్వానికి తెలియజేస్తానని లచ్చిరెడ్డి వారికి భరోసా కల్పించారు. రాష్ట్రంలో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నామకరణంతో ఏర్పాటు చేస్తామని లచ్చిరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర విఆర్‌ఓల సంక్షేమ అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం విఆర్‌ఓ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని, విఆర్‌ఓలను, విఆర్‌ఎలను రద్దు చేసి ఇతర లచ్చిరెడ్డిని విఆర్‌ఓల తరపున కోరారు. విఆర్‌ఓ, విఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వానికి ప్రజలు మంచి గుణపాఠం చెప్పారని అన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర తహసీల్దార్ల సంఘం అధ్యక్షులు సింగారం రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు పొడపంగి రాధ, పలు జిల్లాల అధ్యక్షులు ప్రకాశ రావుతోపాటు అధ్యక్షులు, కార్యదర్శులు, పూర్వ విఆర్‌ఓలు పాల్గొన్నారు.

# పర్యావరణ అవగాహనకు ఎల్‌ఐసి ర్యాలీ

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఎల్ఐసీ సిబ్బంది, ఏజెంట్లు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఈ సైకిల్ ర్యాలీని ర్యాలీని జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఇందిరా పార్కు సమీపం లోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం నుంచి సైకిల్ ర్యాలీ సాగింది. అశోక్‌నగర్, ఆర్టీసీ ఎక్స్ రోడ్స్, చిక్కడపల్లి మీదుగా తిరిగి అదే మార్గంలో చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మహత్బుజ్మాన్, సీనియర్ అధికారులు సతీష్ బాబు, ఉతుప్ జోసెఫ్, సరస్వతి గోపకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన హాస్టళ్లకు నాణ్యమైన సరకులే సరఫరా

## సహకార సంస్థ సిజిఎం సీతారాంనాయక్

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు నిత్యావసరాలు, కాస్మోటిక్స్ అన్నీ తనిఖీ చేయాలని, క్వాలిటీ సరుకులనే సరఫరా చేయాలని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సీజీఎం సీతారాం నాయక్ జీసీసీ గోడౌన్ మేనేజర్లను ఆదేశించారు. రాష్ట్రంలోని గిరిజన హాస్టళ్లు, గురుకులాలను తనిఖీ చేయడంలో భాగంగా భద్రాచలంలోని గిరిజన గురుకుల బాలికల కాలే జీని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఐటీడీఏ ఆఫీసులో జీసీసీ నిర్వ హించిన రివ్యూ మీటింగ్లో మాట్లాడారు. హాస్టళ్లు, ఆశ్రమాలు, గురుకులాల నుంచి వచ్చిన ఇండెంట్ ప్రకారం సరుకులు పంపించాలన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఫుడ్ పాయిజన్ కేసుల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. హెచ్ఎంలు, వార్డెన్లు, ప్రిన్సిపాళ్ల నుంచి ఎన్వోసీ రిపోర్టులు తీసుకోవాలన్నారు. గోడౌన్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతీదీ రికార్డెడ్గా ఉండాలన్నారు. సివిల్ సప్లయ్ ద్వారా వచ్చే బియ్యం నాణ్యతను తనిఖీ చేయాలని చెప్పారు. అటవీ ఉత్పత్తులు దళారీల బారిన పడకుండా, నేరుగా జీసీసీకే తెచ్చి అమ్ముకునేలా చూడాలన్నారు. సరుకుల్లో నాణ్యత లేదని ఫిర్యాదులు వస్తే స్టాఫ్పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జీసీసీ డీఎం సమ్మయ్య, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో హైఅలర్ట్

## పెనుగోలులో ఇద్దరి హత్య తర్వాత

### నక్సల్స్ ఏరివేతకు గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారంలో ఆదివారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ దరిమిలా ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలను అప్రమత్తం చేశారు. ఏటూరు నాగారం సమీప ప్రాంతమైన వాజేడు మండలం పెనుగోలు గ్రామంలో ఇద్దరు గ్రామస్తులను నక్సలైట్లు పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరిట హత్య చేశాక మొత్తం ములుగు జిల్లాలో నక్సల్స్ ఏరి వేతకు హైదరాబాద్ నుంచి భారీగా గ్రేహౌండ్స్ బలగాలు తరలివెళ్లాయి. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంట ర్‌లో ఏడుగురు మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు ప్రకటించారు. గత సెప్టెంబర్ 5న ఏటూరునాగారం అటవీ ప్రాంతానికి సమీపంలోగల భద్రాద్రి జిల్లా కొత్తగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది నక్సలైట్లు మరణించాక జరిగిన భారీ ఎన్‌కౌంటర్ ఇదే కావడం గమనార్హం. ఏటూరు నాగారం ప్రాంతంలో పలుమార్లు నక్సలైట్లు పోలీసులను టార్గెట్ చేస్తూ మందుపాతరలు అమర్చగా కూంబింగ్ పార్టీ వీటిని నిర్వీర్యం చేయడంతో ముప్పు తప్పింది.

ఏటూరు నాగారం అటు భద్రాచలం ఇటు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి సమీపంలో వు ంటుండడంతో నక్సలైట్ల కదలికలపై పోలీసులు నిరంతరం ఓ కన్నేసి వుంచుతారు. ములుగులోని వాజేడు మండలం పెనుగోలులో పది రోజుల క్రితం నక్సలైట్లు ఇద్దరి ని ఇన్‌ఫార్మర్ల పేరిట హత్య చేయడం స్థానికంగా సంచలనం రేపింది. ఈ క్రమంలో జరిగిన ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్ తరువాత భద్రాద్రి కొత్తగూడెంతో పాటు ములుగు, వరంగల్, భూపాపల్లి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలలో హైఅలర్ట్ ప్రకటించారు. దీంతో పాటు ఇతర నక్సల్స్ ప్రభావిత ఏజెన్సీ ప్రాంతాలలో పోలీసులు అప్రమత్తం చేశారు. ఈ ప్రాంతాలలో రహదారులపై వాహనాలను సాయుధ పోలీసులు తనిఖీ చేయసాగారు. ఏజెన్సీ ప్రాంతాలలో గ్రే హౌండ్స్ బలగాలు ముమ్మరంగా కూంబింగ్ చేయసాగాయి. ఈ జిల్లాల పోలీసులను అప్రమత్తం చేయడంతో పాటు నక్సల్స్ కార్యకలాపాలపై నిఘా వుంచాలని ఆదేశించారు. నక్సలైట్ల సానుభూతిపరులపై నిఘా వుంచాలని, ప్రముఖుల ప్రయాణాలకు తగిన భద్రత కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.


# సింగరేణి సమస్త సమాచారం మీ చేతుల్లోనే

## క్యూఆర్ కోడ్‌లను విడుదల చేసిన సిఎండి బలరామ్

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** సింగరేణికి సంబంధించిన ప్రగతి, సంక్షేమం తదితర సమా చారం ఎప్పటికప్పుడు కార్మికులకు, ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు సింగరేణి ప్రజా సంబంధాల శాఖ వినియోగిస్తున్న అన్ని సోషల్ మీడియా మాధ్యమాల క్యూఆర్ కోడులను సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యూఆర్ కోడ్లను స్కాన్ చేయడం ద్వారా సింగరేణి సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తెలుసుకోవచ్చని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి బొగ్గు, విద్యుత్ ద్వారా సేవలందిస్తున్న సింగరేణి తన ఉద్యోగుల సంక్షేమం, కొత్త ఉద్యోగాల కల్పన, సామాజిక బాధ్యత కార్యక్రమాలు, నిరుద్యోగులకి ఉపాధి అవకాశ శిక్షణ, పర్యావరణహిత చర్యలు వంటి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా రక్షణ, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని చెప్పారు.

ఈ విషయాలను ప్రతీ ఒక్కరికి పారదర్శకంగా వివరించాలన్న ఉద్దేశంతో సింగరేణి సామాజిక మాధ్యమాలకు మరింత ప్రచారం మరియు వినియోగం కల్పించడానికి క్యూఆర్ కోడ్‌లు రూపొందించి విడుదల చేస్తున్నా మన్నారు. వీటిని గనుల్లో, కార్యాలయాల్లో, వివిధ శాఖల్లో ఉంచుతామని కార్మికులు, స్థాని కులు వీటిని స్కాన్ చేసి సింగరేణి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లను అనుసరించాలని తద్వారా సింగరేణి గురించి తాజా సమాచారాన్ని పొందవచ్చున్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పి అండ్ పి జి.వేంకటేశ్వర రెడ్డి, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ జి.ఎం ఎస్.డి.సుభానీ పాల్గొన్నారు.



ఆట



# హాకీ టోర్నీలో భారత్ దూకుడు

**ఢిల్లీ:** ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ జట్టు దూసుకెళ్లింది. గత రెండు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన భారత్ జట్టు మస్కట్‌లో మ్యాచ్‌లో 16-0 గోల్స్ తేడాతో చైనీస్ తైపీ జట్టును చిత్తు చేసింది. గ్రూప్ ఎలో భాగంగా జరిగిన పోరులో యువ భారత్ సంపూర్ణ ఆధిపత్యం కనపర్చింది. భారత్ తరపున ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దిల్ రాజ్ సింగ్ 17వ నిముషం, 40వ నిముషం, 45వ నిముషం, 57 నిముషాల్లో నాలుగు గోల్స్‌తో చెలరేగగా, రోషన కుజుర్ 23వ నిముషం, 32వ నిముషం, 42వ నిముషాల్లో, సౌరభ్ ఆనంద్ కుషోవహా 20వ నిముషం, 29వ నిముషం, 58వ నిముషాల్లో చెరో మూడు గోల్స్‌తో అదరగొట్టారు. అర్ష్ దీప్ సింగ్ 37వ నిముషం, 44వ నిముషంలో రెండు గోల్స్ చేయగా, యోగేంబర్ రావత్ 7వ నిముషంలో, ప్రియోబర్తా 31వ నిముషంలో, శార్దానంద్ తివారి 39వ నిముషంలో, అర్జిత్ సింగ్ హుండల్ 54వ నిముషంలో ఒక్కో గోల్ నమోదు చేశారు. మ్యాచ్ ప్రారంభమైన 7వ నిముషంలో రావత్ తొలి గోల్ సాధించిఇ జట్టుకు మంచి ఆరంభం ఇవ్వగా, ఇక అక్కడి నుండి భారత్ ఆటగాళ్లు వరుస గోల్స్‌తో విజృంభించారు. ప్రత్యర్థి డిఫెన్స్‌ను కకావికలం చేస్తూ గోల్స్ వర్షం కురిపించారు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ 9 పాయింట్లు ఖాతాలో వేసుకుని మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇక ఈ నెల 3వ తేదీన సెమీ ఫైనల్స్ జరుగనున్నాయి..గతంలో ఆసియా జూనియర్ హాకీ టోర్నీలో భారత్ 4 సార్లు విజేతగా నిలిచింది.



# ఫుట్‌బాల్ లీగ్‌లో... హైదరాబాద్ పరాజయం

## ముంబయి సిటీ క్లబ్ చేతిలో ఓటమి

**ఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)-2024లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. లీగ్‌లో భాగంగా ముంబైలో జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు 0-1 గోల్ తేడాతే ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ చేతిలో ఓటమి పాలైంది. ముంబై జట్టు తరపున మెహతాబ్ సింగ్ 29వ నిముషంలో ఏకైక గోల్ చేశాడు. మ్యాచ్‌లో ముంబై జట్టు హైదరాబాద్ గోల్ పోస్ట్‌పై 4 షాట్లు బాదగా, అందులో ఒకటి లక్ష్యాన్ని చేరింది. ఇక హైదరాబాద్ మూడు ప్రయత్నాలు చేసిన ఖాతా తెరవలేకపోయింది. 55 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్న ముంబై చివరకు విజేతగా నిలిచింది. తాజా సీజన్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ జట్టు వాటిలో 2 విజయాలు, ఒక డ్రా, 6 పరాజయాలతో 7 పాయింట్లు ఖాతాలో వేసుకుని పాయింట్ల పట్టికలో 11వ స్థానంలో ఉంది. ఇక ముంబై జట్టు 9 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 4 డ్రాలు, 2 పరాజయాలతో 13 పాయింట్లు సాధించి పట్టికలో 6వ స్థానంలో కొనసాగుతోంది. కాగా మరో మ్యాచ్‌లో మోహన్ బగాన్ జట్టు 1-0 గోల్స్ తేడాతో చెన్నైనయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌పై గెలుపొందింది. మోహన్ బగాన్ తరపున జాసన్ కమింగ్స్ 86వ నిముషంలో ఏకైక గోలన సాధించాడు. ఆడిన 9 మ్యాచ్‌ల్లో ఆరో విజయం ఖాతాలో వేసుకున్న బగాన్ జట్టు 20 పాయింట్లతో పట్టికలో అగ్ర స్తానంలో నిలిచింది. హైదరాబాదన జట్టు తమ తదుపరి మ్యాచ్‌ను ఈ నెల 4వ తేదీన గోవా ఫుట్‌బాల్ క్లబ్‌తో తలపడనుంది.

# ఛాంపియన్‌గా సింధు

## సింగిల్స్ ఫైనల్స్‌లో లక్ష్యసేన్ గెలుపు

## మహిళల డబుల్స్‌లో గాయత్రి, ట్రీసా జోడీకి టైటిల్

**ఢిల్లీ:** సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 టోర్నీలో భారత్ క్రీడాకారులు అదగొట్టారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీ చంద్-ట్రీసా జాలీ జోడీ టైటిల్స్‌ను దక్కించుకున్నారు. సింగిల్స్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి.సింధు ఛాంపియన్‌గా నిలిచింది. టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో చైనాకు చెందిన వు లియోతో తలపడ్డ సింధు 21-14, 21-16 తేడాతో నెగ్గింది. తుదిపోరులో జోరు ప్రదర్శించిన సింధు వరుస సెట్లలో నెగ్గి టైటిల్ దక్కించుకుంది. అంతకుముందు సింధు సెమీ ఫైనల్లో భారత్‌కే చెందిన 17 ఏళ్ల ఉన్నతి హుడాపై విజయం సాధించింది. హుడాపై







సింధు 21-12, 21-9తో తేడాతో నెగ్గింది. కాగా, కెరీర్‌లో సయ్యద్ మోదీ టైటిల్ నెగ్గడం సింధుకు ఇది మూడోసారి. ఇదివరకు ఆమె 2017, 2022 టైటిల్ గెలుపొందింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ కూడా ఫైనల్‌లో గెలుపొందాడు. సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జేసన్ తేపై 216, 217తో విజయం సాధించాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ ట్రీసా జాలీ జోడీ అదరగొట్టింది. ఫైనల్‌లో 21-18, 21-11 తేడాతో చైనాకు చెందిన జోడీ బావో లి జింగ్, లీ కియాన్‌పై వరుస గేమ్‌ల విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. గాయత్రి ట్రీసా జోడీకిది తొలి సూపర్ 300 టైటిల్ కావడం విశేషం. ఈ టోర్నీలో టైటిల్‌ను గెలిచిన తొలి భారత మహిళల డబుల్స్ జోడీగా రికార్డు సృష్టించింది. ఈ జోడీ 2022 ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. కాగా మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల డబుల్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో అయిదో సీడ్ తనీషా ధ్రువ్ 2118, 1421, 821తో డెచాపోల్, డెచాపోల్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడారు. పురుషుల డబుల్స్ ఫైనల్‌లో పృథ్వీ ప్రతీక్ జోడీ పోరాడింది. 71 నిమిషాలపాటు సాగిన టైటిల్ పోరులో 1421, 2119, 1721తో హువాంగ్ డి, లియు యాంగ్ (చైనా) ద్వయం భారత జోడీపై విజయం సాధించింది.



# ఉత్కంఠగా డబ్ల్యూటిసి ఫైనల్

## టాప్2 నుంచి ఆస్ట్రేలియా ఔట్

## టీమిండియా ప్లేస్!

**ఢిల్లీ:** ఆ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25 ఫైనల్ రేసు ఉత్కంఠగా మారింది. భారత్, ఆస్ట్రేలియా, దక్షి ణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్‌లు ఫైనల్ రేసులో ప్రధాన పోటీదారులుగా నిలిచాయి. తాజాగా పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియాను ఓడించి పాయింట్ల పట్టికలో టీమిండియా మొదటి స్థానంలో నిలిచింది. అయితే ఇప్పుడు ఆస్ట్రేలియాకు మరో పెద్ద దెబ్బ తగిలింది. ఇప్పుడు ఆ జట్టు టాప్-2 ప్లేస్ నుంచి కిందకు పడిపోయింది. డర్బన్‌లోని కింగ్స్‌మీడ్‌లో దక్షి ణాఫ్రికా-శ్రీలంక మధ్య రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో దక్షి ణాఫ్రికా జట్టు 233 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీం తో 2023-25 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారీ వ ర్పులుచోటు చేసుకున్నాయి. శ్రీలంక జట్టు ప్రస్తుతం దక్షి ణాఫ్రికా పర్యటనలో ఉంది. ఇరు జట్ల మధ్య 2 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరుగుతోంది. సిరీస్‌లో మొదటి మ్యాచ్ కింగ్స్‌మీడ్ డెర్బీలో జరిగింది. ఈ మ్యాచ్‌లో దక్షి ణాఫ్రికా జట్టు 233 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో దక్షి ణాఫ్రికా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికను పూర్తిగా మార్చేసింది. దక్షి ణాఫ్రికా జట్టు మొత్తం 9 మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 3 ఓటములతో రెండో స్థానంలో నిలిచింది. ఆ జట్టు విజయాల శాతం పాయింట్లు ఇప్పుడు 59.25గా మారింది. దీంతో ఆస్ట్రేలియా జట్టు ఫైనల్ రేసులో వెనుకబడింది. మరోవైపు శ్రీలంక జట్టు 3వ స్థానం నుంచి 5వ స్థానానికి పడిపోయింది. 10 టెస్టు మ్యాచ్‌ల్లో ఆ జట్టుకు ఇది 5వ ఓటమి. లంక జట్టు విజయాల శాతం 50.00గా ఉంది. ఇది అంతకుముందు 55.56. దీంతో పాటు 15 మ్యాచుల్లో 9 విజయాలతో 61.11 శాతం పాయింట్లతో టీమ్ ఇండియా అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఆస్ట్రేలియా జట్టు 13 మ్యాచ్‌ల్లో 8 విజయాలు సాధించి 57.69 శాతం పాయింట్లతో మూడో స్థానానికి పడిపోయింది. ఇక మ్యాచ్‌లో దక్షి ణాఫ్రికా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకు ఆలౌటైంది. దీనికి సమాధానంగా శ్రీలంక జట్టు ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 13.5 ఓవర్లు మాత్రమే ఆడి 42 పరుగులకే కుప్పకూలింది. దీని తర్వాత, దక్షి ణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ లో అద్భుతంగా బ్యాటింగ్ చేసి 5 వికెట్ల నష్టానికి 366 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. తద్వారా శ్రీలంకకు మ్యాచ్‌లో 516 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉంచింది. అయితే దానికి సమాధానంగా శ్రీలంక జట్టు 282 పరుగులకే ఆలౌట్ అయి 233 పరుగుల తేడాతో ఓడిపో యింది. అంటే ఇప్పుడు దక్షి ణాఫ్రికాకు టీమిండియాను అధిగమించే అవకాశం దక్కబోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అడిలైడ్ టెస్టులో టీమిండియా ఎలాగైనా గెలవాల్సిందే.

# ఐసిసి అధ్యక్షుడిగా జై షా బాధ్యతలు



**ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా జై షా బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయాన్ని ఐసీసీ ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది ఆగస్టులో ఆయన ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైయారు. ఇంతకు ముందు వరకూ ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్క్లే పని చేసి నాలుగు సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా కొనసాగారు. జై షా రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఇప్పటి వరకూ ఆయన భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) కార్యదర్శిగా పని చేశారు ఆయన పదవీ కాలం ముగియడంతో ఐసీసీ అధ్యక్షుడిగా జై షాను ఎంపిక చేశారు. కాగా ఐసీసీకు ఇంతకు ముందు దివంగత జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, శశాంక్ మనోహర్, పారిశ్రామికవేత్త ఎన్ శ్రీనివాసన్ ఐసీసీ అధ్యక్షులుగా పని చేశారు. ఇక ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జై షా ముందు సవాళ్లు ఉన్నాయి. దాయాది దేశం పాక్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. ఈ ట్రోఫీ కోసం జట్టును పాక్‌కు పంపేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఐసీసీ చైర్మన్‌గా ఆయన వ్యవహరించనున్నారు. హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు ఆ దేశాన్ని ఒప్పించడం షా ముందున్న పెద్ద సవాల్‌గా మారనున్నది.

వాణిజ్యం

# పసిడి ధరల పెరుగుదల బ్యాంకులకు లాభమే..

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** రోజుకి రోజుకి మారుతున్న బంగారం, వెండి ధరలు సామాన్యులకి కొనాల వద్ద అని ఆలోచనకి గురిచేస్తున్నాయి. అయితే బంగారం ధర మాత్రం తగ్గతూ పెరుగుతూ వస్తున్న గతంతో పోల్చుకుంటే పసిడి ధర భారీగా పెరిగింది. మరోపక్క బంగారానికి, బంగారు ఆభరణాలకు ఇండియాలో మంచి క్రేజ్ ఉంది. ప్రస్తుతం బంగారం ధర 80వేలకీ దగ్గర ఉంటే వెండి మాత్రం లక్షకి చేరింది. భారత దేశంలో ధరలు పెరగటంతో ప్రజలు ఖర్చులను అధిగమించడానికి అలాగే పెట్టుబడులు పెట్టడా




నికి బంగారం ధర పెంపును ఉపయోగించుకుంటున్నారు. ఇందుకు ప్రజలు ఎక్కువగా బ్యాంకుల నుండి గోల్డ్ లోన్ తీసుకుంటుండటంతో బ్యాంకుల్లో గోల్డ్ లోన్ విభాగం భారీగా వృద్ధి చెందింది.బంగారం ధరలు పెరగడం, బ్యాంకులపై ఆర్‌బిఐ కఠినమైన ఆంక్షల కారణంగా ప్రజలు బంగారంపై లోన్లు తీసుకోవడం కూడా పెరిగింది. అదేవిధంగా బ్యాంకులు కూడా బంగారంపై లోన్లు తక్కువ వడ్డీకే ఇస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6 నెలలల్లో బ్యాంకుల్లో గోల్డ్ లోన్ల శాంక్షన్ దాదాపు 43.4 శాతం పెరిగింది. దీని ద్వారా కేవలం 2024 సెప్టెంబర్ నెలలో బంగారంపై రూ.1,47,081 కోట్ల లోన్లు మంజూరు చేసారు, అలాగే మార్చి 2024లో రూ.1,02,562 కోట్లు మాత్రమే. ఎన్‌బీఎఫ్‌సీలకు ఇచ్చిన లోన్లతో కలిపి ఒక్క సెప్టెంబర్‌లోనే రూ.3 లక్షల కోట్లకు పైగా శాంక్షన్ చేశారు. అయితే మొదటిది బంగారం ధరల పెరుగుదల బంగారంపై లోన్ తీసుకునేలా ప్రజలను ప్రోత్సహిస్తుంది. బంగారం ధరలు పెరిగేకొద్దీ, లోన్‌టువాల్యూ (ఎల్‌టివి) రేషియో కూడా పెరుగుతుంది, బ్యాంకులు మీ బంగారు ఆభరణాలపై ఎక్కువగా లోన్ తీసుకునేందుకు వీలు కల్పిస్తుంది. రెండవది, గోల్డ్ లోన్ సెగ్మెంట్‌లో కొన్ని లోపాల గురించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆందోళనల నేపథ్యంలో బ్యాంకులు లోన్ ప్రమాణాలను కఠినతరం చేశాయి. ఫలితంగా, కస్టమర్లు నమ్మకమైన లేదా నమ్మదగినదిగా భావించే బ్యాంకులవైపు మొగ్గుచూపు తున్నారు. ముఖ్యంగా బంగారులోన్లలో కింగ్‌మేకర్‌లుగా ఉన్న ఆర్థిక సంస్థలు (ఎన్‌బిఐఎఫ్) కూడా ఈ విభాగం మొత్తం వృద్ధికి గణనీయంగా దోహదపడ్డాయి. ఈ రంగంలోని ప్రముఖ కంపెనీల్లో ఒకటైన ముత్తూట్‌ఫైనాన్స్ మార్చి 2024 నాటికి రూ.75,827 కోట్ల గోల్డ్ లోన్ ఆస్తులను నిర్వహిస్తోంది. కస్టమర్లు తాకట్టు పెట్టిన 188 టన్నుల బంగారం ఇక్కడ ఉంది. గోల్డ్‌లోన్ మార్కెట్‌పై ఆర్‌బిఐ తాజాగా ఆంక్షల వెనుక ప్రధానకారణం ఎన్‌బిఎఫ్‌సి ద్వారా నియమించిన థర్డ్ పార్టీ కంపెనీలు, ఇవి ఎక్కువగా అక్రమాలు, గోల్డ్ లోన్లలో అక్రమాలకు పాల్పడటమే కాకుండా, క్లెయిమ్ చేయని బంగారంపై లోన్లు ఇవ్వడం, బంగారు ఆభరణాల తాకట్టు వేలం వేసేటప్పుడు నిబంధనలను ఉల్లంఘించడం ఆర్‌బీఐ నిఘాలో తేలింది.

# ఐటి జాబ్స్‌కు భారీ డిమాండ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** టెక్నాలజీ వేగవంతంగా మారిపోతున్న నేపథ్యంలో దేశీయంగా ఐటీ సర్వీసుల కోసం ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. వచ్చే ఆరు నెలల్లో నియామకాలు 10-12 శాతం వరకు పెరగనున్నాయి. జనరేటివ్ ఏఐ, డీప్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్ మొదలైన కొత్త టెక్నాలజీలతో 2030నాటికి పలు ఉద్యోగాల కల్పన జరగనుంది. బిజినెస్ సర్వీసుల సంస్థ క్వెస్ కార్ప్స్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండు త్రైమాసికాల్లో క్వాస్ ఐటీ స్టాఫింగ్ విభాగం కార్యకలాపాల ఆధారంగా దీన్ని రూపొందించారు. టెక్ నియామకాలకు నెలకొన్న డిమాండ్, మార్కెట్లోప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి అవగాహన కల్పించే విధంగా సంస్థను ఇందులో గుర్తించారు. దీని ప్రకారం దేశవ్యాప్తంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), సైబర్‌సెక్యూరిటీ విభాగాల్లో రెండో త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్) నిపుణులైన సిబ్బందికి డిమాండ్ పెరిగింది. సీక్వెన్షియల్ ప్రాతిపదికన క్రితం త్రైమాసికంతో పోలిస్తే జీసీసీలో 71శాతం, సైబర్‌సెక్యూరిటీలో 58 శాతం మేర ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పుష్కలంగా టెక్ నిపుణుల లభ్యత, వినూత్నంగా ఆలోచించగలిగే సామర్థ్యాలతో డిజిటల్ విప్లవానికి సంబంధించి భారత్ ముందంజలో ఉంటున్న నేపథ్యంలో దేశీయంగా వచ్చే 6 నెలల్లో ఐటీ సర్వీసుల్లో హైరింగ్ 10-12 శాతం పెరగవచ్చని క్వెస్ ఐటి స్టాఫింగ్ సీఈవో కపిల్ జోషి తెలిపారు. నివేదిక ప్రకారం రెండోత్రైమాసికానికి సంబంధించి హైరింగ్ డిమాండ్‌లో 79శాతం వాటా, ఈఆర్పీ, టెస్టింగ్, నెట్‌వర్కింగ్, డెవలప్‌మెంట్, డేటా సైన్స్ వంటి అయిదు నైపుణ్యాలది ఉంది. వీటికి తోడు జావా (30 శాతం), సైబర్‌సెక్యూరిటీ (20 శాతం), డెవ్‌లప్స్ (25 శాతం) వంటి ప్రత్యేకనైపుణ్యాలకు కూడా డిమాండ్ ఉంది. క్యూ2లో టెక్ హైరింగ్‌కి సంబంధించి జీసీసీలు ముందంజలో ఉన్నాయి. ఏఐ/ఎంఎల్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్, డెవలప్స్ నిపుణులకు డిమాండ్ కనిపించింది. ప్రాంతాలవారీగా చూస్తే మొత్తం ఉద్యోగావకాశాలకు సంబంధించి 62శాతం వాటాతో బెంగళూరు అగ్రస్థానంలో ఉంది. 43.5 శాతంతో హైదరాబాద్ తర్వాత స్థానంలో ఉంది.



# బీమా పాలసీలతో ప్రయోజనాలెన్నో..


**ముంబై, డిసెంబరు 1:** సాధారణంగా యుక్త వయసులో ఉన్నప్పుడు ఎలాంటి అనారోగ్యాలు మన దరికి చేరవు. కొం చెం వయసు మీదపడిన తర్వాత దాడి చేస్తాయి. ఆ సమయంలో ఆస్పత్రిలో ఖర్చులకు లక్షల రూపాయలు ఖర్చవు తాయి. ఇలాంటి వాటి నుంచి బీమా భరోసా కల్పిస్తుంది. దేశంలో ప్రస్తుతం జనరేషన్ జెడ్ హవా నడుస్తోంది. టర్మ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ పాలసీ ఒక భద్రతా వలయంలా పనిచేస్తుంది.అనుకోని ఆపద ఎదురైనప్పుడు కుటుంబాన్ని రక్షి స్తుంది. హోమ్‌లోన్లు, వ్యక్తిగత రుణాలు, బకా యిలను తీర్చుతుంది. అలాగే అద్దె, కిరాణా, యుటిలిటీ బిల్లులను చెల్లిస్తుంది. ఆర్థిక ఒత్తిడి లేకుం డా పిల్లల చదువు, పెట్టుబడు లు, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించడానికి సాయం పడుతుంది. ఉరుకుల పరుగుల జీవితం, కాలుష్యం, పని ఒత్తిడి తదితర కారణాలతో నేడు చిన్న వయసులోనే అనారోగ్యాల బారిన పడుతున్నారు. టర్మ్ జీవితబీమా ఆరోగ్య సంబంధ మరణాల నుంచి ఆర్థిక రక్షణ అందిస్తుంది. అలాగే వైద్య ఖర్చులను కవర్ చేయడా నికి సాయపడుతుంది. చిన్న వయసులో బీమా తీసుకోవడం వల్ల తక్కువ ప్రీమియం పడుతుంది. తక్కువ ఖర్చుతోనే బీమా కవరేజీ లభిస్తుంది. జెనరేషన్ జెడ్ కేటగిరీ యువత ఈ సమయంలో బీమా తీసుకోవడం వల్ల అనేక ప్రయోజ నాలు కలుగుతాయి. సాధారణంగా జెన్ జెడ్ యువత రుణాలు, క్రెడిట్ కార్డులు, హోసింగ్‌రుణాలు తీసుకుని ఉంటారు. అనుకోకుండా మరణం సంభవిస్తే వారిపై ఆధారపడిన కుటుంబానికి వీటి చెల్లింపులు భారంగా మారతాయి. టర్మ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ పాలసీ తీసుకోవడం వల్ల ఈ రుణాలన్నీ తీర్చే అవకాశం ఉంటుం ది. కుటుంబంపై ఆర్థిక ఒత్తిడి ఉండదు. కంపెనీ యజమా నులు తమ ఉద్యోగుల కు సమూహ జీవిత బీమా అందిస్తారు. దానివల్ల ప్రయో జనం ఉన్నప్పటికీ మీ వ్యక్తిగత అవసరాలను తీర్చలేక పోవచ్చు.




మీరు ఆ కంపెనీలో ఉద్యోగం మానేసినప్పుడు ఇక వర్తించదు. కాబట్టి వ్యక్తిగత బీమా పాలసీ తీసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. దేశంలో ఆన్ లైన్ ఇన్స్యూరెన్స్ ప్రొవైడర్లు పెరిగారు. డైరెక్ట్ టు కన్స్యూమర్ (డీ2సీ) విధానంలో పాలసీలను తీసుకునే అవకాశం ఉంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా డైరెక్టుగా బీమాతీసుకోవచ్చు. కుటుంబ పోషణకు మీరే కీలకమైతే, మీ ఆదాయంతోనే గడిచే పరిస్థితి ఉంటే తప్పకుండా బీమా తీసుకోవాలి. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు మీ కుటుంబానికి అండగా నిలుస్తుంది. వారికి ఆర్థిక ఒత్తిడి లేకుండా చూస్తుంది. ఇన్స్యూరెన్స్ పాలసీ ప్రీమియాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 సీ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది.

# డెబిట్‌కార్డు లేకుండా యుపిఐ పిన్‌ని సెట్ చేయండిలా..

**ముంబై, డిసెంబరు 1:** యుపిఐ పిన్ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) యుపిఐ సర్వీసులను అందిస్తుంది. యూపీఐలో అన్ని మార్పులు, అప్‌డేట్‌లు ఎన్‌పిసిఐ ద్వారా మాత్రమే అమలు అవుతాయి. అదే విధంగా ఎన్‌పీసీఐ ఇప్పుడు డెబిట్‌కార్డ్ లేకుండా యుపిఐ పిన్‌ని సెట్ చేయడానికి వినియోగదారులను అనుమతిస్తుంది. యుపిఐ చెల్లింపు సులభంగా చేస్తోంది. యూపీఐ డిజిటల్ చెల్లింపులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. దాని సహాయంతో వినియోగదారు ఏ విక్రేతకైనా సులభంగా చెల్లింపు చేయవచ్చు. చెల్లింపు చేయడానికి వినియోగదారు తప్పనిసరిగా తన స్వంత బ్యాంక్ ఖాతాతో పాటు డబ్బు పంపే వినియోగదారు యూపీఐ ఐడీ ఉండాలి. యూపీఐ చెల్లింపు చేయడానికి వినియోగదారు తన మొబైల్‌ను ప్రామాణీకరించాలి. దాని కోసం అతనికి డెబిట్ కార్డ్ అవసరం. ఇప్పుడు కార్డ్ లేని వినియోగదారులు యూపీఐని సెట్ చేయవచ్చు. మీరు యూపీఐ పిన్‌ను రెండు మార్గాల్లో సెట్ చేయవచ్చు. వినియోగదారులు తమ యూపీఐని రెండు మార్గాల్లో సెట్ చేయవచ్చు. ఒక డెబిట్‌కార్డ్, మరొకటి ఆధార్ కార్డ్ (ఒటిపి). ఆధార్ కార్డ్ ద్వారా పిన్ సెట్ చేయడానికి వినియోగదారు ఆధార్‌ను




అతని మొబైల్ నంబర్‌కు లింక్ చేయడం అవసరం. అలాగే యూపీఐ యూజర్ మొబైల్ నంబర్ కూడా బ్యాంక్‌లో నమోదై ఉండాలి. ముందుగా యూపీఐ అప్లికేషన్‌ను ఓపెన్ చేసి మీ బ్యాంక్ ఖాతాను జోడించుపై క్లిక్ చేయాలి. తదుపరి స్లయిడ్‌లో సెట్ యూపీఐ పిన్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

# పెరుగుతున్న డిజిటల్ అరెస్టు భయాలు

**ముంబై, డిసెంబరు 1:** దేశంలో డిజిటల్ సేవలను ప్రజలు చాలా ఉపయోగించుకుంటున్నారు. డిజిటల్ టెక్నాలజీ కారణంగా చాలా మంది ఏ పని చేయాలన్నా ఆన్‌లైన్ ద్వారా సులువుగా చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ చెల్లింపు నుండి ఆధార్ అప్‌డేట్ లేదా ఏదైనా ఫారమ్ నింపడం వరకు, ఇప్పుడు ప్రజలు ఇంటి నుండి ఆన్‌లైన్‌లో తమ పనిని సులభంగా చేసుకోవచ్చు. ఒక వైపు ఆన్‌లైన్ సేవలు సులభతరమయితే.. మరో వైపు సైబర్ దుండగులు కూడా రెచ్చిపోతున్నారు. ఇటీవల, దుండగులు తమను మోసం చేసిన వ్యక్తులను డిజిటల్‌గా అరెస్టు చేసిన కేసులు చాలా ఉన్నాయి. డిజిటల్ అరెస్ట్ అనేది మోసాలలో కొత్త పద్ధతి. దీనిలో దుండగులు ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ ప్రజలను మోసం చేస్తారు. దీనితో పాటు, అతను ప్రభుత్వ అధికారిగా నటిస్తూ, ప్రజలకు వీడియో కాల్స్ చేస్తాడు. వారిని నమ్మించి పూర్తి వివరాలు రాబట్టి భారీ ఎత్తున డబ్బులను డిమాండ్ చేస్తాడు. ఈ కొత్త తరహా మోసాన్ని డిజిటల్ అరెస్ట్ అంటారు. స్మగ్లింగ్‌లో మీ పేరు ఉందంటూ, ఈ రకమైన మోసంలో మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌లో వారి పేరు ప్రమేయం ఉందని, మీపై కేసులు నమోదు అవుతాయని భయభ్రాంతులకు గురి చేస్తారు. ఈకేసు నుంచి బయట పడాలంటే డబ్బులు ముట్ట చెప్పుకోవాల్సిందే బెదిరిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.



దీని తర్వాత నేరగాళ్లు ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ డబ్బులు ఇస్తే జైలుకు వెళ్లకుండా కాపాడుతామని ప్రజలను నమ్మించేలా చేస్తున్నారు. ఇలాగే చాలా మంది ఈ మోసగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు ఇస్తున్నారు. ఇది కాకుండా, వారి సన్నిహితులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నారని ప్రజలు తరచుగా చెబుతారు. ఒకరి బిడ్డ పోలీసు కేసులో ఇరుక్కుంటే.. వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ట్రాప్ చేసే ప్రయత్నం చేస్తారు. ఈ నేరగాళ్లు ఎక్కువగా పోలీస్ యూనిఫాం ధరించి వీడియో కాల్స్ ద్వారా ప్రజలను మోసం చేస్తున్నట్టు సమాచారం. ఇది మాత్రమే కాదు, ఈ మోసాలకు బాధితులు ఇంజనీర్లు, చాలా విద్యావంతులు, ఐటీ కంపెనీల వ్యక్తులు కూడా ఉన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14